22-03Pg1fB.qxd:22-03Pg1fB.qxd 01/01/01 8:04 AM Page 1

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

ఒంగోలు, : fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

22-3-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 49 పేజీలు: 12 వెల: 6.50





శుక్రవారం పద్మావతి అతిథిగృహంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

# ఆలయ నిర్మాణాలకు ప్రత్యేక ట్రస్టు

>> విరాళాలు అందాయన్నారు. అలాగే 2003లో బ్రహ్మోత్సవాల్లో పట్టువస్త్రాలు సమర్పించేందుకు వచ్చినపుడు తిరుపతి స్విమ్స్ ఆ స్పత్రిలో ఎస్వీప్రాణదానం ట్రస్టును ఏర్పాటు చేశామన్నారు. ఎంతో మంది పేదలకు ఈ పథకం ద్వారా ప్రాణాలు కాపాడగలుగుతున్నామన్నారు. ఇప్పుడు మాధవసేవలో భాగంగా మూడవ కార్యక్రమంగా ఆలయాల నిర్మాణానికి ప్రత్యేక ట్రస్ట్‌ను ఏర్పాటుచేసి, నిధులు సేకరించేలా అధికారులకు సూచనలు చేశానన్నారు. ట్రస్ట్‌కు వచ్చే నిధులు పకడ్బందీగా ఖర్చు చేస్తామన్నారు. వేంకటేశ్వరస్వామి ఆస్తులు ఎవరు కబ్జాచేసినా వాటిని తిరిగి దేవుడికి చెందేలా చేస్తామని సిఎం ఉద్ఘాటించారు.

**వేంకటేశ్వరస్వామి ప్రాణభిక్షతోనే బతికా:** ఏడుకొండలు శ్రీవేంకటేశ్వరస్వామి సొంతమని, అక్కడ అపవిత్రత చేయడం,వ్యాపారాలు చేయడం జరగకూడదని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 2003లో ప్రాణదానం ప్రారంభించి తిరుమలకు వస్తున్న సమయంలో తనపై24క్లైమోర్‌మైన్స్ పేల్చారు.ఆ పెద్దప్రమాదంలో తాను ప్రాణాలతో బ్రతికేవాడిని కాదని, సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరస్వామి ప్రాణభిక్ష పెట్టారని ,ఆ స్వామి మహిమ ఏంటో ఆలోచనచేయా లన్నారు.శ్రీవేంకటేశ్వరస్వామి మహిమ వల్లే ప్రాణాలతో బ్రతికానని విశ్వాసం వ్యక్తం చేశారు.

**మూడు హోటళ్ళకు కేటాయించిన భూమి రద్దు:** తిరుమల పవిత్రమైన పుణ్యక్షేత్రమని, ఏడుకొండల వేంకటేశ్వరస్వామి మహిమాన్వితమైన దేవుడని ఆయన అన్నారు. గత ఐదేళ్ళలో తిరుమల పవిత్రత కోసం చాలా పోరాటాలు చేశామన్నారు. అందుకే అధికారంలోకి వచ్చిన తరువాత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం నుండే ప్రక్షాళన చేపట్టామన్నారు.శేషాచలం కొండలు ఆనుకుని ఉన్న దేవలోక్, ముంతాజ్, ఎంఆర్‌కేఆర్ హోటల్స్‌కు అనుమతులు ఇచ్చి 35.32ఎకరాలు భూమి కేటాయించారు. ఈ కేటాయింపులను రద్దుచేస్తున్నామని సిఎం చంద్రబాబు ప్రకటించారు. ఏడుకొండలు ఆనుకుని ఎవరూ వ్యాపారం చేయడం ,అపవిత్రం చేయడానికి వీల్లేదన్నారు.తిరుమలలో అన్యమతస్థులను తొలగిస్తామని, ఎక్కడా ఆలయాల్లో అలాంటి వారు లేకుండా చూస్తామన్నారు.క్రిస్టియన్,ముస్లిం ఆలయాల్లో కూడా ఇతర మతస్థులు ఉండరన్నారు. ఏ మతానికి చెందిన ఆలయాల్లో ఆ మతస్థులే ఉంటారని అన్నారు.ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆస్తులను కాపాడటానికి కంకణం కట్టుకున్నామని సిఎం తెలిపారు. దేశంలోని అన్నిరాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాలను నిర్మించాలని, ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాస్తామని చంద్రబాబు చెప్పారు.తిరుమలలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడతామని, పవిత్రతను కాపాడటంలో ఉద్యోగులు ఒకడుగు ముందుకేయాలని ఆయన కోరారు. ఈ మీడియా సమావేశంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

# వేంకటేశ్వరస్వామి ఆస్తులు కబ్జా కానివ్వం

## రక్షణకు చర్యలంటూ సిఎం చంద్రబాబు పునరుద్ఘాటన

**తిరుమల.మార్చి 21ప్రభాతవార్తప్రతినిధి:** అత్యంత సంపన్నవంతమైన తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేలకోట్లరూపాయలు విలువైన ఆస్తుల రక్షణకు మరింత పటిష్టచర్యలు తీసుకుంటామని సిఎం చంద్రబాబునాయుడు ఉద్ఘాటించారు. ఎక్కడైనా దేవుని ఆస్తులు కబ్జా చేసివున్నా తిరిగి కాపాడుకోవడానికి కంకణంకట్టుకున్నామన్నారు. వెంకన్న ఆస్తులు నిరుపయోగం కాకుండా ఉండేందుకు చూస్తూ తమిళనాడులోని కొన్ని ఆస్తులను విక్రయించాలని గతంలో టిటిడి పాలకమండలి నిర్ణయించడం, అప్పట్లో తలెత్తిన రసాభాస పరిణామాలతో పాలకమండలి ,టిటిడి అధికారులు ముందుచూపుతో అప్రమత్తమయ్యారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో భక్తులు తమ కానుకగా, దేవునిపై భక్తివిశ్వాసాలతో స్థిరాస్థులు, భూములు ఇనాంగా రాసిచ్చారు. ఈ ఆస్తులను ఎవరూ కూడా విక్రయించడానికి వీలులేకుండా పాలకమండలి తీర్మానం చేసి, ప్రత్యేక జిఓను కూడా జారీచేసింది. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దేవుని ఆస్తులు కాపాడటానికి కంకణం కట్టుకున్నామని శుక్రవారం మీడియాకు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న వెంకన్న ఆస్తులను పూర్తిస్థాయిలో గుర్తించి ఎక్కడా అన్యాక్రాంతం కాకుండా చూడాలని, అప్పటికే పలువురు చేతిలో ఉన్న వాటిని వెనక్కుతీసుకుని పరిరక్షించాలని టిటిడి అధికారులకు సూచించానన్నారు.ఉమ్మడి చిత్తూరుజిల్లాలో తిరుపతి,రూరల్ పరిసరాల్లో, చంద్రగిరి, తొండమనాడు, నాగలాపురం ప్రాంతాలతోబాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, కర్నాటక, ఒరిస్సా, ఢిల్లీ వంటి ప్రధాన నగరాల్లో శ్రీవారికి ఆస్తులు ఉన్నాయి. ఆస్తులన్నీటినీ గుర్తించి అన్యాక్రాంతం కాకుండా చూసేందుకు చర్యలు తీసుకోనుంది. దేశవ్యాప్తంగా తిరుమల తిరుపతి దేవస్థానానికి శ్రీవేంకటేశ్వరస్వామిపేరున 9780వరకు ఆస్తులున్నాయి. ఈ ఆస్తులన్నీటినీ పరిరక్షించుకునే దిశగా చర్యలు తీసుకోనున్నారు. గతంలో 29 ప్రాంతాల్లో ఆక్రమణకు గురైన దాదాపు 23కోట్ల రూపాయలు విలువైన 20.45 ఎకరాల వెంకన్న భూములను టిటిడి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అప్పటికే 109 ఆస్తులను లీజుకు ఇవ్వడంతో టిటిడికి 4.15కోట్ల రూపాయలు ఆదాయం సమకూరుతుంది. ఇదేగాక దేశంలోని పలుప్రాంతాల్లో జనక్‌పురి, రిషికేష్, డెహ్రాడూన్ తదితర దూర ప్రాంతాల్లో ఉన్న ఆస్తులను ఆక్రమణలకు గురికాకుండా టిటిడి చూసే వీలుకలుగుతుంది. అంతేగాక దేశవ్యాప్తంగా ఉన్న వెంకన్న ఆస్తులను పూర్తిస్థాయిలో పరిరక్షించేందుకు ,రక్షణచర్యలుతీసుకోవడానికి అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఇప్పుడు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో టిటిడికి చెందిన ఆక్రమణలకు గురైన స్థలాలను పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకునే దిశగా పటిష్టచర్యలు తీసుకోనున్నారు.

# డ్రగ్స్ దుర్వినియోగంపై విజిలెన్స్ కొరడా

>> షాప్ నిర్వాహకులు అమ్మితే చట్టపరమైన చర్యలు చేపడు తామని, క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని రవికృష్ణ హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లాలో పలు మెడికల్ షాపుల్లో ఆపరే షన్ గరుడ కొనసాగుతోంది. ఏలూరు జిల్లాలో ద్వారకాతిరుమల మెడికల్ షాపులలో డ్రగ్, విజిలెన్స్, పోలీస్, ఈగల్ టీం ఆధ్వర్యంలో తనిఖీలు కొనసాగుతున్నాయి. కర్నూలు జిల్లాలోని నంద్యాల ఆదోనిలో ఆపరేషన్ గరుడ కొనసాగుతోంది. ఇందులో భాగంగా భారీగా ఎన్ఆర్ఐ డ్రగ్స్‌ను అధికారులు గుర్తించారు. డాక్టర్ మందుల చీటి లేకుండానే మెడికల్ షాపు నిర్వాహకులు నేరుగా జనానికి మందులు అమ్ముతున్నట్లు అధికారులు గుర్తించారు.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలా పురంలో ఆపరేషన్ గరుడా పేరుతో మెడికల్ షాపులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మెరుపు దాడులు చేస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిని స్నేహిత ఆధ్వర్యంలో అమలాపురం పట్టణంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ , మందుల షాపులలో తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు ఆపరేషన్ గరుడను చేపట్టినట్టు విజిలెన్స్ ఇన్స్పెక్టర్ మధు వెల్లడించారు. విజిలెన్స్ దాడుల నేపథ్యంలో పట్టణంలో పలు మందుల షాపు నిర్వాహకులు.మెడికల్ షాపులు మూసివేశారు. ప్రకాశం జిల్లాలో మెడికల్ షాపులపై దాడులు నిర్వహిస్తున్నారు. కడపనగరంలో ఆపరేషన్ గరుడ జోరుగా సాగుతోంది.డీజీపీ ఆదేశాల మేరకు ఏఎస్పీ శ్రీనివాసుల రావు ఆధ్వర్యంలో దాడులు జరుగుతున్నాయి. కడపలోని మెడికల్ షాపుల్లో అక్రమ మత్తుపదార్థాలు ఉన్నాయని సమాచారం మేరకు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ కడప, ప్రొద్దుటూరు, అన్నమయ్య జిల్లాలోని రాజంపేట, మదనపల్లెలో దాడులు నిర్వహిస్తున్నామని తెలిపారు. మెడికల్ దుకాణాల్లో సరైన రికార్డులు ఉన్నాయా లేదా అని తనిఖీలు నిర్వహించామన్నారు. మత్తును కలిగించే మందులు అమ్మడం నేరం కాకపోయినా వైద్యుల పర్యవేక్షణ, ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మడం నేరమని తెలిపారు. పలు మెడికల్ దుకాణాలపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు.ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మెడికల్ ఏజెన్సీలు, మందులషాపులపై దాడులు నిర్వహించారు. రాజమండ్రి గణేష్ చౌక్ తిరుమల శ్రీనివాస్ మెడికల్ ఏజెన్సీలో విజిలెన్స్‌ఎస్పీ ఎం.స్నేహిత, డ్రగ్స్ ఏడీ నాగమణి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రాజమండ్రిలో డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా తిరుమల ఏజన్సీలో విక్రయిస్తున్న ట్రమడాలు, మత్తు మందు 255ఇంజక్షన్లను విజిలెన్స్ ఎస్పీ స్నేహిత పట్టుకున్నారు. యువతకొంతమంది తప్పుడుగా వైద్యం కోసంవినియోగించే మత్తు కలిగించే మెడిసిన్స్‌ను విరివిగా వాడుతున్నట్టు సమాచారం అందిందని విజిలెన్స్ ఎస్పీ స్నేహిత తెలిపారు.అందుకే డీజీపీ ఆదేశాలతోజిల్లాలో 16చోట్ల దాడులు చేస్తున్నామన్నారు.

# పులులు, వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు

>> నగరవనం లోగోను పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు.
ఈ సందర్భగా పవన్ కల్యాణ్ మాట్లాడారు. ప్రస్తుతం ఏపీవ్యాప్తంగా 50 నగరవనాలు ఉన్నాయని స్పష్టం చేశారు. 202425 సంవత్సరానికి మరో 11 నగరవనాలు మంజూరు చేయబడ్డాయని అన్నారు. పిఠాపురంలో ఒక నగరవనం కూడా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనిక నాయకత్వంలో ప్రభుత్వం రాష్ట్ర పచ్చదనాన్ని 50శాతానికి పెంచడానికి, పులుల కారిడార్లను బలోపేతం చేయడానికి, క్షీణించిన ఆవాసాలను పునరుద్ధరించడానికి, పరిరక్షణలో సమాజ భాగస్వామ్యాన్ని పెంచడానికి కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు. వన్యప్రాణులను రక్షించడానికి, పర్యా వరణ సమతుల్యతను నిర్ధారించడానికి ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ, క్షేత్ర సిబ్బంది, పరిరక్షకులు నిబద్ధతతో పని చేస్తున్నారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# విశాఖకు మాస్టర్‌ప్లాన్

>> కొరకు సీఎం ఆదేశాలతో ముందుకెళ్తున్నాం.

**కొణతాల రామకృష్ణ ఎమ్మెల్యే:** వైజాగ్ అభివృద్ధిపై జరిగిన సమీక్షలో కొన్ని నిర్ణయాలు తీసుకున్నాం,గతంలో ఇష్టానుసారంగా మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేశారు.ప్రజల అభిప్రాయం తీసుకొని మాస్టర్‌ప్లాన్‌మళ్ళీ రూపొందించే ఆలోచన చేస్తాం.4నెలల్లో మాస్టర్ ప్లాన్ పక్కాగా ఉండేలా నిర్ణయం తీసుకున్నాం.22ఏ భూములు తాగునీటి సమస్యలు బీచ్ కారిడార్ సమస్యలు ఉన్నాయి,చాలా కాలంగా అనకాపల్లి,గాజువాకలో భూ సమస్యలు ఉన్నాయి. సమస్యల పరిష్కారానికి మంత్రి నారాయణ అంగీకారం తెలిపారు.

**పల్లా శ్రీనివాసరావు ఎమ్మెల్యే :** మాస్టర్‌ప్లాన్ పై సమీక్షా చేశాం. కొన్ని రోడ్లకు పక్కన చిన్నచిన్న స్థలాలు ఉన్నవారు ఇబ్బంది పడుతు న్నారు.వీటికి సంబంధించి ఇబ బ్బందులు లేకుండా చూడమని మంత్రి నారాయణ ను కోరాము.అధికారులు మారడం వల్ల అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి.

**విష్ణుకుమార్ రాజు ఎమ్మెల్యే:** విజన్ 2047 పై ఫోకస్ పెట్టినట్టుగానే సీఎం చంద్రబాబు వైజాగ్ పై దృష్టి పెట్టారు.రాష్ట్రంలోమున్సిపల్ శాఖా చాలా కీలకం,వైజాగ్ మాస్టర్ ప్లాన్‌లోకొన్ని లోసుగులు న్నాయి. ఇవన్నీ సరిచేయాలని కోరాం.

# టిడిపి మరింత బలోపేతం

>> మొట్టమొదటి సారి దళిత వ్యక్తినీ స్పీకర్ గా చేసిన ఘనత మది. రాష్ట్రంలో గత 5 ఏళ్ల ప్రజాస్వామ్యం ఖూనీ చేసిన వారు ఇప్పుడు కొత్త దారులు వెతుక్కుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో 2014-19 మధ్య నాటి టీడీపీ ప్రభుత్వం జిల్లా కేంద్రాల్లో 13 కాపు భవనాలను మంజూరు చేసిందని అందులో 5 భవనాల నిర్మాణాలను ప్రారంభించామని మిగిలిన వాటిని గత ప్రభుత్వం నిలిపేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్మాణాలను పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేసిందని తెలిపారు. అవి త్వరలోనే వినియోగంలోకి రానున్నాయని అధికారులు సీఎంకు వివరించారు. నిర్మాణంలో ఉన్న 42కాపు కమ్యూనిటీ హాళ్లు కూడా వేగంగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. బీసీవిద్యార్థుల కోసం ప్రభుత్వం తీసుకునే చర్యలతో స్పష్టమైన మార్పులు రావాలని, ప్రభుత్వం చేసే ఖర్చుకు జవాబుదారీతనం కనిపించాలని సీఎం అన్నారు. రాష్ట్రంలోని 660 గవర్నమెంట్ హాస్టల్స్‌లో 13.10 కోట్లతో చేపట్టిన మరమ్మతులు మరో 6 వారాల్లోపు పూర్తి చేయాలని ఆదేశించారు.

**మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సతీమణి షైనాబ్ మృతికి సీఎం చంద్రబాబు సంతాపం:** రాష్ట్రమైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సతీమణి షైనాబ్ మృతికి సీఎం చంద్రబాబు నాయుడు సంతాపం తెలిపారు. షైనాబ్ మృతితో విషాదంలో ఉన్న ఫరూక్ కుటుంబానికి ముఖ్యమంత్రి సానుభూతిని తెలిపారు. ఫరూక్ కుటుంబానికి అల్లా మనోధైర్యాన్ని అందించాలని ప్రార్థించారు.



శుక్రవారం శ్రీసిటీలో ఓజేఐ ఇండియా ప్యాకేజింగ్ పరిశ్రమను ప్రారంభిస్తున్న కంపెనీ ప్రతినిధులు

# శ్రీసిటీలో ఓజేఐ ఇండియా ప్యాకేజింగ్ పరిశ్రమ ప్రారంభం

>> షన్ ప్రెసిడెంట్,గ్రూప్ సీఈవో హిరోయుకి ఇసోనో, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడి, ఓజీ ఇండియా ప్యాకేజింగ్ సీఈవో యోషియుకి కురహషి లాంఛనంగా రిబ్బన్ కత్తరించి కంపెనీని ప్రారంభించారు. దేశంలో ఇది 5వ ప్లాంట్ కాగా, దక్షిణ భారతదేశంలో అతి పెద్దది. ఈ సందర్భంగా హిరోయుకి ఇసోనో మాట్లాడుతూ ఓజేఐ సంస్థ ప్రపంచ వ్యాప్త వృద్ధి ప్రణాళికలో భారతదేశం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. సుస్థిరత, ఆవిష్కరణల ద్వారా నిర్మించిన ఈ శ్రీసిటీ ప్లాంటు, దక్షిణ భారతదేశ ప్యాకేజింగ్ అవసరాలకు అనుగుణంగా పని చేస్తుందన్నారు. ప్లాంటు నిర్మాణాన్ని సకాలంలోపూర్తి చేయడంలో శ్రీసిటీ సహకారాన్ని ఆయన అభినందించారు. యోషియుకి కురహషి మాట్లాడుతూ భారత్‌లో ఓజీప్రయాణాన్ని భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. ఓజీఐ గ్రూప్ విస్తరణ జపాన్-భారత్‌సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని మునియో తకాహషి వ్యాఖ్యనించారు. ఓజేఐఇండియా బృందాన్ని రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. శ్రీసిటీ పారిశ్రామిక కుటుంబంలో మరో ప్రముఖసంస్థ చేరడం పట్ల గర్విస్తున్నామన్నారు.శ్రీసిటీలో 43వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటైన అత్యాధునిక ఓజీఇండియా ప్లాంటు,100మిలియన్ల వార్షిక సామర్థ్యంతో అట్ట పెట్టెలు,ఇతర ఉపకరణాలు తయారుచేస్తుంది.దక్షిణ భారతదేశ డిమాండ్ మేరకు ఉత్పత్తులు అందిస్తుంది.




శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాలల జేఏసీ నేతలు

# మాలల సింహగర్జన వాయిదా

>> చట్టపరంగా వాపసు తీసుకోవడం జరుగుందన్నారు. అయితే దేశం, రాష్ట్ర, జిల్లా, రాయలసీమ ప్రాంతాలోని మాలల సంఘాల నేతలు, మాలలు, వారి కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని తెలుసుకుని 23న తిరుపతిలో జరిగే సభను రద్దు చేయడం జరిగిందని, త్వరలో మరో తేదీని ప్రకటించి మంచి క్రీడా మైదానంలో మాలల సింహగర్జన సభను విజయవంతం చేస్తామని తెలియజేశారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు అర్థం చేసుకుని తిరుపతికి రావద్దన్నారు. ఈ కార్యక్రమంలో మాలల జేఏసీ నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

# సిఎస్‌తో నేషనల్ డిఫెన్స్ కళాశాల బృందం భేటీ

>> ఎనలేని సేవలు అందిస్తు న్నాయని పేర్కొన్నారు. ఉదాహరణకు విశాఖపట్నంలలో హుద్ హుద్ తుఫాను సమయంలో వారం రోజుల్లో సాధారణ పరిస్థితులు నెలకొనేలా చేయడులోను,గత ఏడాది విజయవాడలో సంభవించిన వరదల్లోను రక్షణ దళాలు అందించిన సేవలను సిఎస్ విజయానంద్ గుర్తు చేశారు.నేషనల్ డిఫెన్స్ కళాశాల ప్రతినిధి బృందానికి నేతృత్వం వహిస్తున్న మేజర్ జనరల్ సిపి సంగ్ర మాట్లాడుతూ తమ కళాశాల వివిధ విభాగాలకు చెందిన 16 మంది అధికారులతో కూడిన బృందం స్టడీ టూర్‌లో భాగంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించడం జరుగుతోందని తెలిపారు. వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థలు,రాష్ట్ర ప్రభుత్వ విభాగాలను వాటి కార్యకలాపాలు ఈ బృందం అధ్యయనం చేస్తోందని పేర్కొన్నారు.ఈసమావేశంలో రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా తదితర అధికారులు పాల్గొన్నారు. అలాగే నేషనల్ డిఫెన్స్ కళాశాలకు చెందిన మేజర్ జనరల్ సిపి సంగ్ర సహా వివిధ విభాగాలకు చెందిన బ్రిగేడియర్లు మన్జీత్ సింగ్, మునీస్ చంద్ర తమాంగ్, అతుల్ రాజ్ పుత్,సందీప్ కుమార్ రాకేశ్,అమితోష్ సింగ్,కెవిఎస్ పుష్ప కుమార, కమాండర్లు, కల్నల్‌లు తదితరులు పాల్గొన్నారు.

# బ్రీడర్ విత్తనాల సరఫరాకు కేంద్రం ఆమోదం

>> రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల వ్యవసాయ శాఖాధి పతులతో ,జాతీయ స్థాయి ప్రభుత్వ , ప్రభుత్వ రంగ విత్తన పరిశోధనా సంస్థలు ,సరఫరా సంస్థలతో రెండురోజులపాటు దేశ రాజధాని ఢిల్లీలో ఖరీఫ్ 2025 జోనల్ విత్తన సమీక్ష సమావేశం జరిగింది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖకు చెందిన ,విత్తనముల సంయుక్త కార్యదర్శి అజిత్ కుమార్ సాహూ, ఆధ్వర్యములో జరిగింది విత్తన సహాయ కమిషనర్ మరియు అదనపు డైరెక్టర్ జనరల్ ఐకార్‌చందర్ మోహన్‌లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మొదటి రోజు ఖరీఫ్ 2025 సీజన్ కు సంబంధించి వివిధ రాష్ట్రాలు ప్రతిపాదించిన విత్తన రకాల ఎంపిక,వాటి లభ్యత ,సరఫరా పై సమీక్ష నిర్వహించారు.గ్రామీణ విత్తనోత్పత్తి పథకం ,రైతు స్థాయిలో ధ్రువీకరణ విత్తనాల విత్తనోత్పత్తి తదితర అంశాలపై చర్చించారు. రెండవరోజు జరిగిన సదస్సులో ప్రతిష్ఠాత్మక పరిశోధనా క్షేత్రంలు ,సంస్థల ద్వారా కొత్తగా విడుదలైన అధికదిగుబడినిచ్చే వంగడాలు ,నోటిఫైడ్ రకాల విత్తనముల లక్షణాలు ,వాటి దిగుబడులు , తెగుళ్లను తట్టుకునే అంశాలను వివరించారు. బ్రీడర్ విత్తనాల ప్రాముఖ్యతను తెలుపుతూ రైతులే వారి క్షేత్రాలలో నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేసుకునేలా 7పంటలకు అనగా వేరుశనగ , వరి,కంది ,పెసర ,మినుము ,రాగి మరియు సజ్జ పంటల బ్రీడర్ విత్తనాలు ను రాయితీ కల్పించటం జరిగిందని ,తద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు ఖరీఫ్ సీజన్ 2026 నుండి బ్రీడర్ విత్తనం సాగునుండి తరువాతి సీజన్ కు మూల (ఫౌండేషన్) విత్తనముగా మరియు వాటి నుండి తదుపరి సీజన్ కు ధ్రువీకరించిన (సర్టిఫైడ్) విత్తనముగా ప్రత్యుత్పత్తి చేసుకుంటూ 2027 -28 సంవత్సరానికల్ల రైతు స్థాయిలో నాణ్యమైన విత్తన ఉత్పత్తి చేసుకునే విధముగా ప్రణాళికలను రాష్ట్రాలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. మన రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ సంచాలకులు తరుపున పాల్గొన్న విత్తన సంయుక్త సంచాలకులు కృపదాస్ మాట్లాడుతూ ఈ సమావేశములో మనరాష్ట్ర ప్రతిపాదనలకు 1736 క్వింటాళ్ల బ్రీడర్ విత్తనాలను 7 పంటలకు రాయితీపై సరఫరాకు ఆమోదం తెలుపటం చాలా ఆనంద దాయకమన్నారు. పంటలలో ఎటు వంటి కొరత రాకుండా 3,35,720క్వింటాళ్ల ధ్రువీకరణ (సర్టిఫైడ్)విత్తనాలను ముందస్తు వ్యూహం, ప్రణాళికతో వ్యవసాయసంచాలకులు డిల్లీరావు వారి ఆదేశాల ప్రకారం కార్యాచరణ చేపడతామని తెలిపారు.



శుక్రవారం తిరుమలలో భక్తులకు ప్రసాద వితరణ గావిస్తున్న నారా భువనేశ్వరి, బ్రాహ్మణి

# ఆన్‌లైన్‌లో అలమారాలు బుక్ చేసి రూ.3.65 లక్షలు మోసం

## కంపెనీ బ్యాంకు ఖాతాలు సీజ్ చేసి బాధితుడికి న్యాయం చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు

**చిత్తూరు, మార్చి 21 ప్రభాతవార్త:** ఆన్‌లైన్‌లో అలమారాలు కొనుగోలు చేయడం కోసం 3.65 లక్షల రూపాయలు కట్టించుకుని అలమారాలు డెవలరీ చేయకుండా, ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరం జరుపకుండా మిన్నకుండిపోయిన ఓ కంపెనీకి చిత్తూరు సైబర్ క్రైం పోలీసులు షాక్ ఇచ్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆ కంపెనీకి చెందిన పూర్తి బ్యాంకు అకౌంట్లను సీజ్ చేయడంతో దిగి వచ్చిన కంపెనీ ప్రతినిధులు బాధితుడు ఇచ్చిన అర్డర్ మేరకు అలమారాలు డెవలరీ చేశారు. వివరాలిలా వున్నాయి. చిత్తూరు నగరానికి చెందిన ఓ వ్యక్తి అలమారాలు కొనుగోలు కోసం కెబ్రోస్ అరిస్టో లిమిటెడ్‌కు గత ఏడాది అక్టోబర్ 31వ తేదీన ఆన్‌లైన్‌లో క్యూఆర్ కోడ్ ఉపయోగించి 3.65 లక్షల రూపాయలు పంపాడు. బాధితుడు కంపెనీకి చెప్పిన మేరకు డబ్బులు జమ చేసిన కంపెనీ నుండి ఎలాంటి అలమారాలు రాకపోగా విషయం తెలుసుకుందామని ఫోన్ ద్వారా సంప్రదించడానికి ప్రయత్నిస్తే సరైన సమాధానం కంపెనీ నుండి వచ్చేది కాదు. ఈ మేరకు తాను మోసపోయానని గ్రహించి బాధితుడు ఈ ఏడాది మార్చి 10న చిత్తూరు సైబర్ పోలీసులను కలిసి ఫిర్యాదు చేశాడు. ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు చిత్తూరు సైబర్ క్రైం పోలీసులు స్పందించి రంగంలోకి దిగారు. బాధితుడు డిపాజిట్ చేసిన కంపెనీ బ్యాంకు లావాదేవిలను గుర్తించి ఆ కంపెనీ బ్యాంకు లావాదేవిలను సీజ్ చేశారు. ఆపై సైబర్ క్రైం పోలీసులు కంపెనీ అధికారులకు మాట్లాడి బాధితుడికి అర్డర్ చేసిన అలమారాలను మార్చి 19న డెవవరీ చేసేలా చర్యలు తీసుకున్నారు. ఈ విషయంపై చిత్తూరు సైబర్ క్రైం పోలీసులను ఎస్పీ మణికంఠ చందోలు అభినందించారు. ఆన్‌లైన్ లావాదేవిలు, పేమెంట్లు, వ్యక్తిగత సమాచార రక్షణపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా వుండాలన్నారు. సైబర్ మోసం జరిగితే సత్వరం స్పందించాల్సిన అవసరం వుందని ఆయన పేర్కొన్నారు.

# పెద్ద ఎత్తున నీటి కుంటలు: డిప్యూటీ సిఎం పవన్

**చిత్తూరు, మార్చి 21 ప్రభాతవార్త:** జల సంరక్షణ చర్యల్లో భాగంగా ఉపాధి హామీ పథకం కింద పెద్ద ఎత్తున పంట నీటి కుంటల నిర్మాణం చేపట్టాలని డిప్యుటీ సిఎం పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. అమరావతి నుండి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కలెక్టర్లతో ఉపాధి హామీ పనులపై సమీక్షించిన డిప్యుటీ సిఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవడానికి రానున్న కాలంలో నీటి ఎద్దటిని కట్టడి చేయడానికి పంట నీటి కుంటల నిర్మాణం ఎంతో తోడ్పడుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.5లక్షల పంట నీటి కుంటలను జూన్ నెలాఖరుకు నిర్మించడానికి జిల్లా వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వేసవిలో ఉపాధి కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు సౌకర్యాలు కల్పించాలన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో మంజూరైన సిమెంటు రోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణాలను సత్వరం పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. వర్చువల్ విధానంలో కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో జిల్లాకు 207కిమీ సిసి రోడ్లు మంజూరు అయ్యాయని ఇందులో 151 కిమీ సిమెంటు రోడ్లు పూర్తి చేయడం జరిగిందని వివరించారు. అలాగేఫారం ఫాండ్స్ లక్ష్యం 12,984 కాగా ఇప్పటికే 17 వేల ఫారంపాండ్లు మంజూరు చేశామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా పిడి రవికుమార్ పాల్గొన్నారు.

# జీవన శైలిని మార్చుకోవడం ద్వారా కేన్సర్‌ను గెలుద్దాం

**తిరుపతి హెల్త్, మార్చి 21 ప్రభాతవార్త :** జీవన శైలిని మార్చుకోవడం ద్వారా క్యాన్సర్‌ను గెలుద్దామని టాటా ట్రస్ట్ పీఆర్వో హేమంత్‌కుమార్ అన్నారు. రాష్ట్రీయ సేవా సమితి (రాస్) మహిళా పొదుపు సంఘాల సౌకర్యార్థం టాటా ట్రస్ట్ వారి సహకారంతో తిరుపతి కార్పొరేషన్ పరిధిలోని శివజ్యోతి నగర్ రాస్ క్లస్టర్ ఆఫీస్ ఆవరణంలో ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ పీఆర్వో హేమంత్‌కుమార్ మాట్లాడుతూ మితాహారం క్రమం తప్పని వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో టాటా ట్రస్ట్ ఆస్పత్రి సిబ్బందితోపాటు రాస్ సిబ్బంది బాలాజీ, గీత, క్లస్టర్ లీడర్లు సత్యవతి, స్వరూప, అయేషా, తదితరులు పాల్గొన్నారు.

# పోసానికి ఊరట

>> అరెస్ట్ అయ్యారు. ప్రస్తుతం గుంటూరు జిల్లా జైల్లో జ్యూడిషియల్ రిమాండ్‌లో ఉన్నారు. ఈనెల 23 వరకు రిమాండ్ విధించారు. అలాగే ఈ కేసులో పోసానిని సీఐడీ అధికారులు ఒకరోజు పాటు కస్టడీలోకి తీసుకుని విచారించారు. కస్టడీ విచారణ అనంతరం కూడా మరోసారి కస్టడీకి తీసుకునేందుకు సీఐడీ అధికారులు ప్రయత్నించారు. అయితే ఈలోపే పోసానికి కోర్టుబెయిల్ మంజూరు చేసింది. ఇప్పుడు తాజాగా గుంటూరు సీఐడీ కోర్టు పోసానికి బెయిల్ మంజూరుచేసింది. అయితే రాష్ట్రంలో పోసానిపై ఇంకా అనేకచోట్ల కేసులు నమోదు అయిన నేపథ్యంలో ఏజిల్లా నుంచి అయినా పోలీసులు వచ్చి పీటీ వారెంట్‌తో పోసానిని మరోసారి అదుపులోకి తీసుకుంటారా లేక బెయిల్‌పై విడుదల అవుతారా అనేది దానిపై ఉత్కంఠ నెలకొంది. శనివారం ఉదయం పోసాని విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# సినీపరిశ్రమ అభివృద్ధికి కొత్త విధానం భేష్

## చలనచిత్ర నిర్మాతల మండలి

**విజయవాడ,మార్చి21,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సినీపరిశ్రమ అభివృద్ధి కోసం నూతన విధానాన్ని తీసుకొస్తామన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి ప్రకటించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేశ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన నిర్మాతల మండలి పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే ప్రభుత్వానికి పంపించినట్లు వెల్లడించింది. వైజాగ్, తిరుపతి, రాజమహేంద్రవరంలో స్టూడియోలు నిర్మించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, అలాగే నిర్మాతలు, కళాకారులు, దర్శకులు, సాంకేతిక నిపుణుల నివాసాల కోసం స్థలాలు కేటాయించాలని ప్రభుత్వానికి విన్నవించినట్లు తెలిపింది. ఆంధ్రప్రదేశ్ లో సినీపరిశ్రమ వేగంగా అభివృద్ధి కోసం ప్రభుత్వానికి తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపింది. అలాగే గతంలో ఉన్న నంది అవార్డులను పునరుద్దరించాలని, పెండింగ్ లో ఉన్న అవార్డులను కూడా ఇవ్వాలని తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి ఏపీ ప్రభుత్వాన్ని కోరింది. తమ ప్రతిపాదలనపై ప్రభుత్వం నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నట్లు నిర్మాతల మండలి వెల్లడించింది.

## వారం - వర్జ్యం

తేది : 22-03-2025, శనివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
అష్టమి తె.5.25
మూల రా.3.23
వర్జ్యం ఉ.10.17-12.00
దు.ఉ.6.19-7.56
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** సన్నిహితులతో అకారణ విరోధాలు ఏర్పడవచ్చు. మాట్లాడేటప్పుడు జాగ్రత్త అవసరం.

**వృషభం:** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. పనులు నిదానంగా పూర్తి చేస్తారు.

**మిథునం:** ఆర్థిక ఇబ్బందులు ఎదురైన పట్టుదలతో ముందుకు సాగుతారు. మానసిక అశాంతి.

**కర్కాటకం :** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

**సింహం:** ఆస్తి వివాదాలు తీరి లబ్ధిపొందుతారు. నూతన వస్తు వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**కన్య :** వృత్తి, వ్యాపారాలలో స్వల్ప ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

**తుల :** సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకొంటారు.

**వృశ్చికం:** కుటుంబ సమస్యలు తీరి ఊరట చెందుతారు. జీవిత భాగస్వామి నుండి ధనలాభం పొందుతారు.

**ధనుస్సు:** ఒక సంఘటన ఆకట్టుకుంటుంది. నూతన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**మకరం:** చేపట్టిన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు.

**కుంభం:** పూర్వపు మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**మీనం :** కుటుంబంలో శుభకార్యాలు జరుగుతాయి. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

22-3Pg3exHMNWJQE.qxd:22-3Pg3exHMNWJQE.qxd 01/01/01 10:07 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు,

: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

22-3-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 49 పేజీలు: 12 వెల: 6.50

**కర్ణాటక అసెంబ్లీలో 18మంది బిజెపి ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు** 9లో

**నేడు చెన్నైలో డీలిమిటేషన్‌పై జెఎసి భేటీ**

# విశాఖకు మాస్టర్ ప్లాన్

## నాలుగు నెలల్లోగా సిద్ధం

### మెట్రో రైలు ఈ బృహత్తణాళికలో భాగమే

### రోడ్ల విస్తరణకు చర్యలు: మంత్రి నారాయణ



శుక్రవారం సచివాలయంలో విశాఖ ఎమ్మెల్యేలు,జివిఎంసీ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి పి.నారాయణ

**సచివాలయం,మార్చి 21,ప్రభాతవార్త:** రాబోయే 30ఏళ్లను దృష్టిలో పెట్టుకొని వైజాగ్ మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.శుక్రవారం సచివాలయంలో విశాఖ నగర పరిధిలోని ఎమ్మెల్యేలు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.గత ప్రభుత్వంలో స్వార్థంకోసం మాస్టర్‌ప్లాన్ రూపొందించారని మళ్ళీ మార్పులు చేసిప్రజాభిప్రాయంతో ఫైనల్ ప్లాన్ విడుదల చేస్తామన్నారు.విశాఖ పట్నం నగర అభివృద్ధితో పాటు సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలపై జీవిఎంసి పరిధిలోని ఎమ్మెల్యేలతో మంత్రి నారాయణ మాట్లాడారు.సచివాలయంలో జరిగిన సమావేశానికి ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, కొణతాల రామకృష్ణ,పంచకర్ల రమేష్, వంశీకృష్ణ,శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, ఏపియుఎఫ్ఐడిసి చైర్మన్ షీలా గోవింద్, విఎమ్మార్‌డిఏ చైర్మన్ ప్రణవ గోపాల్,రెవెన్యూశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా,మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్,మున్సిపల్ శాఖ డైరెక్టర్ సంపత్‌కుమార్, విఎమ్మార్‌డిఏ కమిషనర్ విశ్వనాథ్,ఇతర అధికారులు హాజరయ్యారు.వైజాగ్‌లో రోడ్ల విస్తరణ,ట్రాఫిక్ సమస్యలు,మెట్రోరైల్ ప్రాజెక్టు,భూముల ఆక్రమణ,తాగునీటి సమస్య,టిడిఆర్ బాండ్లు ,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వంటి అంశాలను సమావేశంలో ఎమ్మెల్యేలు, ప్రస్తావించారు. సమావేశం ముగిసినతర్వాత మంత్రి నారాయణతోపాటు పలువురు ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడారు.

**మంత్రి నారాయణ:** గతంలో స్వార్థంకోసం విశాఖ మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించారు. తిరిగి మళ్లీ మార్పులు చేసి మాస్టర్ ప్లాన్ ఆన్‌లైన్‌లో ఉంచుతాం.ప్రజల నుంచి అభిప్రాయం తీసుకొని మాస్టర్‌ప్లాన్ 4నెలల్లో ఫైనల్ చేస్తాం,మాస్టార్‌ప్లాన్ అంటే రాబోయే 30ఏళ్ళను దృష్టిలో పెట్టుకొని చేయాలి.రోడ్లు వెడల్పుచేయాల్సింది, మెట్రోరైల్ కూడా మాస్టర్‌ప్లాన్‌లో భాగమే 8క్రాస్ రోడ్ల దగ్గర ప్లైఓవర్లు ఉన్నాయి.భోగాపురం ఎయిర్‌పోర్టు రోడ్లవల్ల ట్రాఫిక్ ఇబ్బందులు వస్తాయి. దీంతో రోడ్లవిస్తరణ చేయాల్సి ఉంది తాగునీటి సమస్య కూడా ఉంది.అన్నిసమస్యలు పరిష్కరిస్తాం.విశాఖ అభివృద్ధి >>2



శుక్రవారం తిరుమలలో ధ్వజస్తంభం వద్ద ప్రణమిల్లుతున్న సిఎం చంద్రబాబు, మనుమడు దేవాన్ష్

## ఆలయ నిర్మాణాలకు

# ప్రత్యేక ట్రస్టు

### ప్రతి రాజధానిలో శ్రీనివాసుని ఆలయ నిర్మాణం

### దేవలోక్,ముంతాజ్‌హోటల్, ఎంఆర్‌కెఆర్‌కు భూ కేటాయింపులు రద్దు

### సమాజహితం కోసం అంతా పనిచేయాలి: సిఎం చంద్రబాబు

**తిరుమల,మార్చి 21ప్రభాతవార్తప్రతినిధి:** మానవసేవే మాధవసేవగా హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలో ఎస్వీఅన్నదానం,ప్రాణదానం ట్రస్ట్ తరహాలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల నిర్మాణాలకు ప్రత్యేక ట్రస్ట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఈ ట్రస్ట్ ద్వారా దాతల నుండి నిధులు సేకరించి హిందువులు ఎక్కువగా ఉన్న ప్రతిచోటా శ్రీవారి ఆలయాల నిర్మాణాలు చేపడతామన్నారు. దేశంలోని అన్ని రాజధానులలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాలు నిర్మించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. సమాజ హితంకోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని సిఎం పిలుపునిచ్చారు. గ్రామాల్లోని ఆలయాల్లో అందరూ సేవచేయాలని ఆయన కోరారు. మనవడు నారాదేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి కులదైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కానుకలు సమర్పించి ఆశీస్సులందుకున్నారు.అన్నప్రసాద భవనంలో 44లక్షలు రూపాయలు ఒకరోజు అన్నప్రసాదానికి వితరణ చేసి స్వయంగా భక్తులకు వడ్డించారు. అనంతరం పద్మావతి విశ్రాంతి గృహంలో మీడియా ప్రతినిధులతో పలుఅంశాలు తెలియజేశారు. మానవసేవలో భాగంగా టిటిడి ఆధ్వర్యంలో ఎస్వీ అన్నదానం ట్రస్ట్ ఏర్పాటుచేసి ప్రస్తుతం 2,200కోట్ల రూపాయలు >>2

## పులులు, వన్యప్రాణుల

# సంరక్షణకు చర్యలు

### డిప్యూటీ సిఎం పవన్

**విజయవాడ,మార్చి21,ప్రభాతవార్తప్రతినిధి:**పులులు, ఇతర వన్యప్రాణాల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ప్రస్తుతం ఏపీ వ్యాప్తంగా 50నగరవనాలు ఉన్నాయని స్పష్టం చేశారు. 202425 సంవత్సరానికి మరో 11 నగర వనాలు మంజూరు చేయబడ్డాయని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పులుల సంరక్షణ అంటే కేవలం పులుల సంఖ్యను పెంచడం మాత్రమే కాదని,వన్యప్రాణులు, స్థానిక సమాజాలకు ప్రయో జనం చేకూర్చే సామరస్యపూర్వక పర్యావరణ వ్యవస్థను నిర్వహించడమని చెప్పారు. శుక్రవారం ఇవాళ(శుక్రవారం) పులులపై వార్షిక నివేదికను విడుదల చేసి, >>2

## డ్రగ్స్ దుర్వినియోగంపై

# విజిలెన్స్ కొరడా

### 'ఆపరేషన్ గరుడ' పేరుతో మెడికల్ షాపులపై విస్తృతంగా దాడులు

### ఎన్ఆర్ఐ డ్రగ్స్‌ను గుర్తించిన అధికారులు

**విజయవాడ,మార్చి21,ప్రభాతవార్త ప్రతినిధి:**ఏపీలో ఆపరేషన్ గరుడ నిర్వహించారు. ఆపరేషన్ గరుడలో భాగంగా డీజీపీ ఆదేశాల మేరకు ఐజీ ఈగల్ టీమ్, విజిలెన్స్ ఎండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, లోకల్ పోలీస్, డ్రగ్స్ కంట్రోల్ టీమ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా దాడులు జరుగుతున్నాయి. డ్రగ్స్ దుర్వినియోగంపై రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ షాప్స్, ఏజెన్సీస్‌పై అధికారులు దాడులు చేస్తున్నారు. మెడికల్ షాపుల్లో అక్రమ మత్తుపదార్థాలు ఉన్నాయా అనే దానిపై అధికారులు తనిఖీలు చేపట్టారు విజయవాడనగర వ్యాప్తంగా మెడికల్ షాపులపై ఈగల్ టీమ్ దాడులు నిర్వహించారు. ఈగల్ టీమ్ ఐజీ రవికృష్ణ ఆధ్వర్యంలో దాడులు కొనసాగాయి. ఈ సందర్భంగా రవికృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 100 టీమ్స్ తో దాడులు చేస్తున్నామన్నారు. గంజాయి, డ్రగ్స్‌పై ఈగల్ టీమ్ ఉక్కుపాదం మోపుతోందని తెలిపారు. యువత డ్రగ్స్, గంజాయి అందుబాటులో లేకపోవడంతో మత్తు టాబ్లెట్స్‌కు బానిసలుగా మారుతున్నారన్నారు. మెడికల్ షాపు నిర్వాహకులు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు టాబ్లెట్స్ అమ్ముతున్నారన్నారు. యువత మత్తు టాబ్లెట్స్ తీసుకొని మత్తులో జోగుతున్నారని, మత్తులో యువత నేరాలవైపు అడుగులు వేసే అవకాశం ఉందని తెలిపారు.డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు టాబ్లెట్స్ మెడికల్ >>2



మెడికల్ షాపులపై దాడుల దృశ్యం

## మాలల సింహగర్జన

# వాయిదా

### త్వరలో మరో తేదీని ప్రకటిస్తాం: మాలల జెఎసి నేతల వెల్లడి

**తిరుపతి హెల్త్, మార్చి 21 ప్రభాతవార్త:** ఈ నెల 23న తిరుపతి శ్రీ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ స్కూల్ క్రీడా మైదానంలో జరగాల్సిన మాలల జేఏసీ సింహగర్జన కొన్ని అన్ని వార్య కారణాల వలన వాయిదా పడిందని మాలల రాష్ట్ర జేఏసీ నేతలు దుగ్గాని జయరాం, తాళ్ళపాక దాము, రత్నం, సదకుప్పం జయచంద్ర, రాజ్‌కుమార్, సుబ్రమణ్యం, ఉమామహేశ్వరరావు తెలియజేశారు. ఈ మేరకు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాయలసీమ మాలల ఐక్యతలో భాగంగా ఈనెల 23న ఎస్వీజే ఎన్ఎం స్కూల్ క్రీడా మైదానంలో మాలల ఐక్యవేదిక సింహగర్జన కార్యక్రమం జరిగి ఉండేదన్నారు. అయితే మొదటి గ్రౌండ్‌కు కమిషనర్ మౌర్య పర్మిషన్ ఇచ్చిందని, అటు పిమ్మట ఎస్పీ, కలెక్టర్ ఆదేశాల మేరకు పర్మిషన్ రద్దు చేసినట్లు చెప్పారు. అడ్వాన్స్ క్రింద మున్సిపల్‌కమిషనర్‌కు రూ. 60వేలు కట్టామని, ఆ డబ్బులు >>2

# టిడిపి మరింత బలోపేతం

### ప్రతికార్యకర్త పార్టీకి అధినేత..

### కార్యకర్తలతో ప్రతి బుధవారం సమావేశం జరిపి సమస్యలు పరిష్కరించాలని నేతలకు సిఎం చంద్రబాబు ఆదేశం

**విజయవాడ,మార్చి21,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీని అత్యంత బలోపేతం చేసే దిశలో టీడీపీ ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌ఛార్జీలు కీలక బాధ్యతను తీసుకోవాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు ఆదేశించారు.టీడీపీ కార్యాలయం నుంచి పార్టీ జాతీయ అధ్యక్షుని హోదాలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసారు. ఇదే అంశాన్ని "ఎక్స్" వేదికగా పోస్టు చేసారు. టీడీపీలో కార్యకర్తే అధినేత అని అధిష్ఠానం స్పష్టం చేసింది. ప్రతి బుధవారం వారితో సమావేశం నిర్వహించాలని టీడీపీ ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌ఛార్జీలకు సూచనలు చేసింది. సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని ఆదేశించింది. పార్టీ కార్యక్రమాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన వారిని అభినందించాలని దిశానిర్దేశం చేసింది. నియోజకవర్గ స్థాయిలో ప్రతి బుధవారం పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి వారి సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌ఛార్జీలను తెలుగుదేశం అధినేత చంద్రబాబు ఆదేశించారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, విభాగాలు, కార్యక్రమాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన వారిని అభినందించాలని దిశానిర్దేశం చేశారు. అదే రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించాలని సూచించారు. ఇన్‌ఛార్జి మంత్రులు తమకు అప్పగించిన జిల్లాల్లో నెలకు రెండు రోజులు తప్పనిసరిగా పర్యటించాలని పేర్కొన్నారులోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షుడు, జోనల్ కోఆర్డినేటర్లతో కలిసి పార్టీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మీటింగ్ మినిట్స్‌ను తమకు పంపాలని, ఎవరైనా సమావేశం నిర్వహించకపోతే లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. ఏప్రిల్ 15 నాటికి కుటుంబ సాధికార సమితి, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీలు, ఏప్రిల్ 30వ తేదీలోపు గ్రామస్థాయి నుంచి లోక్‌సభ నియోజకవర్గ స్థాయి వరకు ఉన్న ప్రధాన, అనుబంధ కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలని సూచించారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలే తెలుగుదేశం బలమని, దేశంలో ఏ పార్టీకి లేని సంస్థాగత నిర్మాణం తమ పార్టీకి ఉందని కోటి సభ్యత్వాలతో చరిత్ర సృష్టించి అతి పెద్ద కుటుంబంగా మారిన నేపథ్యంలో కార్యకర్తే అధినేత అని లోకేశ్ పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదులో ఉత్తమ పని తీరు కనబరిచినవారు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ, శంఖారావం ఫీల్డ్ వర్కులు, ఓటర్ వెరిఫికేషన్, పార్టీ యాప్స్ డౌన్‌లోడ్ చేయిస్తున్న కార్యక్రమాలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు అని పార్టీ కార్యాలయం ఆ ప్రకటనలో పేర్కొంది. ఇదే సందర్భంలో ఎస్సీ వర్గీకరణను మనం అమలు చేస్తున్నాం,ఈ విషయం అందరికి తెలియాలి,అవగాహన కల్పించాలన్నారు. కుల వివక్షపై యుద్ధం చేసిన ప్రభుత్వం టిడిపి ప్రభుత్వం 108 జీవో ప్రకారం వారానికి ఒక్క ఊరూ వెళ్లి అధికారులు వివక్షపై ఆరా తియ్యాలని చెప్పం.. వివక్షత ఉంటే వారిపై అట్రాసిటీ కేసులు పెటాలని చెప్పంవివక్షలపై పోరాటం చేసిన వారికి అవార్డులు ఇచ్చాము..అనేక ప్రాంతాలలో సోషల్ ఈక్వాలిటీ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. గిరిజన భూములపై హక్కులు కల్పించింది ఎన్టీఆర్ అయితే వాటిని కాపాడుతుంది. టిడిపి ప్రభుత్వం వివక్షలు పోవడానికి మొత్తం 27జీవోలను ఇవ్వడం జరిగింది. >>2



# పోసానికి ఊరట

### బెయిలు మంజూరు చేసిన గుంటూరు సిఐడి కోర్టు

**విజయవాడ,మార్చి21,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీచలనచిత్ర,నాటక,టీవీ రంగ అభివృద్ధి సంస్థ మాజీచైర్మన్ పోసాని కృష్ణ మురళికి ఊరటలభించింది. పోసానికి గుంటూరు సీఐడీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. చంద్రబాబు, పవన్,లోకేష్‌పై అనుచిత వ్యాఖ్యల కేసులో పోసాని >>2

## బ్రీడర్ విత్తనాల సరఫరాకు కేంద్రం

# ఆమోదం

### వ్యవసాయ సంచాలకులు డిల్లీ రావు

**విజయవాడ,మార్చి21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి 1736 క్వింటాళ్ల బ్రీడర్ విత్తనాల సరఫరాకు కేంద్ర ప్రభుత్వ ఆమోదం లభించిందని వ్యవసాయ సంచాలకులు డిల్లీ రావు తెలిపారు.భారత ప్రభుత్వ కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ విత్తన విభాగం జాతీయస్థాయిలో, మన దేశంలోని అన్ని >>2

## సిఎస్‌తో నేషనల్ డిఫెన్స్

# కళాశాల బృందం భేటీ

### రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై వివరించిన సిఎస్ విజయానంద్



శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌తో భేటీ అయిన న్యూఢిల్లీ నేషనల్ డిఫెన్స్ కళాశాల బృందం.

**విజయవాడ,మార్చి21,ప్రభాతవార్తప్రతినిధి:** న్యూఢిల్లీ నేషనల్ డిఫెన్స్ కళాశాలకు చెందిన పలువురు అధికారుల బృందం శుక్రవారం విజయవాడలోని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌తో ఆయన క్యాంపు కార్యాలయంలో తో సమావేశం అయింది.మేజర్ జనరల్ సిపి సంగ్ర నేతృత్వంలోని ఆర్మీ,నేవీ,ఎయిర్ ఫోర్స్, నేషనల్ డిఫెన్స్ అకాడమీ, డిఆర్డిఓ తదితర విభాగాలకు చెందిన అధికారుల బృందం వారి స్టడీ టూర్ లో భాగంగా రాష్ట్ర పర్యటనకు వచ్చిన సందర్భంగా సిఎస్ తో సమావేశం కావడం జరిగింది. ఈసందర్భంగా ఆబృందం ప్రతినిధులు రాష్ట్రంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలు జరుగుతున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి సిఎస్ ను అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగా సిఎస్ విజయానంద్ మాట్లాడుతూ వికసిత్ భారత్ 2047లో భాగంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళిక కింద రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలను వారికి వివరించారు.ముఖ్యంగా స్వర్ణాంధ్ర ఆశయ సాధనకు పది సూత్రాల ప్రణాళిక ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.అదే విధంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు, కార్యక్రమాల అమలులో సాంకేతిక వినియోగం గురించి సిఎస్ విజయానంద్ వారికి వివరించారు.ఇటీవల రాష్ట్రంలో వాట్సాప్ గవర్నెన్స్ ప్రవేశపెట్టి ప్రజలకు ఏవిధంగా సులభంగా పౌర సేవలు అందిస్తుందీ వివరించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 970 కిలోమీటర్ల పొడవైన సముద్ర తీరం ఉందని తీర ప్రాంతంలో ప్రభుత్వం చేపడుతున్న వివిధ నూతన ఓడరేవుల నిర్మాణం, గ్రీన్ హైడ్రోజన్,గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల గురించి సిఎస్ విజయానంద్ ఎన్డిసి ప్రతినిధి బృందానికి వివరించారు. రాబోయే దశాబ్ద కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పారిశ్రామికంగా,సర్వీస్ సెక్టార్,తయారీ రంగం, లాజిస్టిక్స్ తదితర రంగాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కానుందని తెలిపారు. అందుకనుణంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో అనేక ప్రాజెక్టులను చేపడుతున్నట్టు తెలిపారు.అంతేగాక వివిధ రంగాల్లో పెద్ద ఎత్తున సాంకేతికత వినియోగం, ఉద్యాన వనరంగం,ప్రకృతి సేద్యం వంటి రంగాల్లో దేశంలో ఎపిని మొదటి స్థానంలో నిలిపేందుకు చేస్తున్న కృషిని సిఎస్ వారికి వివరించారు.రాష్ట్రంలో వివిధ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఆర్మీ, నెవీ, ఎయిర్ ఫోర్స్, ఎన్డిఆర్ఎఫ్ తదితర కేంద్ర రక్షణ దళాలు రాష్ట్రానికి >>2

## శ్రీసిటీలో ఒజెఐ ఇండియా

# ప్యాకేజింగ్ పరిశ్రమ ప్రారంభం

**సత్యవేడు, మార్చి 21 ప్రభాతవార్త:** అట్టపెట్టెలు, ఇతర ప్యాకేజింగ్ వస్తువుల తయారీలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఓజెఐ గ్రూప్ అనుబంధ సంస్థ ఓజేఐ ఇండియా ప్యాకేజింగ్ ప్రైవేటు లిమిటెడ్ నూతన పరిశ్రమకు శుక్రవారం శ్రీసిటీలో ప్రారంభోత్సవం జరిగింది. కంపెనీ కస్టమర్లు, సరఫరా దారులు, ఇతర ప్రతినిధుల సమక్షంలో చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ మునియో తకాహషి, ఓజీ హోల్డింగ్స్ కార్పొరే >>2

వార్త

ఇతరులలో మంచిని చూడకపోవడం మనలో మంచితనం లేకపోవడాన్నే సూచిస్తుంది.

-టోట్టింగ్

# 'ఆట' కట్టు

జనంలో తెల్లారి లేచేసరికి సంపన్నులమైపోవాలన్న కాంక్ష పెరిగే కొద్దీ వారి బలహీనతను సొమ్ము చేసుకోవాలని వల వేసే వారుంటారు. జనాన్ని ఇలాంటి వాటిలోకి ఆకర్షించాలంటే సినీ ప్రముఖులు, సెలబ్రిటీ ద్వారా ప్రచారం చేస్తే చాలు అనుకున్న పని అనుకున్నట్లు సాగిపోతుందనేది ఎవరికీ తెలీని విషయం కాదు.'ఫలానా ఉత్పత్తులను తాము వాడగా ఎంతో బాగున్నాయంటూ సినీ హీరోల చేతనో, కథానాయికల చేతనో ప్రచారం చేయించి జనాకర్షణ తంత్రాన్ని పారిశ్రామికవేత్తలు పాటించడం కద్దు. కాదు కాదనుకుంటూనే వారి మాయలో జనం పడిపోయిన సందర్భాలు ఎన్నోఎన్నెన్నో. ఇవన్నీ ఎవరికీ తెలియవని కావు.నటులు నటీమణులు పరిహారం తీసుకునే అలాంటి ప్రచారం చేస్తారనీ తెలుసు. అందుకయ్యే ఖర్చు కూడా ఆయా ఉత్పత్తుల ధరల్లో కలిసే ఉంటుందనీ తెలుసు. అయినా ప్రజలు తమ బలహీనతతో అటువైపు దృష్టి సారించిన సందర్భాలున్నాయి. ఇన్నాళ్లు అలాంటివి సాగిపోయినా ఇప్పుడు వాటి ఆటకట్టే పరిస్థితి ఏర్పడింది. ఎన్నో కుటుంబాలు బెట్టింగ్ యాప్‌ల్లో ప్రచారాన్ని నమ్మి డబ్బు కట్టి ఆనక ఆసంస్థలు ఫోన్‌లు ఎత్తక దగాచేస్తున్న సందర్భాలు ఇటీవల ఎన్నో జరిగాయి. ఇప్పటికే ఎన్నో కుటుంబాలు బెట్టింగ్ యాప్‌లకు బలయ్యాయి. ఇలా ముదిరిపోతున్న బెట్టింగ్‌వ్యాపారం ఆటకట్టించే ప్రయత్నంలో జంటనగరాల పోలీసులు 25మంది సెలబ్రిటీల మీద కేసు పెట్టారు.ఒక్కొక్కరిని పిలిపించి పోలీసులు వాంగ్మూలం తీసుకుంటున్నారు. వారెవరూ కాదని చెప్పలేని పరిస్థితి. సినీ ప్రముఖులను కొందరిని పోలీసులు విచారణ చేయగా చట్టబద్ధమైన యాప్‌లకు, నైపుణ్య ఆధారిత ఆటలకేతైనే తమప్రచారం పరిమితమని సమర్థించుకున్నారు. ఫిలించాంబర్ కూడా కలుగచేసుకొని బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేసే నటీనటులపై చర్యలు తీసుకుంటామని హుంకరించింది. బెట్టింగ్ యాప్స్ బాధితుల ఆత్మహత్యలపై సైబర్ పోలీసులు ఆరా తీస్తున్నారు. ఒక్కసారిగా సైబర్ పోలీసు యంత్రాంగం తెలంగాణలో ఆన్‌లైన్ గేమింగ్‌పై నిషేధం విధించినట్లు ప్రకటించింది. స్కిల్ గేమ్స్‌కు, ఆన్‌లైన్ గేమ్స్‌కు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తులు ప్రారంభించారు. ప్రతి ఆన్‌లైన్ గేమ్ వలన నష్టాలున్నాయి. ఆన్‌లైన్ బెట్టింగ్ గ్యాంబ్లింగ్, కేసినో యాప్‌ల ప్రచారానికి సంబంధించి సినీయువ హీరోలకు పోలీసులు హెచ్చరికలుచేశారు.కొందరు సినీ హీరోలు పెద్ద మొత్తంలో లబ్ధిపొంది ఈ యాప్‌లను ప్రమోట్ చేస్తుండగా, ఆయా యాప్స్‌లో పెట్టుబడులు పెట్టినవారు నష్టపోయారు. ఆర్థిక ఇబ్బందులపాలై ఆత్మహత్యలకు పాల్పడినవారు కనీసం 15 మంది వరకు ఉంటారని అంచనా. బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు,ఇన్‌ఫ్లుయెన్సర్ ప్రమోటర్లను నిందితులుగా చేర్చారు. యువతను బెట్టింగ్ యాప్‌ల జోలికిపోవద్దని,అదొక దుర్వ్యసనమని,జీవితాన్ని పణంగా పెట్టొదని చెప్పే హితోక్తులను పాటించాల్సిన సమయం ఆసన్నమైది. ఏదో ఆశపడి చిన్న తప్పు చేసినా జీవితంలో చాలాకోల్పోతామని తెలుసుకోవడానికిసమయం పట్టింది. కొందరు సెలబ్రిటీలు తాము ప్రచారం చేసిన యాప్‌ల విషయమై అందమైన సమర్థింపులు చెప్పుకుంటున్నారు. రమ్మీస్కిల్ బేస్‌డు గేమ్ అని సాక్షాత్తు సుప్రీం కోర్టే చెప్పిందని వారు పేర్కొంటున్నారు. అలా అని బెట్టింగ్‌లో డబ్బులు కోల్పోయిన వారిని వారి కర్మకు వారిని వదిలేసి మరికొందరు ఆ దారి పట్టేలా చేయడం మంచిది కాదేమో! నిషేధిత యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలంటూ సెలబ్రిటీ, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు విస్తృత ప్రచారం చేస్తుండడంతో ఎంతోమంది యువత ఆకర్షితుల వడమే ఇప్పటి ప్రచారానికి పెట్టుబడి సెలబ్రిటీలకు భారీ పారితోషికమే ముడుతుంది. అందుకే ముందుగా వారిని నియంత్రిస్తే బెట్టింగ్‌యాప్‌ల ఆటకట్టు అవుతుంది. బెట్టింగ్‌లను ప్రోత్సహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, ఎంతోమంది యువతను వాటి కోరల్లో చిక్కుకోకుండా చూడాలని మియాపూర్ వ్యాపారి ఫణీంద్ర శర్మ అభ్యర్థనలో వివేకముంది. న్యాయాన్ని కాపాడాల్సిన కానిస్టేబులే ఇలాంటి బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేయడం ఎంతోవిచిత్రం. ఇలాంటి బెట్టింగ్ యాప్‌లనేకాకుండా నయం కాని వ్యాధులు ఇట్టే నయంచేస్తామనో,నాసిరకం ఉత్పత్తు లూ మన్నికైనవన్నగా ప్రచారంతో జనానికి అంటగట్టే ప్రయత్నం చేసే వారిపైనా పోలీసు యంత్రాంగం ఓ కన్నేసి ఉంచాలి. సమాజ సంరక్షణకు ఎన్ని విధాలుగా నడుంకట్టినా వాటికి ప్రజలనుంచి ప్రోత్సాహం ఉంటుంది. మన ముందుకొచ్చిన బాధితుల ఆర్తి తీర్చడం ఎంత ముఖ్యమో మరికొంత మంది బాధితులు పెరగకుండా చూడడమూ అంతేప్రాధాన్యం. యువతను ఎక్కువగా ఆకర్షించే అన్నిఅంశాల్లోనూ టాలీవుడ్ టార్గెట్ అవుతోందన్న మాట నిజమే అయినప్పటికీ ఎక్కడో అక్కడ తెలిసో తెలిక జరిగిన వ్యవహారాలు వారి కొంపముంచుతున్నాయి. ఇంతకుముందు మాదకద్రవ్యాల వినియోగం విషయంలో వారిపాత్ర బహిర్గతమై కొంత యాగీపడ్డారు. ఈ సారలాకాదు. నేరుగా ఆయా ఉత్పత్తులవినియోగాన్ని ప్రోత్సహించడం, పెట్టుబడుల ద్వారా ఆర్థిక లాభాల పంట పండుతుందని ప్రచారకర్తలుగా సెలబ్రిటీలు పాల్గొనే ప్రకటనలు ఇప్పుడు అభ్యంతరకరంగా తోస్తున్నాయి. బెట్టింగ్ యాప్స్ ట్రాప్‌లోపడి నిక్షేపంలాంటి కుటుంబం, ఐదంకెల జీతమొచ్చే ఉద్యోగమున్నా తన పిల్లల్ని చిదిమేసిన ఓ యువకుని ఆత్మహత్య కూడా బెట్టింగ్‌ల నేపథ్యంలో చర్చనీయాంశమైంది. ఏదైనా బెట్టింగ్ యాప్‌ల వ్యసనం యువత ప్రాణం మీదకు తెస్తున్నందున ఆయా యాప్‌లను గుర్తించి వారిని కాపాడాల్సి బాధ్యత ప్రభుత్వానిదే!

ఎప్పుడు ఎలా చనిపోయేదీ నీవు నిర్ణయించలేవు. ఇప్పుడు ఎలా జీవించాలన్నదే నీవు నిర్ణయించగలవు.



రామకృష్ణ పరమహంస

దేనినైనా ఆశించబోయే ముందు అందుకు కావలసిన అర్హతను సంపాదించుకో.



బర్ట్రండ్ రస్సెల్

# ప్రజావాక్కు



## పాఠశాలలకు ఉచిత గ్యాస్ సరఫరా

రాష్ట్రంలో డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనపథకం అన్ని పాఠశాలల్లోవిజయవంతంగా అమలవుతూఉంది. అయితే ప్రతి ప్రాథమికస్థాయి విద్యార్థికి రూ.6.19పైసలు, ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.9.29 పైసలు ప్రభుత్వం మధ్యాహ్న భోజన ఏజెన్సీ వారికి జమ చేస్తూ వస్తుంది. అయితే నిత్యవసర వస్తువులు,కూరగాయలు ధరలు పెరుగుతూ ఉండటంతో ప్రభుత్వం ఇస్తున్న ఈధరలు ఏజెన్సీ వారికి సరిపోవటం లేదు. పైగా భోజనం నాణ్యత కోసం వారి సొంతడబ్బులను సైతం ఖర్చుపెట్టుకోవాల్సి వస్తోంది. అన్ని ప్రభుత్వపాఠశాలలకు విద్యుత్ సౌకర్యం ఉచితంగా ఇచ్చినట్టుగానే పాఠశాలలకి గ్యాస్ సరఫరా కూడా ఉచితంగా అందిస్తే వంట ఏజెన్సీ వారికి కొంత ఉపశమనం లభిస్తుంది. కూటమి ప్రభుత్వం ఈ విషయమై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలి.

-పారేపల్లి సత్యనారాయణ, దేవులపల్లి, ఏలూరు జిల్లా

## మానిటరింగ్ కమిటీలు అవసరం

రాష్ట్రంలోని 33 జిల్లాలలో ఆయా జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన ఉన్న ఉద్యోగ వికలాంగుల మానిటరింగ్ కమిటీలను నియమించాలి. ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ తరహాలో ఉద్యోగ వికలాంగుల మానిటరింగ్‌కమిటీలను కూడా నియమించాలి. ప్రతినెల జిల్లా అధికారులతో సమావేశాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించాలి. ఉద్యోగ వికలాంగుల సమస్యలను కలెక్టర్ల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడానికిగాను తప్పనిసరిగా ప్రతి ప్రభుత్వకార్యాలయాలలో పనిచేస్తున్న విద్యా వైద్యం సంక్షేమం శాఖల నుండి వివిధ వైకల్యాలైన దృష్టిలోపం,శారీరక వైకల్యం, వినికిడి లోపం అన్ని వర్గాల నుండిఉద్యోగ వికలాంగులను మానిటరింగ్‌కమిటీలో సభ్యులుగా తీసుకొని సమస్యలను పరిష్కరించాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

## బస్సులు నడపాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణ బార్డర్ జిల్లాలో ఉన్న బస్సులను నడపాలి. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని పట్టణాల నుంచి హైదరాబాద్‌కు బస్సులు నడుపుతున్నారు. బార్డర్ జిల్లాల్లో నివసిస్తున్న ప్రజలకు ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లోని పలుపట్టణాలతో వైద్యసేవలు,ఇతర కార్యకలాపాల కొరకు ఆధారపడాల్సి వస్తుంది. కావున

-షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

## పేర్ల మార్పిడి ఎందుకు?

తెలంగాణా ప్రభుత్వం గత బి.ఆర్.ఎస్.ప్రభుత్వం చేసిన పొరబాట్లనే రేవంత్ రెడ్డిప్రభుత్వం చేస్తోంది. ఎప్పుడో బ్రిటిష్ వారు పెట్టిన పేర్లనుమార్చడంలోఅర్థముంది.కాని,మన రాష్ట్రం పెట్టిన తెలుగు వారి పేర్లను మార్చడం ఆ మహానుభావులు ఈనాడు మన మధ్యలేకపోయినా వారినిఅవమానించినట్టే. ఉదాహరణకు కొన్ని.ఎన్.జి. రంగావ్యవసాయ విద్యాలయం పేరును ప్రో. జయశంకర్‌గాను, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్.టి.రామారావు అందంగా అలంకరించి పెట్టిన అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును మార్చడం ఆ మహానుభావుడైన తెలుగు తేజాన్ని అవమానించడమేఅవుతుంది. సురవరం ప్రతాపరెడ్డిపేరును చర్లపల్లి రైల్వే స్టేషనుకు నామకరణం చేయండి.ఇప్పుడయినా మించిపోయింది లేదు.ప్రజాభిష్టాన్ని బట్టి ఇలా చేయవలసి వచ్చిందని చెప్పండి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## మూసిన మార్కెట్‌లను ఓపెన్ చేయాలి

ఉమ్మడి వరంగల్‌లో పండ్ల మార్కెట్ ఓపెన్ చేయడం గొప్ప ముందడుగు. తెలంగాణకే ప్రామాణికమైన మామిడి పండ్ల మార్కెట్‌ను ఓపెన్ చేయడం ముదావహం. అయితే ఈ మామిడి పండ్ల మార్కెట్ ఓపెన్ చేయడం ద్వారా ఆ రైతులు ఈ సంవత్సరం ఎక్కువడబ్బులు సంపాదిస్తే మరింతమంది ఇటువైపుగా వ్యవసాయాన్ని మళ్లించే అవకాశం ఉంటుంది. అంత మాత్రమే కాదు పంటల వైవిధ్యం కూడా సాధ్యం అవుతుంది. ఎప్పుడు పత్తి, మిరప వంటి పంటలు సాగులోకి వస్తాయి. తద్వారా మరింత పరిశోధన జరిగి మరిన్ని అధిక ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయి.

-భారత అవినాష్, జనగామ

## కాలానికి అనుగుణంగా మారాలి

మారుతున్న కాలంలో ఎక్కువ మంది పిల్లలను దంపతులు కనడం లేదు. కనినా గ్రామాల్లో నివసించడం లేదు. సమస్యకు పరిష్కారం టీచర్ చేతిలో బెత్తం కాదు. టీచర్ కూడా అప్డేట్ కావాలి. అప్డేట్ అయిన యువతరం టీచర్లుగా రావాలి. ఈ కాలం పిల్లలు పాతకాలం వాళ్ళ కంటే ఖచ్చితంగా తెలివైన వాళ్ళు మంచివాళ్లే వారిని పెడదామని పట్టిస్తున్నవి సినిమాలు, కుళ్లు రాజకీయాలు పోవాలి. మంచి సినిమాలురావాలి. మంచి రాజకీయ నాయకులు రావాలి. అప్పుడే ఖచ్చితంగా సమాజంలో మార్పు వస్తుంది. యువతపైనే ఈ సమాజాన్ని మార్చాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆదాయం మూరెడు వ్యయం బారెడు

**అభివృద్ధివైపు అడుగులు వేయాల్సిందే. పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సిందే. అందులో తప్పుపట్టలేం. కానీ ఒక హద్దు ఉంటుంది. చేసిన అప్పులు, వడ్డీలు కట్టడానికి మళ్లీ అప్పులు చేయాల్సి వస్తున్నది. అప్పు పుట్టని పరిస్థితి వస్తే ఏం చేస్తారు? ఒక్కమాటలో చెప్పాలంటే అది దివాలకు అద్దంపట్టే పరిస్థితి. వ్యక్తులకు సంబంధించి దివాలా అనేది తీవ్రమైన విషయం. సామాజిక వెలికి గురయ్యే దౌర్భాగ్య పరిస్థితి. ఒక ప్రజా ప్రభుత్వానికి సంప్రాప్తిస్తే తదనంతరం సంభవించే పరిణామాలు ఎంత ప్రమాదకరంగా ఉంటాయో ఊహించడం కష్టం. పొరుగునున్న శ్రీలంకలో ఆర్థిక సంక్షోభంతో చోటు చేసుకున్న దురదృష్ట పరిస్థితి అందరికి తెలిసిందే.**

దామెర్ల సాయిబాబ

చాలా నాళ్ల తర్వాత కలిసిన మిత్రుడిని పరామర్శిస్తూ ఎలా ఉన్నావు? ఏం చేస్తున్నావు అని అడిగాడట ఓ పెద్ద మనిషి. నాకేమిటి ఎంతో హాయిగా ఉన్నాను, సొంత ఊర్లో వ్యవసాయం చేస్తున్నానని జవాబు ఇవ్వడంతో ఎన్ని అరకల వ్యవసాయమని ఆ పెద్ద మనిషి ప్రశ్నించాడట. నాది మా సార్‌వి కలిస్తే వంద అరకల వ్యవసాయ మని రకీమని జవాబు చెప్పాడట. ఆ వంద అరకలకు సంబంధించి మొత్తం రెండువందల ఎడ్లలో నీవెన్నిఅంటే 'దొడ్లో కాలు విరిగి ఉన్న ఎద్దు లేస్తే, దొంగలు తోలుకుపోయింది దొరికితే, అత్తవారింటి నుంచి ఒక ఎద్దును తోలు కువస్తే, షావుకారు ఎద్దు కొనుగోలుకు ఇస్తానన్న అప్పు ఇస్తే నావి మొత్తం నాలుగు అవుతాయన్నడట. అంటే ఆయన వద్ద ఉన్నది ఒకేఒకఎద్దు. అది కూడా కాలు విరిగి దొడ్లో పడి ఉంది. ఆయన చెప్పు కుంటున్నది రెండు వందల ఎడ్లతో వ్యవసాయం చేస్తున్నట్లు అలాగే ఉంది తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి. తెలంగాణ ప్రభుత్వం బుధవారం మూడు లక్షల కోట్ల రూపాయలకు పైగా భారీ బడ్జెట్‌ను శాసన సభలో ప్రవేశపెట్టింది. అంత పెద్ద బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు కదా ఎన్ని కోట్లు ఉన్నాయి అంటే ఎనిమిది లక్షల కోట్ల రూపాయలకు పైగా అప్పులున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఈ నిధులు ఎక్కడి నుండి సమకూర్చుకుంటారనేందుకు విత్తమంత్రి భట్టివిక్రమార్క ఆధ్వర్యంలో అధికారులు పెద్ద కసరత్తే చేశారు. ఇదేదో ఎవరి నో విమర్శించడానికో, తప్పుపట్టేందుకో రాయడం లేదు. వాస్తవ పరిస్థితులను అద్దంపట్టే ప్రయత్నమే. ఆర్థిక పరిస్థితి ఏమాత్రం ఆశాజనకంగా లేదనేది అందరికి తెలిసిందే. రాబడి కన్నా ఖర్చు పెరిగిపోతుంది. ఆదాయ వ్యయాల మధ్య ఉన్న అంతరాయం పూడ్చేందుకు ఇప్పటికే పాలకులు మితిమీరిన అప్పులు చేశారు. వడ్డీరూపేణా వేలాది రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టిన బడ్జెట్ మొత్తం మూడు లక్షల నాలుగువేల కోట్లకు చేరుకున్నది. దాదాపు లక్షా నాలుగువేల కోట్లకుపైగా సంక్షేమ పథకాలకు కేటాయించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీ హామీల అమలుకు సంబంధించి తొమ్మిది పథకాలకు యాభై ఆరువేల కోట్లు కేటాయించారు. ఇక అభివృద్ధి పథకాలకు ప్రధానంగా మౌలిక సదుపాయాలకు మూలధనం కింద ముప్పైఆరువేల కోట్లు వెచ్చించాలని బడ్జెట్‌లో పొందుపరిచారు. రాష్ట్ర ఆర్థిక ద్రవ్యలోటు ఎనభై నాలుగువేల కోట్లు ఉంటుందని అంచనావేశారు. అంటే అంచనా వ్యయం కన్నా ఆదాయం యాభైనాలుగు వేలకోట్లు తక్కువ వస్తుంది. ఈ ఆర్థిక ద్రవ్యలోటును పూడ్చేందుకు దాదాపు అరవై తొమ్మిది వేల కోట్లకుపైగా కొత్త రుణాలు చేయాల్సి వస్తుంది. దీంతో అప్పుల భారం మరింత పెరుగుతుంది. ఇప్ప టికే పాత అప్పులు అన్ని రకాలు కలిపి దాదాపు ఎనిమిది లక్షలకోట్లకు పైగా ఉంటుందని అంచనా. పాత అప్పులు అసలు, కొత్త అప్పుల వడ్డీల కింద ఆర్థిక సంవత్సరంలో ముప్పైతొమ్మిదివేల కోట్లకుపైగా చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో కేవలం వడ్డీలకింద పంతొమ్మిది వేల కోట్లు, కిస్తీల కింద ఇరవైవేల కోట్లు చెల్లింపులు చేయాలి. ఇది మామూలు విషయం కాదు. జనాభాను పరిగణనలోకి తీసుకుంటే తలసరి అప్పు రెండు లక్షల ముప్పైవేల కోట్లకు పెరగను న్నదని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. అంచనాల మేరకు ఆదాయం రాకపోతే మరింతగా అప్పులు పెరిగే అవకాశాలున్నాయి. రాబోయే ఆదాయాన్ని ఊహించుకుంటూ పథకాలు ప్రకటిస్తున్నారు. మరోకపక్క పన్నులు వేసి ప్రజలపై అధిక భారం మోపబోమని పాలక వర్గాలు

ఒక్క మాట

చెబు తున్నా భవిష్యత్తులో తప్పదేమోననిపిస్తున్నది. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన పన్నులు ప్రజా జీవనాన్ని దుర్భరం చేస్తున్నాయి. ఆర్థిక భారంతో సామాన్యులు కృంగిపోతున్నారు. ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పేద, మధ్యతరగతి వర్గాల్లో కొనుగోలు శక్తినశించి పొదుపుఅదృశ్య మైపోతున్నది. జీతభత్యాలు పెంచినా ఉద్యోగుల నెల గడ వడానికి అప్పులు చేయకతప్పడం లేదు. ఇంకొకపక్క ఓట్ల కోసం, సీట్ల కోసం ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు అధికారులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. అసలే ఆర్థిక పరి స్థితి పిట్టన కొట్టా పొయ్యిలో పెట్టా అన్నట్లుగా ఉంటే పథ కాలకు నిధులు సమకూర్చడం ఆర్థిక మంత్రికి శక్తికి మించిన భారంగా తయారవుతున్నది. ముఖ్యంగా వ్యవసాయరంగానికి రైతు భరోసా, రుణమాఫీ లాంటి పథకాలు ఎన్నో ప్రకటించారు. అవి సకాలంలో పూర్తి చేయలేకపోతున్నారు. అయినా ఏదో రకంగా అవస్థలు పడి దశలవారీగా అన్నదాతలకు అందించేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే వ్యవసాయమనేది అదును పదునుకు అనుగుణంగా చేయాల్సి ఉంటుంది. సకాలంలో పెట్టుబడి అందకపోతే వ్యవసాయంలో ఆశించిన దిగుబడులు రావు. అవసరానికి సమయానికి సహాయం అందక రైతుల్లో అసంతృప్తి వెలుబుకుతున్నది. వానాకాలం పంటలకు సంబంధించి వరిపంటకు ఇస్తామని ప్రకటించిన క్వింటాల్‌కు ఐదు వందల రూపాయల బోనస్ రైతులందరికి ఇంకా అంద లేదు. రైతుభరోసా పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. సంక్షేమ పథకాల అమలు నిధుల కొరతతో నత్తనడక నడుస్తున్నాయి. ఉచిత బస్సుప్రయాణం మాత్రం మహిళ లలో ఆదరణ పొందుతున్నది. కల్యాణ లక్ష్మిలో తులం బంగారాన్ని కలిపి ఇచ్చే హామీ ప్రస్తావన లేనేలేదు. ఇవన్నీ మంచి పథకాలే. దారిద్ర్య రేఖకు దిగువనున్నవారికి చేయూ తనందించాల్సిన విషయంలో ఎలాంటి వాదనకు తావులేదు. సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాల్సిందే. నిర్మాణాత్మక కార్యక్రమాలు ప్రారంభించాల్సిందే. కానీ ఆర్థికపరిస్థితికూడా ఒకసారి గుర్తుంచుకోవాలి. గత ఎన్ని కల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ సంపూర్ణంగా పూర్తి చేయాలంటే ఎన్ని లక్షల కోట్లు అవసరం అవుతాయో చెప్పలేని పరిస్థితి. అంత డబ్బు ఎలా సమకూర్చుకుంటారో ఆర్థిక నిపుణుల అంచనాలకు కూడా అందడం లేదు. ఇప్పటికే పన్నులు విపరీతంగా పెంచారు. ఆదాయమార్గాల గురించి నిత్యం అన్వేషణ జరుగుతున్నది. ముఖ్యంగా ప్రజారోగ్యానికి హానికలిగించేమద్యం ఆదాయాన్ని పెంచుకునేందుకు అన్ని వ్యూహాలు, మార్గాలు అన్వేషించి అమలు చేస్తున్నారు. అయినా అవి సరిపోయే పరిస్థితులు కన్పించడం లేదు. అభివృద్ధివైపు అడుగులు వేయాల్సిందే. పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సిందే. అందులోతప్పు పట్టలేం. కానీ ఒక హద్దు ఉంటుంది. చేసిన అప్పులు, వడ్డీలు కట్టడానికి మళ్లీ అప్పులుచేయాల్సి వస్తున్నది. అప్పు పుట్టని పరిస్థితే వస్తే ఏంచేస్తారు? ఒక్కమాటలో చెప్పాలంటే అది దివాలాకు అద్దం పట్టే పరిస్థితి. వ్యక్తులకు సంబంధించి దివాలా అనేది తీవ్రమైన విషయం. సామాజిక వెలికి గురయ్యే దౌర్భాగ్య పరిస్థితి. ఒక ప్రజాప్రభుత్వానికి సంప్రాప్తిస్తే తదనంతరం సంభవించే పరిణామాలు ఎంత ప్రమాదకరంగా ఉంటాయో ఊహించడం కష్టం. పొరుగునున్న శ్రీలంకలో ఆర్థికసంక్షోభంతో చోటు చేసుకున్న దురదృష్ట పరిస్థితి అందరికి తెలిసిందే. ఇప్పుడు కాపోయినా ఏదో ఒక రూపంలో ఆదాయం పెంచుకోక తప్పదు. అందుకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రజలపై భారం మోపకమానరు. పెరుగుతున్న అవసరాలు, ఖర్చులు దృష్ట్యా ఆదాయం పెంచుకునేందుకు పన్నులు వేయాల్సిందే. కానీ అది ప్రజలకు మోయలేని భారం కాకూడదు. ప్రజలకు భారం తెలియకుండా, పన్నులు వేసి వసూలు చేయగలిగే సామర్థ్యం, నైపుణ్యత ప్రభుత్వానికి ఉండాలి. అప్పుడే దాన్ని ప్రజా ప్రభుత్వం అంటారు. మరొక పక్క ముక్కు పిండి వసూలు చేస్తున్న పన్నులు, చేస్తున్న అప్పులు వేలాది కోట్ల రూపాయలు ఏమవుతున్నాయోననేది సామాన్యులకు అర్థం కాదు. ఒకటి, రెండు కాదు వేలాది కోట్లరూపాయలు దుర్వినియోగం అవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అవినీతి పెరిగిపోతున్నది. అదుపు చేయలేకపోతున్నారు. చిన్నస్థాయిలోనే కొందరు అధికారులపై ఎసిబి శాఖ ఉద్యోగులు దాడులు చేసి విస్తుపోయే అక్రమ సంపదను కనుగొంటున్నారు. ఇప్పటికైనా పాలకులు ఆర్థిక విధానాల పట్ల ఆత్మపరిశీలన చేసుకోవాలి. పొదుపు మాటల్లో కాదు ఆచరణలో చేసి చూపించాలి. అంతేకాదు రాజ్యాంగంలో కూడా కొన్ని మార్పులు చేయాల్సిన అవసరం ఉందేమోననిపిస్తున్నది. కేవలం ఐదేళ్ల కోసం ఎన్నుకోబడిన ప్రభుత్వాలు ప్రజాసంక్షేమం పేరుతో ఇష్టానుసారంగా అప్పులు చేయకుండా చట్టాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది.

# సర్కారీ నౌకరీ వరమా! శాపమా?

ముచ్చుర్ సుమన్ గౌడ్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులను ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలకుదూరం చేస్తున్నది. వారికి ఇచ్చే పిఆర్‌సి, డిఏలను కూడా ప్రకటించకపోగా అన్ని సంక్షేమ పథకాలకు దూరం చేస్తున్నది. అటెండర్ నుండి అధికారి వరకు చిన్నస్థాయి ఉద్యోగం ఉన్న వారికి రేషన్ కార్డులను దూరంచేసి అన్నిసంక్షేమ పథకాలకు వారి కుటుంబ సభ్యులను దూరం చేస్తున్నారు. తాజాగా కులగనణ పేరు మీద సర్వే చేసి అందరి సమాచారాన్ని సేకరించి సర్కారు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కొర్రీలు పెడుతున్నది సర్కార్. ఒక కుటుంబంలో ఏదైనా చిన్న ఉద్యోగం ఉన్నా కానీ ఆ కుటుంబంలో అందర్నీ సంక్షేమ పథకాలకు దూరంచేస్తున్నారు. ఎక్కువగా చిన్నస్థాయి ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానిస్టేబుల్, రెవెన్యూడిపార్ట్మెంట్లో మరి అన్నిప్రభుత్వ కార్యాలయాలలో పనిచేసే నాలుగో స్థాయి చిన్న ఉద్యోగాలు గ్రామీణ స్థాయి నుంచే ఎక్కువగా ఉంటారు. వారందరిదీ ఎక్కువగా వ్యవసాయానికి సంబంధించిన కుటుంబాలే ఉంటాయి. ఆ కుటుంబంలో ఒకరు చిన్న ప్రభుత్వ ఉద్యోగం చేసినా ఆ కుటుంబంలో ఉన్న వ్యవసా యదారులకు సంక్షేమ పథకాలకు దూరం చేయడం వలన తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కేవలం చిన్న ఉద్యోగం చేసిన వారికి అన్ని సంక్షేమ పథకాలకు దూరం చేయడం ఎందుకు అని తమ లోపల కుమిలిపోతున్నారు.నూతన ప్రభుత్వం ఏర్ప డిన తర్వాత వ్యవసాయ రుణమాఫీలో ఎక్కువ గ్రామస్థాయి రైతులు ఉన్నారు. వారి కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం



చేస్తున్నవారు అటెం డర్, కానిస్టేబుల్ లాంటి చిన్న ఉద్యోగాలు చేసే వారు ఉన్నారు అని రేషన్ కార్డుకి దూరంచేసి రుణమాఫీ చేయలేదు.అలాగేలక్షల్లో ఆదాయం ఉండి కార్లు, పెద్ద బంగ్లాలోఉన్నవారికి రేషన్ కార్డులు మంజూరుచేసి భూస్వాములకు రుణమాఫీ చేసినారు. ప్రభుత్వం ఈసమస్య మీద దృష్టిపెట్టి ఆలోచన చేయాలి. కొన్ని సందర్భాల్లో న్యాయస్థానాల్లో కూడా అత్యుత్తమ వ్యక్తులు సంబోధించినారు బిపిఎల్‌లో ఉన్నవారు పెరుగుతున్నారు కానీతగ్గడం లేదు, అక్రమంగా రేషన్‌కార్డులు కలిగి ఉన్న వారిని ప్రభుత్వం గుర్తించాలి అనిచెప్పింది.కోటీశ్వరులు కూడా రేషన్ కార్డులు కలిగి ఉన్నారు.చిన్న ప్రభుత్వ ఉద్యోగాలు చేసుకుంటున్న వారికి అన్నీ తొలగించి ఇబ్బందులకు గురిచేయడం వలన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. చిన్నసర్కార్ ఉద్యోగులకు సర్కార్ ఇచ్చే సంక్షేమ పథకాలు ఏమీరావు.ఆర్థికంగా అన్నిరకాలుగా వెనుకబడి ఉన్నారు. పిల్లలకు ఫీజు రీయంబర్స్మెంట్ ఇన్కమ్ సర్టిఫికెట్లు ఏమీఉండవి కాబట్టి పైసలు పెట్టిచదువులు చదివించుకోవాలి. ప్రభుత్వ ఉద్యోగులకు హక్కుగా రావాల్సిన డిఏలు, పిఆర్సి ఇవ్వడం లేదు. కుటుంబపోషణకి వారిజీతం సరిపోవడం లేదు. ఇంకా 317జీవో వలన తన పుట్టిన ప్రాంతానికి దూరమై విధులు నిర్వహిస్తున్నారు.ఇప్పుడు అధికారంలో ఉన్న కొందరు నేతలు ఈ జిఓమీద పోరాటం చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడంలేదు. స్థానికంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినా అమలు చేయడం లేదు.

# సమాజాన్ని షేక్ చేస్తున్న ఫేక్ న్యూస్

మేకిరి దామోదర్

ఆధునిక టెక్నాలజీ రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది. దాన్ని మంచికి వాడుకుంటే మంచి సమాజాన్ని నిర్మించుకోవచ్చు. దానిని చెడుకు వాడుకుంటే! ఆ ఫలితాలతో చెడునే ఎదుర్కోవాల్సి వస్తుంది. మానవ సంబంధాలు, సమాజ ప్రగతి, సామాజిక విలువలు, ఆర్థిక సమానతలతో మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకున్నప్పుడే ఆధునిక టెక్నాలజీకి సార్థకత. కానీ నేటి ఆధునిక సాంకేతిక కాలం లో 'నిజం చెప్పులేసుకోక ముందే ఫేక్ న్యూస్ (అబద్ధం) ప్రపంచాన్నే చుట్టేస్తుంది'. అలా సామాజిక మాధ్యమాల్లో ఫేక్ న్యూస్ శరవేగంగా వ్యాపిస్తూ పెత్తనం చెలాయిస్తుంది. మన దేశంలో అసత్యప్రచారం డీప్ ఫేక్ వీడియోల (ప్రసిద్ధ వ్యక్తుల చిత్రాలు, వీడియోలను చూపుతూ, వారు చెప్పినట్లుగా తప్పుడు సమాచారాన్ని కృత్రిమ మేధ టూల్స్‌తో వ్యాప్తి చేయడం) సమస్య తీవ్రమవుతోంది. ఎంతలా అంటే తప్పుడు సమాచారమే నిజం అనే రీతిలో ప్రచారం చేయడం బాగా పెరిగిపోయింది. ఫేస్‌బుక్, ఎక్స్ (గతంలో ట్విట్టర్ )వంటి సామాజిక మాధ్యమాలు ఇందుకు వేదికలవుతున్నాయి. ఫలానా కంపెనీల షేర్లలో పెట్టుబడులు పెడితే, అధిక ప్రతిఫలం వస్తుందంటూ ప్రసిద్ధ వ్యాపారవేత్తలు, చివరకు ఆర్బీఐ గవర్నర్ చెప్పారంటూ! రాజకీయ నాయకులు, సినిమా నటీనటులు, వ్యాపారవేత్తలు ఇలా అనేకమంది ప్రముఖులను అపఖ్యాతి పాలు చేసేలా! వారే చెప్పారనేలా సృష్టించబడతాయి. అంతేకాదు అబద్ధాల్ని నిజాల పక్కన నిర్భయంగా నిలబెట్టేస్తున్నారు. ఎవరికో ఎవరితోనో అక్రమ సంబంధాలు అంటగడుతూ, మచ్చలేని వ్యక్తుల్ని కించపరుస్తారు. ఘన విజయాలు కూడా తేలిక చేసి చూపడం, మాట్లాడడం పెరిగిపోతోంది. ఇలాంటి విపరీత ప్రవర్తనలు సామాజిక మాధ్యమాలకు వేదికగా మారుతున్నాయి. వ్యక్తుల సమూహమే సమాజం.వ్యక్తులు ఉన్నత స్థాయికి సామాజిక విలువలతో చేరుకున్నప్పుడు సమాజం ప్రగతివైపు ప్రయాణిస్తుంది. ఎదుటి మనిషి ఓ ఎత్తుకు చేరుకున్నప్పుడు ఆ స్ఫూర్తితో మనం అంతటి స్థాయిని అందుకోవాలని ఆరాటపడడంలో తప్పులేదు. అలాంటి ప్రయత్నమేదీ లే(చేయ)కుండా బురదజల్లో, రాళ్ల విసిరో మనకంటే ఓ మెట్టు కిందికి లాగాలనుకోవడం ముమ్మాటికీ అనైతికం. ఇలాంటి తీరు సమాజానికి శ్రేయస్కరం కాదు. ఆధునిక టెక్నాలజీ సాయంతో రూపొందుతున్న ఫేక్, డీప్‌ఫేక్ వీడియోలు, ఏ ఐ డీప్‌ఫేక్ వీడియోల ఫోటోలు మార్ఫింగ్‌తో ప్రముఖ వ్యక్తులు, రాజకీయ నాయకులు, సినీతారల వ్యక్తిగత జీవితాలను బజార్‌కీడ్చడంతో కుటుంబాలు మానసిక ఆవేదనకు లోనవుతున్నారు. సమాజాన్ని వక్రమార్గం పట్టిస్తున్నాయి. ఇలాంటి వేళ తక్షణమే వీటి నిరోధానికి మార్గాలు అన్వేషించాలంటూ ప్రభుత్వాలపై ఒత్తిడి అధికమవుతుంది. ఈ సమస్యపై ఐఎస్‌బీ (ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్), సైబర్ పీస్ అనే సంస్థ సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనం ప్రకారం అనేక వివరాలు వెలుగులోకివచ్చాయి.



అసత్య ప్రచారం 77.4శాతం సామాజిక మాధ్యమాల ద్వారానే ప్రచారంలోకి వస్తోంది. అందులో ఎక్స్‌ద్వారా 61శాతం, ఫేస్‌బుక్ ద్వారా 34శాతం అసత్య ప్రచారం ప్రజల్లోకి వెళ్తుంది. వార్తలు, సమాచారం కోసం సామాజిక మాధ్యమాలను చూస్తున్న వినియోగదారుల సంఖ్య దాదాపు 74.89 శాతానికి చేరింది. అందులోనూ 68.21 శాతం మంది వీడియో సమాచారాన్ని ఇష్టపడుతున్నారు.తప్పుడు వార్తల ప్రభావానికి లోనయ్యే వారిలో 1824 సంవత్సరాల యువత అధికంగా ఉంటోంది. వీరిలోనూ తక్కువ ఆదాయాలు గల కుటుంబ సభ్యులు, తక్కువ విద్యార్హతలు గల యువతీ యువకులే ఎక్కువ.సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరుతున్న తప్పుడు వార్తల్లో రాజకీయ రంగానికి సంబంధించినవి 46శాతం ఉంటున్నాయి. సాధారణ అంశాలు, మత సంబంధ విషయాలు తదుపరి స్థానాల్లో ఉన్నాయి. ఈ విపత్కర పరిస్థితుల్లో ఫేక్ మనుషులతో, ఫేక్ సమాచారంతో, ఫేక్ వీడియోలతో తగిన జాగ్రత్తలు పాటించాల్సి ఉందనేది ఈ నివేదిక సారాంశం. సామాజిక మాధ్యమాల్లో కనిపించే తప్పుడువార్త (ఫేక్‌న్యూస్), పూర్తిగా తప్పు లేదా పూర్తిగా నిజం కాని సమాచారాన్ని ఫేక్‌న్యూస్ అంటారు. అది ఎక్కడినుంచి వస్తుందో ఎవరు పంపుతున్నారు, స్పష్టంగా వెల్లడికాదు. ఏదోఒక ఐడినుంచి వచ్చి సోషల్ మీడియాలో చెలామణి అవుతుంది. ఐడికూడా ఫేక్ దే కావచ్చు.కొంతమంది వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో ప్రచారంలోకి తెస్తున్నారు. తద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించడంకోసం ఉన్నదిలేనట్లు లేనిది ఉన్నట్లు చూపిస్తున్నారు. ఏదో ఒక ప్రయోజనాన్ని ఆశించి ఇటువంటి అసత్య ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. అది తప్పుడు వార్త అనే అనుమానం రానంత పకడ్బందీగా ఈ వ్యవహారాన్ని నడిపిస్తారు. సోషల్‌మీడియా వేదికలన్నింటిలోనూ దీన్ని వైరల్ చేస్తారు. తప్పుడు సమాచారం ఫేక్ న్యూస్ వీడియోల వల్ల రాజకీయ పార్టీ(నాయకు)ల జయాపజయాలను, ప్రవర్తనను ప్రభావితం చేస్తోంది. వ్యాపార దిగ్గజాలు, సినీప్రముఖులు,పాలక ప్రతిపక్షాలు, మాన్యులు, సామాన్యులు ఇలా ఎంతో మంది సమాజంలో ఇబ్బందులు పడుతున్నారు. ఏది వాస్తవమో ఏది అవాస్తవమో తెలియక తల్లడిల్లిపోతున్నారు. అంతెందుకు మన రాష్ట్ర రాజధానిలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి, తన తోటి విద్యార్థిని ఫోటోలను మార్ఫింగ్ చేసి నాతో ఒంటరిగా గడపాలని లేదంటే సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని బ్లాక్ మెయిల్ చేస్తున్న ఉదంతాలను చూస్తుంటే..టెక్నాలజీ ఎవరి కోసం ఎందుకు వచ్చిందో ఇలాటెక్నాలజీని విచక్షణ కోల్పోయి దుర్వినియోగం చేస్తున్న తీరు అమానుషం. టెక్నాలజీని మంచి కోసం ఉపయోగించాలి గాని సమాజ విలువలు తగ్గించే చర్యలు మంచిది కాదు. ఆధునిక నాగరికత ముసుగు వేసుకున్న సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ సామాజిక రుగ్మతను నిరోధించడానికి సమిష్టి కృషి ఎంతో అవసరం. సైబర్ సెక్యూరిటీ చర్యలను బలోపేతం చేయడం పై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలి. ప్రజలు కూడా సమిష్టి బాధ్యతతో వ్యవహరించాలి. అసత్యాల ప్రచారాన్ని అడ్డుకునేందుకు కఠిన చర్యలకు పూనుకోవాలి.సాంకేతిక పరిష్కారాలకు మాత్రమే పరిమితం కాకుండా,ప్రచార సాధనాలపై ప్రజల్లో చైతన్యం, అవగాహన పెంపొందించాలి.

## రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

### - కలెక్టర్‌ను కోరిన గొట్టిపాటి లక్ష్మీ



**దర్శి, మార్చి 21, ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా కలెక్టర్‌ను దర్శి టీడీపీ ఇన్‌ఛార్జీ గొట్టిపాటి లక్ష్మీ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యంగా రానున్న వేసవిలో దర్శి పట్టణంలో, గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రనాళికతో సంబంధిత అధికారులను అప్రమత్తం చేయాలని కోరారు. అవసరమైన గ్రామాల్లో పట్టణంలో వాటర్ ట్యాంకుల ద్వారా మంచినీటిని అందించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సాగర్ కాలువ నీటిని కూడా అందించాలని కోరారు. తాగునీటి అంశంపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి వేసవిలో తాగునీటి సమస్య తెలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ కాలనీలా అంతర్గత రోడ్లు అనుబంధ రోడ్లను నిర్మించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని మౌలిక వసతులు కల్పించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ రూ.50లక్షల నిధులతో తిమ్మాయిపాలెం టూ ఎస్టీ కాలనీ, కట్టుబడివారిపాలెం టూ ఎస్సీ కాలనీ రోడ్డును నిర్మించేందుకు అనుమతి మంజూరు చేసినట్లు తెలిపారు. అంతే కాక పెండింగ్ బిల్లులు వివిధ కార్యాలయంలో సిబ్బంది కొరత మరికొన్ని ప్రజా సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు లక్ష్మీ వివరించారు.

## కనిగిరి సమీపంలో రోడ్డు ప్రమాదం

### - మహిళ మృతి - కూలీ పనులకు వెళ్తుండగా ప్రమాదం



**కనిగిరి, మార్చి 21, ప్రభాతవార్త**

కనిగిరి మండలం విజయగోపాలపురం సమీపంలో శుక్రవారం ఉదయం 6గంటల సమయంలోఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కంచర్లవారిపల్లి – తలకొండపాడు రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో ఇండ్ల లక్ష్మమ్మ(50) అనే మహిళ మృతి చెందారు. వివరాల ప్రకారం.. కనిగిరి పట్టణంలోని కాశిరెడ్డి కాలనీకి చెందిన ఇండ్ల లక్ష్మమ్మ ఇతర కూలీలతో కలిసి తలకొండపాడు గ్రామానికి ఆటో లో కూలీ పనులకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. రహదారిపై ఉన్న ముళ్ళకొమ్మను తప్పించేందుకు డ్రైవర్ ప్రయత్నించగా వేగాన్ని నియంత్రించలేక ఆటో అదుపు తప్పి తలక్రిందులైంది.

**తీవ్ర గాయాలతో ఘటనాస్థలంలోనే మృతి:**

ప్రమాదంలో లక్ష్మమ్మ తలకు తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఆటోలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న కనిగిరి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కనిగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు కొనసాగుతోందని ఎస్సై శ్రీరామ్ తెలిపారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

## తొమ్మిది నెలల తర్వాత మృతదేహానికి పోస్టుమార్టం



**చీమకుర్తి, మార్చి 21, ప్రభాతవార్త**

చీమకుర్తి పట్టణం, గాంధీ నగర్ లో ఉరి వేసుకొని చనిపోయిన పులివర్తి బాల బ్రహ్మ అనే వ్యక్తి మరణం మిస్టరీగా మారింది. సుమారు 9 నెలల తర్వాత ఆ వ్యక్తి మృతదేహం ను శుక్రవారం బయటకు తీసి అధికారుల సమక్షంలో ప్రత్యేక వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. చీమకుర్తి పట్టణం గాంధీనగర్ లో గత ఏడాది జూన్ 6న పులివర్తి బ్రహ్మం తన ఇంట్లో ఉరి వేసుకొని మరణించారు. అతని మరణం పై అనుమానం వున్నది అంటూ అతని బార్య పులివర్తి గౌరీ పూర్ణ ఇచ్చిన పిర్యాది మేరకు, కేసు నమోదు చేశారు. చీమకుర్తి శుక్రవారం తహసిల్దార్ బ్రహ్మయ్య మరియు ఒంగోలు నుండి వచ్చిన ఫోరెన్సిక్ డాక్టర్ ల పర్య వేక్షణ లో సదరు శవాన్ని వెలికి తీసి, పోస్ట్ మార్టం నిర్వహించటం అయింది. చీమకుర్తి సీఐ సుబ్బారావు పర్యవేక్షణలో ఎస్సై కృష్ణయ్య పోస్టుమార్టం కు బందోబస్తు నిర్వహించారు.

## ఎస్ఎస్‌యన్‌లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం



**ఒంగోలు, ప్రభాతవార్త**

స్థానిక మంగమూరు రోడ్‌లోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాల నందు ఫైనల్ ఇయర్ డిగ్రీ విద్యార్థుల వీడ్కోలు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ వై సత్యనారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థులు ఘనవీడ్కోలు పలికారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన కళాశాల ఛైర్మన్ వై రామకృష్ణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు చదువుతోపాటు ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకుని ఆ లక్ష్యసాధన దిశగా అడుగులు వేయాలని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమలో కళాశాలను ఈ మధ్యకాలంలో రెండు కంపెనీల ద్వారా ఉద్యోగఅవకాశాలు కల్పించామని, ఎంపికైన వారికి సభలో అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఆ సంస్థ ప్రతినిధుల చేతులమీదుగా అందజేశారు. విద్యార్థులకు ఒక చదువు మాత్రమే కాకుండా వారికి ఉపాధి అవకాశాలు కూడాకల్పించే దిశగా ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యాసంస్థలు కృషిచేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు నృత్యాలు, మ్యూజిక్ డ్యాన్స్‌లు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన అధ్యాపకులు, విద్యార్థులను ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి రాజశేఖర్‌రెడ్డి, టి రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ఉగ్ర



**పామూరు, మార్చి 21, ప్రభాతవార్త**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే ఉత్తమ చెత్త సంపద కేంద్రంగా ఎంపిక కాబడిన పామూరు చెత్త సంపద కేంద్రాన్ని శుక్రవారం నాడు కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సందర్శించారు. ఆహ్లాదకరమైన వాతారవణం, పచ్చని చెట్లు, చూపరులకు కనువిందు చేసే విధంగా ఉన్న ప్రకృతి సౌందర్యాన్ని పొందుపరిచే విధంగా ఏర్పాటు చేసిన కార్యదర్శి అరవింద రెడ్డిని ఆయన ప్రశంసించారు. గత సర్పంచ్ దర్శి వెంకట మనోహర్‌ప్రసాద్ దాతల సహకారంతో కోట్ల రూపాయల విలువైన స్థలాన్ని చెత్తసంపద కేంద్రానికి విరాళంగా అందించి సొంత వ్యయంతో ప్రతిష్ఠాత్మకంగా ఎంతో సుందరవందరవనంగా తీర్చిదిద్దడం అభినందనీయమని అన్నారు. కూరగాయాల పంటలు, ఆకు కూరలు, బాతుల పెంపకం, పరిసరాల పరిశుభ్రత కలిగి ఉండటం తనకెంతో ఆహ్లాదకరంగా ఉందని ఉగ్ర తెలిపారు. ముందుగా మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతిపిత కన్న కళలు సాకారం కావాలంటే ప్రతి గ్రామంలో స్వచ్ఛత నెలకొల్పాలన్నారు. గ్రీన్ అంబాసీడర్ల ద్వారా గ్రామాల్లో చెత్త వ్యర్థాలను తొలగిస్తూ వర్మీ కంపోస్టు తయారు చేసి నాడెప్ తొట్లలో తడి, పొడి చెత్తను వేరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో అరవిందరెడ్డి, డీఎల్‌పీఓ హనుమంతరావు, ఉప్పలపాటి హరిబాబు, మెంటా నరసింహారావు, కావలి తిరుపతయ్య, మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు కొండిశెట్టి రమణయ్య, ఖాజా రహంతుల్లా, ఎస్సై కిషోర్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ రత్నకుమార్, బిల్ కలెక్టర్ కృష్ణవేణి, కార్యదర్శి కొమ్మాలపాటి కృష్ణమూర్తి, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీచెడిపోతు శరభయ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



**నాగులుప్పలపాడు, మార్చి 21, ప్రభాతవార్త**

నాగులుప్పలపాడు గ్రామంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి యొక్క దేవస్థానంలో శ్రీచెడిపోతు శరభయ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నాగులుప్పలపాడు– ఉప్పుగుండూరు వెళ్లే మధ్యలో స్వామి ఆశ్రమం వద్ద శుక్రవారం చెడిపోతు శరభయ్య గురు స్వామి యొక్క విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సురేష్‌బాబు, ప్రధాన అర్చకులు మహేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ మంత్రి స్వామి



**టంగుటూరు, మార్చి 21, ప్రభాతవార్త**

మండలంలో తూర్పునాయుడుపాలెంలో మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి లబ్ధిదారులకు సీఎంఆర్ చెక్కులు పంపిణీ చేశారు. 85 మందికి రూ.73 లక్షల విలువైన చెక్కులు అందజేశారు. కొండపి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 218 మందికి రెండు కోట్ల 12 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేసినట్లు మంత్రి తెలిపారు. పేదల కోసం కూటమి ప్రభుత్వం ఎంతైనా ఖర్చు భరిస్తుందన్నారు.

### ఉపాధి హామీ పథకాన్ని గ్రామాల అభివృద్ధికి

## మరింత సమర్ధవంతంగా అమలు చేయాలి: డిప్యూటి సిఎం పవన్






**ఒంగోలు, ప్రభాతవార్త**

ఉపాధి హామీ పథకాన్ని గ్రామాల అభివృద్ధి, రైతుల అభివృద్ధి కోసం మరింత సమర్ధవంతంగా అమలు చేయడానికి సంకల్పించినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం విజయవాడ కార్యాలయం నుండి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఫారం పాండ్ల ఏర్పాట్లు, సీసీ రోడ్ల నిర్మాణాల పురోగతి, గోకులాల నిర్మాణాల పురోగతి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ గ్రామీణ పేద ప్రజలకు ఉపాధి హామీ పథకం ఒక వరం అని, ఈ పథకం ద్వారా 57.91 లక్షల కుటుంబాలకు చెందిన 97.42 లక్షల మంది ఉపాధి కూలీలకు వారి సొంత గ్రామాల్లోనే రోజు వారి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఇప్పటి దాకా 23.47కోట్ల పని దినాలు కల్పించామన్నారు. 4.24 లక్షల కుటుంబాలకు 100రోజుల పని కల్పించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఇప్పటి వరకు ఈ పథకం కింద మొత్తం 9561 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం, అందులో 5991 కోట్ల రూపాయలు ఉపాధి కూలీలకు, 3570 కోట్ల రూపాయలు మెటీరియల్ కింద ఖర్చు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల కి.మీల సీసీ రోడ్లను మొదలు పెట్టి, 3,346 కి.మీల సీసీ రోడ్లను ఇప్పటి వరకు పూర్తి చేయడం జరిగిందని, తెలుగు నూతన సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా మార్చి 29వ తేదీ నుండి వారం రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా సీసీ రోడ్లను రాష్ట్ర ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సుస్థిర ఆస్తుల కల్పన ,గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 22,500 గోకులాలు మొదలు పెట్టి, ఇప్పటి దాకా 19,325 గోకులాలు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. గోకులాల వల్ల గ్రామాలలో ఆరోగ్యకరమైన వాతారవణం ఏర్పడి, పాల ఉత్పాదకత సగటున ఒక్కో పశువుకు రోజుకు 2 లీటర్లు పెరిగిందని, ఫలితంగా ప్రతి రైతుకు నెల 12 వేల రూపాయల అదనపు ఆదాయం లభిస్తుందని అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా మార్చి 22వ తేదీన 1,55,000 ఫారం పాండ్లను రైతుల పొలాల్లో చేపట్టి ఒక టీఎంసీ నీటిని సంరక్షించేలా ముందుకు వెళ్లాలని, ప్రస్తుతం తవ్వే ఫారం పాండ్లు కేవలం నీటి నిల్వకే కాకుండా రైతులకు ఆదాయం ఇచ్చే పంట సంజీవని లా మార్పు చేస్తున్నామన్నారు. ఈ ఫారం పాండ్ల నిర్మాణం వలన రైతులకు అనేక లాభాలున్నాయి. వర్షపు నీటిని సేకరించి, పొలాలకు అవసరమైన సమయంలో వాడుకోవచ్చున్నారు. రైతులను చైతన్య పరిచి త్వరితగతిన ప్రభుత్వం నిర్దేశించిన విధంగా 1.55 లక్షల ఫారం పాండ్లను పూర్తి చేయాలన్నారు. అలాగే ఏప్రిల్, మే, జూన్ నెలలో పెద్ద ఎత్తున హాజరయ్యే కూలీలకు పని ఇవ్వడానికి అధికార యంత్రాంగం సమాయత్తంగా ఉండాలి.వేసవి కాలంలో పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పని సమయాలు కూలీల సౌలభ్యం మేరకు ఉండాలని సూచించారు. సగటు కూలి రేటును రూ.300లకు పెంచేలా కూలీలకు, మేట్లకు అవగాహన పెంచడానికి తగినచర్యలు తీసుకోవాలి. వేతన పర్యవేక్షణ కమిటీలను (డబ్ల్యూఎంసీ) ఏర్పాటు చేసి సగటు కూలి రేటును పెంచడానికి చర్యలు తీసుకోవడంతో పాటు అవినీతిని తగ్గించడానికి ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటుచేసి తనిఖీలు చేపడుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు.అవినీతికి పాల్పడిన సిబ్బందిని ఉద్యోగం నుండి తొలగించడం,శాఖాపరమైన చర్యలు చేపట్టి జవాబుదారితనం పెంచుతున్నామన్నారు. ఉపాధి హామీ పథకాన్ని క్షేత్ర స్థాయిలో పారదర్శకతతో అమలు చేయడానికి జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఒంగోలు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, డీపీఓ వెంకట నాయుడు, పంచాయతీ రాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ వ్యవస్థను భ్రష్టు పట్టించిన గత ప్రభుత్వం

*- అద్దంకి నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల శాస్వత పరిష్కారానికి చర్యలు - మంత్రి గొట్టిపాటి*

*- పల్లూరులో 132 కేవీ, కొప్పరం, కొప్పెరప్పాలెంలతో సహా మరో 11కేవీ సబ్ స్టేషన్లు*

**అద్దంకి రూరల్, మార్చి 21, ప్రబాతవార్త**

అద్దంకి నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల శాస్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. సంతమాగులూరు మండలం ఏల్చూరులో 132/33 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికై భూసేకరణ పనులు పూర్తయ్యాయన్నారు. త్వరలో 132/33 సబ్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. అదే విధంగా నియోజకవర్గంలో కొప్పరం, కొప్పెరప్పాలెం లతో సహా మరో 11 కేవీ సబ్‌స్టేషన్లు 10 ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థను గత వైసీపీ సర్కారు భ్రష్టు పట్టించిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం గత ఐదేళ్ల బ్రస్టు పట్టిన అన్ని వ్యవస్థలను గాడిలో పెట్టుకుంటూ అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా అభివృద్ధి పథంలో నడిపించడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో మిగులు విద్యుత్ ఉత్పత్తే లక్ష్యంగా సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రత్యేక ప్రణాళికలు రూపోందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రజలు అందరూ సూర్యాఘర్ పథకం ద్వారా సోలార్ విద్యుత్‌ను వినియోగంలోకి తీసుకు వచ్చి విద్యుత్ బిల్లులను తగ్గించుకోవాలన్నారు. సోలార్ విద్యుత్ వినియోగదారలకు ఎస్సీ,ఎస్టీలకు పూర్తిగా ఉచితంగా సోలార్ కనెక్షన్‌లు అమర్చడం జరుగుతుందని, మిగిలిన వారికి 1కేవీ సామర్ధ్యానికి రూ.30వేలు, 2 కేవీకి రూ.60 వేలు, 3 కేవీకి రూ.78 వేలు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. మిగిలిన మొత్తాన్ని కూడా బ్యాంకుల నుండి రుణాలు పొందే అవకాశం ఉందన్నారు. సోలార్ ద్వారా ఇంటి వద్ద ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ఇంటి వాడకం పోను మిగులు ఉంటే యూనిట్‌కు రూ.2.06 చొప్పర వినియోగదారునికి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అద్దంకి ఈఈ నల్లూర్లి మస్తాన్‌రావు, సంతమాగులూరు ఏఈ దీపక్‌రెడ్డి, స్థానిక అధికారులు తాహశీల్దార్ కె.రవి బాబు, ఎంపీడీఓ జ్యోతిర్మయి. వెలుగు ఏపీఎం మస్తాన్‌రావు, ఎంపీపీ ఎనుబర్ల యల్లమంద, నాయకులు తేలప్రోలు రమేష్, యేవూరి వాసురెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు గాడిపర్తి వెంకట్రావు, డీసీ అధ్యక్షులు కామాను శ్రీనివాసరావు, సంతమాగులూరు సర్పంచ్ పుచ్చకాయల నాగేశ్వరరావు, అట్లా పెద్ద వెంకటరెడ్డి, చింతా రామారావు, ఆలూరి శ్రీనివాసరావు, మండల సర్పంచుల సంఘ అద్యక్షులు పుట్టవారిపాలెం సర్పంచ్ సన్నెబొయిన గురుబ్రహ్మం, దుద్దేల చిన్న గాలయ్య తదితరులు పాల్గొనగా సంతమాగులూరు సీఐ వెంకట్రావు తన సిబ్బందితో బందో బస్తు నిర్వహించారు.



## ఆక్వా రైతుల సాగు కోసం రుణం మంజూరు





**టంగుటూరు, మార్చి 21, ప్రభాతవార్త**

టంగుటూరు మండలంలోని వల్లూరు గ్రామంలో ఉన్న అల్లూరమ్మ దేవస్థానం వెనుక ఉన్న వల్లూరు చెరువులో ఒంగోలు సొసైటీ బోర్డు ఆధ్వర్యంలో బోర్డు సభ్యులు వల్లూరు చెరువులో చేప పిల్లలు వదలడం జరిగింది. ఈ సందర్భంగా ఆక్వా జిల్లా అధికారి రైతులతో మాట్లాడుతూ మత్స్యసంపద పెంచుకుని ఆక్వా రైతుల అభివృద్ధి పొందటమే లక్ష్యం అని శ్రీనివాసరావు పూజా కార్యక్రమంలో చెరువులో చేప పిల్లలను వదిలేశారని రవిబాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆక్వా రైతులు సొసైటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. సొసైటీ బోర్డు సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి బాల వీరాంజనేయస్వామికి మత్స్యశాఖ అధికారులు, ఆక్వా రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

### నేర నియంత్రణ, అసాంఘిక, చట్టవ్యతిరేక

## కార్యకలాపాల కట్టడికి చర్యలు తీసుకోవాలి

### - దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు పోలీసు స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్










**దర్శి, మార్చి 21, ప్రభాతవార్త**

నేర నియంత్రణ, అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాల కట్టడికి గట్టి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. శుక్రవారం పోలీసు స్టేషన్ స్థితిగతులు, సిబ్బంది పనితీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు పోలీసు స్టేషన్లను జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్న సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, గస్తీ విధులు పటిష్టంగా నిర్వర్తించి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. చెడనడత కలిగిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని, విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రజలకు శక్తి యాప్, సైబర్ మోసాలపై మాదక ద్రవ్యాల పట్ల జరుగు అనార్ధాలపై, రోడ్డు భద్రత నియమాలు, హెల్మెట్‌పై అవగాహన, సీసీ కెమెరాలు యొక్క ప్రాముఖ్యతను తెలియజేసి వాటిని ఏర్పాటు చేసుకునే విధంగా ప్రజలను ప్రోత్సహించాలన్నారు.స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ప్రజాఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ఫిర్యాదులను పరిష్కరించాలని సూచించారు.

దర్శిలోః దర్శిలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా జిల్లా ఎస్పీ అక్కడి భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. ఆలయ పరిసరాలు, ప్రవేశ మార్గాలు, క్యూలైన్లను భద్రతా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శ్రీప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు సిబ్బందితో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామని, పూర్తి స్థాయి బందోబస్తుతో అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అనంతరం దర్శి పోలీసు స్టేషన్, సర్కిల్ కార్యాలయం, డీఎస్పీ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, స్పెల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, దర్శి సీఐ రామారావు, త్రిపురాంతకం సీఐ అసన్, సర్కిల్ ఎస్సైలు మురళి, మల్లిఖార్జున, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం ఘాట్ రోడ్డులో తుమ్మలబైలు వద్ద ఇసుక టిప్పర్ వాహనం బ్రేక్ డౌన్

- ఘాట్ రోడ్డులో నిలిచిపోయిన ట్రాఫిక్ - ఎస్సై వి.మహేష్ చొరువతో ట్రాఫిక్ క్లియర్




**పెద్దదోర్నాల, మార్చి 21, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల మండల పరిధి శ్రీశైలం ఘాట్ రోడ్డు తుమ్మలబైలు సమీపాన శుక్రవారం ఇసుక లోడుతో వెళ్తున్న టిప్పర్ వాహనంకు డీజిల్ లేక బ్రేక్ డౌన్ జరిగింది. దీంతో రోడ్డుకు ట్రిప్పర్ వాహనం అడ్డు కావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో తుమ్మలబైలు నుండి అటు వైపు శ్రీశైలం మార్గమున కొంతదూరం ట్రాఫిక్ స్తంభించింది. నల్లమల అడవి ప్రాంతం కావడం, ఎండకు వేడిమికి ప్రజలు నల్లమల ఘాట్‌లో కొంత మేర ఇబ్బంది పడ్డారు. అయితే సమాచారం అందుకున్న ఎస్సై వి.మహేష్ యుద్ద ప్రాతిపదికన ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ స్తంభించడానికి టిప్పర్‌లో డీజిల్ అయిపోయిందని తెలుసుకున్నారు. ట్రాఫిక్ పరిస్థితిని అవగతం చేసుకొని వెంటనే తన వాహనంలో యుద్ద ప్రాతిపదికన శ్రీశైలం వెళ్లి 40 లీటర్ల డీజిల్ తెప్పించి రోడ్డుకు అడ్డంగా ఉన్న టిప్పర్ వాహనాన్ని ముందుగా స్టార్ట్ చేయించారు. దీంతో టిప్పర్ అడ్డు తొలగడంతో ఇరువైపులా నిలిచిపోయిన వాహనాల ట్రాఫిక్‌ను ఎస్సై వి.మహేష్ దగ్గర ఉండి క్లియర్ చేయించారు. ఎస్సై మహేష్ చూపిన చొరువకు ప్రయాణికులు, ప్రజలు అభినందించారు. ఈ సందర్భంగా ఎస్సై వి.మహేష్ మాట్లాడుతూ శ్రీశైలానికి ఘాట్ రోడ్డులో వెళ్లే వాహనదారులు, ప్రత్యేకించి ఇసుక తోలుతున్న టిప్పర్లు వాహనాలలో డీజిల్ ఉందో లేదో ముందుగా తనిఖీ చేసుకొని వెళ్లాలని, ఘాట్ రోడ్డులో వాహనాలు నిలిచిపోవడం ప్రజలు ఇబ్బంది పడటం మంచిది కాదని డ్రైవర్లకు ఎస్సై వి.మహేష్ సూచించారు.

# హక్కులకై పోరాడితేనే భవిష్యత్తు

**హనుమంతునిపాడు ,మార్చి21, ప్రభాతవార్త**
ఆశా వర్కర్స్ తమ హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేస్తేనే భవిష్యత్తు ఉంటుందని లేకుంటే ప్రభుత్వాలు సమస్యలు పట్టించుకునే పరిస్థితి ఉండదని జిల్లా కార్యదర్శి తెలిపారు. సుందరయ్య భవనంలో జరిగిన ఆశా వర్కర్స్ హనుమంతునిపాడు మండల నూతన కమిటీ ఎన్నికలో వీరు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తూ పెట్టుబడి దారుల ప్రయోజనాలకు వాసం పని చేస్తున్నటువంటి పాలకులను మెడలో వంచాలంటే పోరాటమే మార్గమని అన్నారు. ఈసందర్భంగా మండల నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. మండల కమిటీ అధ్యక్షురాలుగా యు.లక్ష్మీదేవి, ఉపాధ్యక్షురాలుగా కే.రుతమ్మ, ప్రధాన కార్యదర్శిగా వి.దేవమ్మ, సహాయ కార్యదర్శిగా బి.రోజిని, ట్రెజరర్‌గా ఎం.చాముండేశ్వరితో పాటు కమిటీ సభ్యులుగా ఆర్.ఎలిజబెత్ రాణి, విజయలక్ష్మీదేవి, ఎస్.బాలచెన్నమ్మ, టి.ప్రశాంతి, కే.రుతమ్మ, జై.బిరియమ్మ, కే.జయమ్మ, జే.చిన్నమ్మలను మండల ఆశా వర్కర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలుపుతూ భవిష్యత్తులో ఆశా వర్కర్ల సమస్యలపై మరిన్ని పోరాటాలు ఉద్యమాలు నిర్వహించి హక్కులు సాధించేందుకు ఐక్యంగా ముందుకు కథలాలని సూచించారు.

## నారా దేవాన్స్ జన్మదినం సందర్భంగా టీవీ బహుకరణ



**మార్కాపురం, మార్చి 21, ప్రభాతవార్త**
నారా చంద్రబాబునాయుడు మనువడు, మంత్రి నారా లోకేష్ తనయుడు నారా దేవాన్స్ జన్మదిన సందర్భంగా శుక్రవారం పట్టణంలోని 18వ బ్లాక్ అంగన్‌వాడీ కేంద్రానికి టీవీని బహుకరించారు. దైవ శ్రీ సిందే శివాజీ స్వామీ.జీ రూ.20వేలు విలువ చేసే టీవీని శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి సోదరుడు కందుల వేణుగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా కేంద్రానికి అందజేశారు. ఈ సందర్భంగా కందుల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నారా దేవాన్స్ పుట్టిన రోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని భవిష్యత్తులో తాతకు తగ్గ మనువడులా రాజకీయాలలో ఎదగాలని ఆకాంక్షించారు. అంగన్‌వాడీ కేంద్రానికి ఖరీదైన టీవీని అందజేసిన శివాజీ స్వామి మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ ఖలీద్, షేక్ మహమ్మద్ అలీ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# చేరువలో సకల సేవలు

- సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల



**మార్కాపురం, మార్చి 21, ప్రభాతవార్త**
ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం సచివాలయ వ్యవస్థ ద్వారా సకల సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన నూతన సచివాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్ద నాగులవరం పంచాయతీలో నూతన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అందరి ప్రభుత్వం అని పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందని అన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అందుబాటులో ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీలో చేరిన వైసీపీ సర్పంచ్ ఒర్సు వీరబాబు, ఆరుగురు వార్డు మెంబర్లు, అనుచరులను పార్టీలో స్వాగతించి కండువాలు కప్పారు. అనంతరం సచివాలయ ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు జవ్వాజి రామానులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అమావాస్య ఉపవాస పండుగ ప్రార్థనలో పాల్గొనండి.. స్వస్థత పొందండి

- కల్వరి అగాపే ట్రైబల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాస్టర్ ఇశ్రాయేలు పిలుపు

**పెద్దదోర్నాల, మార్చి 21, ప్రభాతవార్త**
ఈ నెల 29వ తేదీ ఉదయం 10గంటలకు నియోజకవర్గ కేంద్రం యర్రగొండపాలెం కల్వరి అగాపే చర్చిలో జరిగే అమావాస్య ఉపవాస అభిషేక పండుగ ప్రార్థన ఆరాధన కార్యక్రమంలో క్రైస్తవ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రక్షణ స్వస్థత పొంది దైవాశీర్వాదాలు పొందాలని కల్వరి అగాపే ట్రైబల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పాస్టర్ జి.ఇస్రాయిల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం దోర్నాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దెయ్యముల చేత పీడింపబడు వారి కోసం ప్రత్యేకంగా ప్రార్థించి దైవకార్యం జరిపించబడును. ప్రార్థన చేయడం, దైవజనుల పని, కార్యం చేయుట దేవని పని అని, ఆరాధనలో పాల్గొనండి.. స్వస్థత పొందండని పిలుపునిచ్చారు.

## నియోజకవర్గ వ్యాప్తంగా శిలువ మార్గాన్ని ఘనంగా నిర్వహించిన క్రైస్తవులు



**గిద్దలూరు, మార్చి 21 ప్రభాతవార్త**
గిద్దలూరు నియోజకవర్గ వ్యాప్తంగా క్రీస్తు శిలువ మార్గాన్ని శుక్రవారం క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. శిలువ మార్గం అనేది క్రీస్తు చివరి ప్రయాణాన్ని గౌరవించడమే కాక ఆయన చేసిన త్యాగాన్ని గుర్తుచేసుకొని క్రీస్తు మార్గంలో నడవాలి అనే సందేశాన్ని ప్రజలకు ఫాస్టర్లు తెలియజేశారు. కొమరోలు మండలంలోని ఎడమకల్లు గ్రామంలో ఘనంగా శిలువ మార్గం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసు శిలువను భుజంపై ధరించి గ్రామంలోని పురవీధులలో ఫాస్టర్లు క్రీస్తు సందేశాలను వినిపిస్తూ, గీతాలను ఆలపిస్తూ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళలకు ఉచితంగా బ్యూటీషియన్ కోర్సు శిక్షణ తరగతులు

**సంతనూతలపాడు, మార్చి 21, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం ఎండ్లూరు డొంక వద్ద గల జిల్లా స్థాయి మహిళా ప్రాంగణంలో ఈనెల 24 నుండి మహిళలకు ఉచితంగా బ్యూటీషియన్ కోర్సులు శిక్షణ తరగతులు జరగనున్నట్లు జిల్లా మేనేజర్ వై.అంజమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు నెలల పాటు మహిళలకు ఈ శిక్షణా తరగతులు ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. 15 నుండి 45 సంవత్సరాలలోపు గల మహిళలు ఈ శిక్షణ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని జిల్లా మేనేజర్ అంజమ్మ కోరారు. శిక్షణ తదుపరి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు ఆమె పేర్కొన్నారు.మరిన్ని వివరాల కోసం మొబైల్ నెంబరు 8333921346 లను సంప్రదించాలని జిల్లా మేనేజర్ అంజమ్మ కోరారు.

## ఘనంగా గురు చెన్నదాస్ 134వ ఆరాధన మహోత్సవ వేడుకలు



**అద్దంకి రూరల్ ,మార్చి 21, ప్రభాతవార్త**
సంతమాగూలురులో గురు చెన్నదాస్ 134వ ఆరాధన మహోత్సవ వేడుకలు శుక్రవారం నాడు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆవుల మంద వంశస్తుడైప గురు చెన్నదాస్ మహిమోన్నతుడుగా పేర్కొంటారు. చెన్నదాస్ తను జీవించి ఉన్నప్పుడే తన మరణంతో పాటు భవిష్యత్ వాణిని వినిపించినట్లు పెద్దలు తెలుపుతున్నారు. చెన్నదాస్ ఆరాదన కార్యక్రమాలు ప్రతిఏటా అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఉదయంనుండి చెన్నదాస్ దర్గా వద్ద ప్రత్యేక పూజలు చేస్తారు. మెక్కుబడులు తీర్చుకునేవారు బారులుతీరుతారు. ఈ సందర్భంగా ఉదయం నుండి వేలాదిమందికి అన్న సంతర్పణ చేశారు.సామంత్రం స్వామివారి గందోత్సవం,రాత్రికి బక్తుల జాగరణ నిమిత్తం సాంస ృతిక కార్యాక్రమాలు ఏర్పాటు చేశాకు. ఈ వేడుకకు అన్ని విదాలుగా సహకరించిన గ్రామ ప్రజలకు నిరవహణ కమిటి కృతజ్ఞతలు తెలిపింది.

# చెత్త నుండి సంపద తయారీపై ప్రత్యేక శిక్షణ



**సంతనూతలపాడు, మార్చి 21, ప్రభాతవార్త**
సంతనూతలపాడులోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో శుక్రవారం నాడు చెత్త నుండి సంపద తయారీపై సంతనూతలపాడు మండల స్థాయిలో కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై ఈ సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి సంతనూతలపాడు ఎంపీడీఓ డి.సురేష్‌బాబు అధ్యక్షత వహించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలలో భాగంగా క్లాప్ మిత్రాలు ఇంటింటికి తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరణ చేసి తదుపరి ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలకు వాటిని తరలించాలని ఎంపీడీఓ సురేష్‌బాబు పేర్కొన్నారు. సెగి రిగేషన్ జరిగిన తరువాత కంపోస్టు పిట్స్‌లో వానపాముల ద్వారా కంపోస్టు తయారు చేయించి గ్రామ పంచాయతీ ఆదాయ వనరులు పెంచుకునేందుకుగాను ఈ సందర్భంగా ఎంపీడీఓ సురేష్‌బాబు వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈనెల 22న ఇదే సంతనూతలపాడు ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో చీమకుర్తి మండల సిబ్బందికి, 24న నాగులుప్పలపాడు మండలానికి, 25న మద్దిపాడు మండలానికి సంబంధించి ఆయా సిబ్బందికి ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ సురేష్ బాబు వెల్లడించారు. మండల స్థాయిలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో ఈవోఆర్డీ ఎం.రమణమ్మ, సంతనూతలపాడు మేజర్ పంచాయతీ కార్యదర్శి ఎన్.ప్రతాప్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు.

# 221 పొగాకు చెక్కులకు విక్రయాలు

**సంతనూతలపాడు, మార్చి 21, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట పరిధిలోని ఒంగోలు ఒకటో పొగాకు వేలం కంఏద్రంలో శుక్రవారం జరిగిన వేలంలో 221 పొగాకు బేళ్లకు విక్రయాలు జరిగాయి. చీమకుర్తి క్లష్టర్ పరిధిలో 285 పొగాకు చెక్కులను వేలానికి అనుమతించారు. వీటిలో 63 పొగాకు బేళ్ల వివిధ కారణాలచే తిరస్కరించబడ్డాయి.పొగాకు కిలో ఒక్కింటికి అత్యధిక ధర రూ.280లు లభించాయి. కనిష్ట ధర రూ.260 పలికింది. సరాసరి ధర రూ.273.08 పైసల లభించాయి. వేలంలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. వేలాన్ని నిర్వహణ అధికారి ఎం.రవికాంత్ పర్యవేక్షించారు.

## మక్కెనవారిపాలెంలో మైనర్ ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

**అద్దంకి రూరల్ , మార్చి 21, ప్రభాతవార్త**
సంతమాగులూరు మండలం మ్కెనవారిపాలెం గ్రామంలో మైనర్ ప్రేమ జంట ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది.మక్కెనవాపాలెం గ్రామానకి చెందిన పేరలి శంకర్ కు పల్నాడు జిల్లా యడ్లపాడు గ్రామానికి చెందిన గుంజి రవీనా కు గత ఏడాది యడ్లపాడు లో జరిగిన ఒక అమ్మవారి జాతరలో పరియవ ఏర్పడింది. ఈ పరిచయం ప్రేమగా మారి గతంలో వీరు ఇరువురు ఇంటినుండి బయటకు వెళ్ళడం ఈమేరకు యడ్లపాడు పోలీస్టేషన్లో కేసులు పంచాయితీలు జరిగాయి. ఈ నేపధ్యంలో గుంజి రవీనాకు వారి తల్లి దండ్రులు పెళ్ళి సంబందాలు చూస్తుండటంతో ఆమె ఇంటి నుండి పారిపోయి శుక్రవారం వేకువ జామున మక్కెనవారిపాలెం చేరిది. ఈ నేపద్యంలో తిరిగి యడ్లపాడులో తన తల్లి దండ్రులు కేసులు నమోదు చేస్తారని భయం చెందారో లేక ఇరువురి సామాజిక వర్గాలు వేరు కావడంతో వీరి పెళ్ళికి పెద్దలు అంగీకరించరని భావించారో మరే కారణమైనా ఉందో గాని ఇరువురు మక్కెనవారిపాలెంలో వేకువజామునే కుటుంబ సభ్యులు అందరూ నిద్రలో ఉండగానే సాయి శంకర్ ఇంటిలో పొలంలో గడ్డి చంపేందుకు ఉపయోగించే పురుగు మందును సేవించారు. ప్రస్తుతం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో శికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడుతున్నారు.

## వెలుగొండ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే కందుల ప్రత్యేక పూజలు



**కొనకనమిట్ల, మార్చి 21, ప్రభాతవార్త**
మండలంలోని వెలుగొండ శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కుందురు కాశిరెడ్డి ఆలయ కార్యనిర్వాహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డిలు తొలుత ఆలయ మర్యాదలతో పట్టు వస్త్రాలు వేసి ప్రత్యేక పూజలు చేయించారు. అర్చకులు ప్రసాదాచార్యులు మంత్రోచ్ఛరణలతో గోత్ర నామాలతో పూజలు చేశారు. వీరితో పాటు కందుల రోహిత్‌రెడ్డి, నాయకులు భాషాపతి నాయుడు, తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా ప్రారంభమైన ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఎడ్లు బలప్రదర్శన పోటీలు

- ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల



**కొనకనమిట్ల, మార్చి 21, ప్రభాతవార్త**
మండలంలోని గార్లదిన్నె పంచాయతీ వెలుగొండ క్షేత్రంలో శ్రీ వెంకటేశ్వరస్వామి తిరునాళ్ల సందర్భంగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల స్థాయి ఎడ్ల బండ లాగుపోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభ మయ్యాయి. ఈ పోటీలను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. ఎడ్ల జతను చెర్నకోలా పట్టి అదిలించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలు జాతి ఎడ్ల ను కాపాడుకోవాలని, ఎన్నో వ్యయప్రయాసాలకు వోర్చి ఎడ్లను పోషిస్తున్నా యజమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఏటా మేకల వారిపల్లె రెడ్ల సంఘ ఆధ్వర్యంలో ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు కందుల రోహిత్‌రెడ్డి, ఎంపీపీ మూరబోయిన బాబురావు, మండల టీడీపీ మాజీ కన్వీనర్ తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కుందురు కాశిరెడ్డి, నాయకులు భాషాపతి నాయుడు, వక్కలగడ్డ మల్లికార్జున, కాసుచారిటబుల్ ట్రస్టు చైర్మన్ కాసు వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కాకర్ల శ్రీను, ఉడుముల చిన్నపరెడ్డి, భీమాంజనేయరెడ్డి, టీఎన్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, మేకలవారిపల్లె రెడ్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

# జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వరుణ్ కుమార్



**సీఎస్‌పురం, మార్చి 21, ప్రభాతవార్త**
మండలంలోని ఒబ్బిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన డీజీపేట ఎంపీటీసీ మితికెల ప్రభావతి గురవయ్యల కుమారుడు మితికెల వరుణ్ కుమార్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఉద్యోగరీత్యా చెన్నైలో ఉంటున్న వరుణ్ కుమార్ చెన్నై ఐటీ వింగ్‌లో వైసీపీ తరుపున చురుకైన పాత్ర పోషిస్తున్నారు. డీజీ పేటకు చెందిన మితికేల శ్రీనివాసులతో కలిసి చెన్నై నుంచి అమరావతికి వెళ్లి అక్కడ తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. తన అభిమాన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డిని కలవడం తమకు చాలా ఆనందాన్ని కలిగించిందని అన్నారు.

# కేజీబీవీలో చేరేందుకు దరఖాస్తులు చేసుకోవాలి



**సీఎస్‌పురం, మార్చి 21, ప్రభాతవార్త**
కేజీబీవీలో చేరేందుకు విద్యార్థినులు దరఖాస్తులు చేసుకోవాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ షేక్ రేష్మ ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీ లో ప్రవేశం కోసం ఈనెల 22నుండి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు చెప్పారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6,11 తరగతుల్లో ప్రవేశాల కోసం 7,8,9,10,12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ దరఖాస్తులు ఈ నెల 22 నుండి ఏప్రిల్ 11 వరకు అందుబాటులో ఉంటాయన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుంది. సంబంధిత పాఠశాల నోటీఫికేషన్ బోర్డులో నేరుగా చూడవచ్చని తెలిపారు.

# సేంద్రియ సాగు పద్ధతులపై అవగాహన



**మార్టూరు, మార్చి 21, ప్రభాతవార్త**
మార్టూరు మండలంలోని శ్రీ సాయి బాలాజీ కళ్యాణ మండపం లో జిల్లా స్థాయి అవగాహన సదస్సు ఉద్యానశాఖ బాపట్ల జిల్లా వారి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. రక్షిత సాగులో నర్సరీ నిర్వహణ, అధిక విలువగల కూరగాయాలు, పూల పెంపకం, సేంద్రియ సాగులో మిరప పంట, కూరగాయాలు సాగుపై జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డాక్టర్ ఎం.రవీంద్రబాబు, సీనియర్ సైంటిస్టు, హార్టికల్చర్, ఉద్యాన పరిశోధన స్థానం, దర్శి వారు షెడ్‌నెట్‌లలో నర్సరీ నిర్వహన, అధిక విలువ గల కూరగాయాలు, పూల పెంపకం గురించి రైతులకు వివరించారు. మిరప శాస్త్రవేత్త, ఉద్యాన పరిశోధనా స్థానం, లాం, గుంటూరు నుంచి డాక్టర్ ఏ.రజని మిరపలో పురుగులు, తెగుళ్లపై తెలిపారు. జిల్లా ఉద్యాన అధికారి పి.జనమ్మ మాట్లాడుతూ నర్సరీ యాక్ట్ 2010, నర్సరీల రిజిస్ట్రేషన్‌ల గురించి వివరించారు. బాపట్ల ఏపీఎంఐపీ పీడీ బీవీ రమణ డ్రిప్, స్ప్రింక్లర్లు వాటి సబ్సిడీ వివరాల గురించి వివరించారు. గాంఢీవ రైతు ఉత్పత్తిదారుల సంస్థ చైర్మన్ పి.శరత్‌బాబు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల వలన ఉపయోగాల గురించి వివరించారు. డిజిటల్ గ్రీన్ సంస్థ నుంచి వచ్చిన ఎం.విజయరేఖరెడ్డి రైతులకు ఫార్మర్ చాట్ అనే యాప్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మార్టూరు ఉద్యాన అధికారి బి.హనుమంత్‌నాయక్, అద్దంకి ఉద్యాన అధికారి దీప్తి, చీరాల ఉద్యాన అధికారి అలేఖ్య, పర్చూరు ఉద్యాన అధికారి రవి ప్రకాష్‌బాబు, కొల్లూరు ఉద్యాన అధికారి కళ్యాణ్ చక్రవర్తి, మార్టూరు ఏపీ అగ్రికల్చర్ కేవీ శ్రీనివాసరావు, మార్టూరు వ్యవసాయాధికారి అంజిరెడ్డి, సంతమాగులూరు వ్యవసాయాధికారి లావణ్య, బల్లికురవ వ్యవసాయాధికారి కుమారి, జిల్లాలోని షెడ్ నెట్ రైతులు, ఉద్యాన ,వ్యవసాయ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## నష్టపోయిన మొక్కజొన్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

- రైతు సంఘం ప్రతినిధి రఘురామ్



**త్రిపురాంతకం, మార్చి 21, ప్రభాతవార్త**
మండలంలో కంకణాలపల్లి, ఒడ్డుపాలెం రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంట నష్టానికి విత్తనాలు కంపెనీవారు రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని జిల్లా రైతు సంఘం ప్రతినిధి రఘురామ్ డిమాండ్ చేశారు. మొక్కజొన్న విత్తనాలను దళారీల ద్వారా గ్రామాల్లో రైతులకు ఉచితంగా ఇవ్వడంతోపాటు అవసరమైన పురుగుమందులు కొంతమేరా నగదు ఇచ్చి మొక్కజొన్న సాగును చేసేందుకు రైతులను ప్రోత్సహించి విత్తనాల కంపెనీవారు నష్టపోయిన రైతులకు తగువిధమైన న్యాయం చేయక పోవడం వలన విత్తనాల కంపెనీ దళారులు లాభపడ్డారని రైతు పూర్తిగా నష్టపోయారని రఘురాం వార్త విలేకరితో మాట్లాడారు. రైతులకు విత్తనాలు సరఫరా చేసేటప్పుడు దిగుబడి తగ్గితే ఎకరాకు రూ.50వేలు ఇస్తామని దిగుబడి సక్రమంగా వస్తే క్వింటాకు రూ.26వేలు ఇస్తామని చెప్పి, తీరా నష్టం వాటిల్లినప్పుడు నష్టపోయిన రైతులకు తామేం చేయలేమని దళారులు చేతులెత్తేయడం న్యాయసమ్మతం కాదని రఘురాం విమర్శించారు. నష్టపోయిన రైతుకు న్యాయం చేకూర్చాల్సిన విత్తనాల కంపెనీ నుండి ప్రభుత్వం నష్టపరిహారం ఇప్పించాలని, అలా కాకుండా ఏమీ తెలియనట్లు మౌనం వహిస్తే నష్టపోయిన రైతన్నకు నష్టపరిహారం ఎవరు ఇవ్వాలని రఘురాం ప్రశ్నించారు. దళారీ వ్యవస్థను అడ్డుపెట్టుకుని విత్తనాల కంపెనీ గ్రామాల్లో మొక్కజొన్న విత్తనాలు ఇచ్చి చేతులు దులుపుకోవడం ఎంతవరకు సముచితమని రఘురాం అన్నారు. కంపెనీ వారు నామమాత్రంగా విత్తనాలు, పురుగుమందులు, పోషక విలువలు కలిగిన ఎరువులు ఇచ్చి లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి కేవలం ఈ పంటపైనే ఆధారపడిన రైతులకు న్యాయం చేయకపోతే రైతులకు ప్రభుత్వం చొరవ తీసుకొని నష్టపోయిన రైతుకు వెంటనే జరిగిన నష్టాన్నివిత్తనాల కంపెనీ ద్వారా ప్రభుత్వం ఇప్పించాలని రఘురాం డిమాండ్ చేశారు. రఘురాంతోపాటు మరి కొంతమంది రైతులకు కూడా నష్టపోయిన విషయాన్ని తెలుపుతూ ఆవేదన వ్యక్తం చేశారు.

## నష్టంపై మొక్కజొన్న రైతులతో విచారణ చేపట్టిన ఏఓ నీరజ



**త్రిపురాంతకం, మార్చి 21, ప్రభాతవార్త**
మండలంలోని కంకణాలపల్లి మొక్కజొన్న సాగు చేసి నష్టపోయిన రైతుల నుండి విత్తనాలు సరఫరా చేసిన కంపెనీ ప్రతినిధులవిధి విధానాలను, వివరాలను మండల వ్యవసాయశాఖ అధికారిణి కె.నీరజ కంకణాల పల్లి గ్రామంలో శుక్రవారం రైతులతో సమావేశ మయ్యారు. మొక్కజొన్న సాగు చేసిన రైతులు స్వంత భూములు లేక కౌలు భూములు అనే విషయాన్ని కూడా ఏవో నీరజ వివరాలు సేకరించారు. ఎందుకు కమర్షియల్ మొక్కజొన్న విత్తనాలు, సీడ్ విత్తనాల కంపెనీ నుండి విత్తనాలు తీసుకున్నారు? కంపెనీ వారు ఎలాంటి షరతులతో విత్తనాలు ఇచ్చారు, నష్టపోయిన రైతాంగానికి ఏవిధంగా నష్టం చెల్లిస్తారు అనే విషయాలను అటు రైతులతో, ఇటు కంపెనీ ఏజెంట్లతో మాట్లాడి వివరాలు సేకరించారు. విత్తనాల కంపెనీ ఏజెంట్ మాట్లాడుతూ కంపెనీ వారితో మాట్లాడి నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పిస్తామని ఏవో నీరజ సమక్షంలో వెంకటరావు అనే ఏజెంట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయకుడుపవన్, స్థానిక రైతులు, పాల్గొన్నారు.

# ఘనంగా ఇఫ్తార్ విందు

- భారీగా పాల్గొన్న ముస్లీం సోదరులు



**యర్రగొండపాలెంరూరల్, మార్చి 21, ప్రభాతవార్త**
యర్రగొండపాలెం పట్టణంలోని మాచర్ల రోడ్ ముస్లీంల షాదీఖానా వద్ద ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ముస్లీం సోదరులకు శుక్రవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పట్టణంలోని అన్ని మసీదులకు చెందిన ఇమామ్‌లు, ముస్లీం పెద్దలు భారీగా పాల్గొన్నారు. ఉపవాసదీక్ష చేపట్టిన ముస్లీంలకు ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఫలహారాలు తినిపించి వారితో కలిసి సామూహిక నమాజును చదివారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లీం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని అన్నారు. ఇఫ్తార్ విందులో ఉపవాస దీక్షపరులతో పాల్గొనడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు. ముస్లీం ప్రజల ఆశీర్వాదాలు తనపై ఎల్లప్పుడు చూపాలని ఆయన కోరారు. అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని మనుషులంతా సోదరభావంతో మెలగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లీం మత పెద్దలు మౌలానా హిదయతుల్లా, మౌలానా మహమ్మద్ హుస్సేన్, మౌలానా జుబేర్‌లతోపాటు వైసిపి సీనియర్ నాయకులు ఒంగోలు మూర్తి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఏకుల ముసాలారెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, వైస్ ఎంపిపి మందుల ఆదిశేషు, జిల్లా కోఆప్షన్ సభ్యులు సాబిర్ బాష, ముస్లీం నాయకులు సయ్యద్ జబీల్, షేక్ వలి తదితరులు పాల్గొన్నారు.

## 2025-26 బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన కౌన్సిల్ సభ్యులు



**గిద్దలూరు, మార్చి 21, ప్రభాతవార్త**
గిద్దలూరు నగర పంచాయితీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రత్యేక సమావేశం నందు 2025-26సంవత్సరమునకు సంబంధించి బడ్జెట్‌ను నగర పంచాయితీ చైర్మన్, కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. గత సంవత్సరం బడ్జెట్ ప్రారంభ నిల్వరూ.14,70,40వేలు కాగా2025-26 సంవత్సరపు అంచనా ఆదాయం రూ.27,91,32 వేలు కాగా ఖర్చులు రూ.21,32,19వేలుగా నిర్ధారించి అందులో నుండి మిగులు ముగింపు నిల్వ రూ. 21,29,46 వేలుగా నిర్ధారిస్తూ నగర పంచాయితీ ఛైర్‌పర్సన్ కౌన్సిల్ సభ్యుల ఆమోదంతో ఏకగ్రీవంగా ఆమోదించి ఉన్నారు.

# దొనకొండ - ఒంగోలు ఆరు బస్సు సర్వీసులు

**దొనకొండ,మార్చి 21,ప్రభాతవార్త**
దొనకొండ నుండి దర్శి గంగవరం ,చీమకుర్తి మీదుగా ఒంగోలు వెళ్ళు 6 సర్వీసు బస్సులను ఆర్టీసీ ఉన్నతాధికారులు ఏర్పాటు చేసినట్లు పొదిలి డిపో మేనేజర్ వి.శంకరరావు తెలిపారు. దొనకొండ నుండి ఒంగోలుకు ఉదయం 5.30 ఉదయం 7.45 ,ఉదయం 9.30 ఉదయం 10.15 ,మధ్యాహ్నం 1.45 ,మధ్యాహ్నం 3.45 నిమిషాలకు బయలుదేరుతాయి. ఒంగోలు నుండి అదే మార్గంలో దొనకొండకు ఉదయం 9.30 ,మధ్యాహ్నం 1.00,మధ్యాహ్నం 1.45 ,మధ్యాహ్నం 3.45,సాయంత్రం 5.45,నైట్ హాల్ట్ బస్సు సాయంత్రం 6.45 నిమిషాలకు బయలుదేరుతాయి. గతంలో రద్దయిన పొదిలి-యర్రగొండపాలెం బస్సు పున: ప్రారంభించబడింది. పొదిలిలో ఉదయం 5.45 బయల్దేరి దొనకొండకు 6.40కి వచ్చి యర్రగొండపాలెం 8.45కు చేరుతుంది. యర్రగొండపాలెంలో ఉదయం 9.00 బయల్దేరి దొనకొండకు 10.45కు వచ్చి 12 గంటలకు పొదిలి చేరుతుంది. పొదిలిలో మధ్యాహ్నం 12.30కు బయల్దేరి దొనకొండకు 1.15కు వచ్చి మధ్యాహ్నం 3.30కు యర్రగొండపాలెం చేరుతుంది. 3.45కు బయల్దేరి సాయంత్రం 5.30కు దొనకొండ చేరుకుని 6.45కు పొదిలి చేరుతుంది. ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితమని ,ఈ సర్వీసులను మండల ప్రజలు సద్వినియోగం చేసుకుంటే రానున్న రోజుల్లో మరిన్ని సర్వీసులను నడుపుతామని సమస్యలకు 7382825700,9959225700 నంబర్లలో సంప్రదించాలని పొదిలి డీఎం తెలిపారు.

# ఉరివేసుకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



సింగరాయకొండ, మార్చి 21,(ప్రభాతవార్త
అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని ఓ వ్యక్తి కరెంటు స్తంభానికి ఉరివేసుకొని మృతి చెందిన సంఘటన శుక్రవారం ఉదయం కలికివాయి గ్రామానికి వేళ్ళు పాత రహదారిలో చోటు చేసుకుంది.పోలీసుల తెలిపిన వివరాలు మేరకు మూలగుంటపాడు గ్రామ పరిధి లోని, కలికివాయ గ్రామమునకు వెళ్ళు పాత రోడ్ దగ్గర పాల ఫ్యాక్టరీ వెనుక వైపున గుర్తు తెలియని ఒక మగ వ్యక్తి పేరు వివరములు తెలియని సుమారు 35 నుండి 45 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి, ఇనుప కరెంట్ స్తంభంకు మధ్యలో ఒక ప్లాస్టిక్ తాడుతో ఉరి వేసుకొని వేలాడుతూ మృతి చెంది ఉన్నాడు. ఈ సమాచారం తెలుసుకున్న ఎస్సై బి.మహేంద్ర తన సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతుదేహం వద్ద వివరాలు సేకరించారు. మృతుని ఒంటి పైన నిండు చేతుల లైట్ బ్లూ చొక్కా దాని పైన తెలుపు చెక్స్ డిజైన్, బ్లూ ప్యాంట్, కంపెనీ లేబిల్‌తో ఫుల్ డ్రాయర్ దుస్తులు దరించి ఉన్నాడని తెలిపారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.ఈ మృతదేహన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.మృతుని గురించి ఏటువంటి సమాచారం లభించలేదని,ఎవరికైనా చనిపోయిన వ్యక్తి గురించి వివరములు తెలిసిన యడల సీఐ, 9121102135,ఎస్.ఐ9121102136.తెలియపరచాలని తెలియజేసారు.

## రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన మాజీ సర్పంచ్



దొనకొండ,మార్చి 21,(ప్రభాతవార్త
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి మర్యాదపూర్వకంగా కలవడం జరిగినది ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కొచ్చర్లకోట మాజీ సర్పంచ్ చీరాల యోహాను తెలుగుదేశం పార్టీ నాయకులు కొచ్చర్లకోట హాయ్ కాట్ ప్రెసిడెంట్ వినకొండ మార్క్ కలవడం జరిగినది

## కెజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం : ఎస్ఓ మాలకొండమ్మ




రాచర్ల, మార్చి 21 ప్రభాతవార్త
2024-26విద్యా సంవత్సరానికి సంబంధించి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పాఠశాల ప్రత్యేకాధికారిని డి.మాలకొండమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి మరియు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరగోరే విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 22వ తేదీ నుండి వచ్చే ఏప్రిల్ 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె అన్నారు. అదేవిధంగా 7,8,9,10, 12వ తరగతుల్లో మిగిలిపోయిన సీట్లకు కూడా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. తల్లి తండ్రి లేని బాలికలు, తల్లి లేదా తండ్రి లేని బాలికలు, దివ్యాంగులు, ఎస్సీ,ఎస్టీ,బిసి,మైనారిటీ, ఈబిసి వర్గాలకు చెందిన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు. కెజీబీవీ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, రుచికరమైన ఆహారం, ఆహ్లాదకరమైన వాతావరణం, మేలైన వసతులు కల్పించడం జరుగుతుందని, పేద బాలికల భవిష్యత్తు ఆర్థిక అభివృద్ధి,సంక్షేమం కొరకు ప్రభుత్వం ప్రత్యేక వసతులు కెజీబీవీ పాఠశాలలు నిర్వహిస్తోందని ఆమె తెలిపారు.కాబట్టి పాఠశాలలో చేరగోరే బాలికలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమెతెలిపారు.పూర్తి వివరాలకు 8340864778సెల్ నంబరును సంప్రదించాలని ఆమె కోరారు.

# పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్

రాచర్ల, మార్చి 21, ప్రభాతవార్త
పదవ తరగతి పరీక్ష కేంద్రాలను జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి వి గిరిధర్ శర్మ శుక్రవారం తనిఖీ చేశారు. మండల కేంద్రమైన రాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాచర్ల ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్) పరీక్ష కేంద్రాలను సందర్శించి విద్యార్థులను తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరుతెన్నులను పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని, నిర్వహణ తీరు కూడా సంతృప్తికరంగా ఉందని తెలిపారు. పరీక్షలు రాసే విద్యార్థులకు కూడా చక్కటి మౌలిక వసతులు కల్పించారని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన పరీక్షలు ప్రశాంతంగా, పకడ్బంధీగా, సంతృప్తికరంగా జరిగేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

# ఆశా వర్కర్ల డిమాండ్లపై వైద్యాధికారికి వినతి



హనుమంతునిపాడు ,మార్చి 21, ప్రభాతవార్త
ఆశావర్కర్ల సమస్యలపై ప్రభుత్వం చొరువ చూపి పరిష్కరించాలని యు.లక్ష్మీదేవి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. హనుమంతునిపాడు ప్రభుత్వ వైద్యశాల నందు విధి నిర్వహణలో ఉన్నటువంటి డాక్టర్‌కి తమ కోరికల పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు గత ఏడు సంవత్సరాల కాలంలో కేవలం 1000 రూపాయలుమాత్రమే వేతనాలుపెంచారని అనేక ఉద్యమాలు పోరాటాలు చేస్తున్నప్పటికి ప్రభుత్వం ఆశా సమస్యలపై స్పందించడం లేదన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఆశా వర్కర్లను రెగ్యులర్‌గా కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా నియమించాలని దేశ వ్యాప్తంగా ఒకే రకమైనటువంటి పని పరిస్థితులు ఉండాలని చట్టబద్ధమైనటువంటి సౌకర్యాలు కల్పించాలని పెన్షన్ సౌకర్యం కల్పించాలని,ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎలిజిబెత్ రాణి,రోతమ్మ, రోజని, లోయసమ్మ పాల్గొన్నారు.

## కాపులకు స్వయం ఉపాధి పథకం లబ్ధిదారులకు వయోపరిమితి పెంచాలి

### - నియోజకవర్గ జేఏసీ నాయకుడు తాటి యల్లమంద



పొన్నలూరు, మార్చి21, ప్రభాతవార్త
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వయం ఉపాధి పథకం లబ్ధిదారులకు అన్ని కులాల వారికి 21నుంచి60 సంవత్సరాలు వరకుదరఖాస్తు చేసుకోవచ్చని తెలిపిందన్నారు. అయితే తెలగ, బలిజ, కాపు, ఒంటరి కులస్తులకు 21 నుంచి 50 సంవత్సరాల వరకు మాత్రమే పరిమితి చేయటం ఎంత వరకు సబబు అని ఇతర కులాల వారికి ఇచ్చినట్లే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వయోపరిమితి 21 నుంచి 60 సంవత్సరాలు వరకు పెంచవలెనని నియోజకవర్గ జేఏసీ నాయకుడు తాటి యల్లమంద ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



పొన్నలూరు, మార్చి 21, ప్రభాతవార్త
మండలంలోని పెద్ద వెంకన్నపాలెం గ్రామానికి చెందిన తుమాటి శ్రీలతకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ చేశారు. శ్రీలత హైదరాబాద్‌లో ఒక ప్రైవేటు హాస్పిటల్‌లో డెలివరి నిమిత్తం అయిన ఖర్చులు ఒక లక్ష 30 వేలు రూపాయలు దానికి సంబంధించి రిలీఫ్ ఫండ్ కు అప్లై చేయగా శుక్రవారం నాయుడుపాలెంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి నివాసం వద్ద 64వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్‌ను శ్రీలత మామ కు అందజేశారు. శ్రీలత మామ మాట్లాడుతూ మా ఇబ్బందులు తెలిసి మాకు సీఎంరిలీఫ్ ఫండ్ వచ్చినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి,మంత్రి బాలవీరాంజనేయస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఏబీఏపీ మార్టూరు అధ్యక్షునిగా నల్లపనేని



మార్టూరు, మార్చి 21, ప్రభాతవార్త
అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ మార్టూరు శాఖ అధ్యక్షునిగా రాజుపాలెం గ్రామానికి చెందిన నల్లపనేని వెంకటరామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ మార్టూరు కార్యవర్గ సమావేశం స్థానిక ఘటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పాత కమిటీ కాలం పూర్తి కావడంతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షునిగా రాజుపాలెం గ్రామానికి చెందిన నల్లపనేని వెంకటరామారావు, ఉపాధ్యక్షులుగా సీనియర్ గురుస్వామి ఆత్మకూరి రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా తిరుమలశెట్టి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా ఉయ్యాల సాంబశివరావు, ట్రెజరర్‌గా చిలుకూరు గోపి, మరో 19 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా జిల్లా కమిటీ చెందిన ఎం.అంకయ్య, తగెడ్ల శ్రీకాంత్, సత్తిబాబులు వ్యవహరించారు. మార్టూరు కమిటీ గతంలో కొన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించిందని నూతన కమిటీ సేవా కార్యక్రమాలను విస్తృతం చేసి మంచి పేరు తీసుకురావాలని ఏబీఏపీ రాష్ట్ర అధ్యక్షులు శంకరాచారి సూచించారు. ఈ కార్యక్రమంలో మార్టూరు, బల్లికురవ, యద్దనపూడి మండలాలకు చెందిన అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

# నూతన మసీదును సందర్శించిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



యర్రగొండపాలెం రూరల్, మార్చి 21, ప్రభాతవార్త
యర్రగొండపాలెం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో దాతల సహాయంతో నూతనంగా నిర్మించిన మసీదును శుక్రవారం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ సందర్శించారు. మసీదు నిర్మాణానికి దాతలు ముందుకు రావడంతో అప్పగి కాంగ్రెస్ ప్రభుత్వంలో దివంగత నేత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏర్పడిన ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న ముస్లీం కుటుంబాలు మసీదు లేకపోవడంతో పలు ఇబ్బందులకు గురవుతున్నారు. దాంతో కాలనీలోని ముస్లీంలు నమాజు ఆచరించేందుకు 2కిలోమీటర్ల మేరా వెల్లవలసి వస్తుండడంతో కాలనీలోనే నూతన మసీదును నిర్మించడం జరిగింది. మసీదు పెద్దల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ శుక్రవారం మసీద్‌ను సందర్శించి ముస్లీంలతో కలిసి ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అల్లాహ్ దయతో దేవునిపట్ల ప్రతిఒక్కరు భక్తిభావంతో మీ దగ్గరలోని మసీదుల్లో ప్రతిరోజు నమాజ్ ఆచరించాలని సూచించారు. కాలనీలో ప్రతిఒక్కరు ఐక్యతతో ఉండి కాలనీ అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఏకుల ముసాలరెడ్డి, జడ్‌పిటిసి విజయభాస్కర్, పార్టీ నాయకులు కొప్పర్తి ఓబుల్ రెడ్డి, ముస్లీం నాయకులు సయ్యద్ జబిల్, షేక్ వలి, తదితరులు పాల్గొన్నారు.

## తలనీలాల ప్రోగుకు నేడు రంగస్వామి క్షేత్రంలో వేలంపాట

### - ఆలయ కార్యనిర్వహణ అధికారి నాగయ్య



రాచర్ల, మార్చి 21 ,ప్రభాతవార్త
మండలంలోని జేపిచెరువు అడవుల్లో వెలసియున్న శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయంలో ఒక సంవత్సరం పాటు అనగా ఈనెల 30నుండి వచ్చే ఏడాది ఉగాది ముందురోజు వరకు తలనీలాలు ప్రోగు చేసుకునేందుకు ఈ-ప్రొక్యూర్మెంట్ షీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలంపాట నిర్వహించడం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎం నాగయ్య శుక్రవారం తెలిపారు. ఈ వేలంపాటలో పాల్గొనదలచిన వారు రూ.5లక్షలు ధరావత్ చెల్లించి పాటలో పాల్గొనాలని, పాల్గొనే వారికి ఆలయంతో ఎలాంటి లావాదేవీలు, బకాయిలు ఉండకూడదని అన్నారు. షీల్డ్ టెండర్ ఫామ్స్ 17-03-2025 నుండి 22-03-2025ఉదయం 10గంటల వరకు స్వీకరించి అదే రోజు ఉదయం 11గంటలకు షీల్డ్ టెండర్లు తెరవబడతాయని అన్నారు. పాటలో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకోవాలనుకునే పాటదారులు దేవస్థానం పనిచేయు వేళల్లో రూ.500లు చెల్లించి షీల్డ్ టెండర్ ఫామ్ పొందాలని ఆయన తెలిపారు. మరింత సమాచారం కావాలంటే దేవస్థానం కార్యాలయంలో లేదా కార్యనిర్వహణాధికారి సెల్ నంబర్ 9603322656ను సంప్రదించాలని ఆయన కోరారు.నేడు అనగా శనివారం 22-03-2025 ఉదయం 10 గంటలకు రంగస్వామి దేవస్థానంలో వేలంపాటలు జరుగుతాయని ఆయన తెలిపారు.

# చెత్త సంపద కేంద్రాలను అభివృద్ధి చేయండి



వెలిగండ్ల, మార్చి 21, ప్రభాతవార్త
చెత్త సంపద కేంద్రాలను అభివృద్ధి చేసుకోవాలని ఈవోపీఆర్డీ ఒంగోలు అన్నమ్మ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని నాగిరెడ్డిపల్లి చెత్త సంపద కేంద్రాన్ని ఆమె పంచాయతీ కార్యదర్శి గిరిధర్‌తో కలిసి పరిశీలించారు. ఈవోపీఆర్డీ మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాల ద్వారా వచ్చేఆదాయాన్ని గ్రామాల అభివృద్ధికి వినియోగించాలన్నారు. వర్మీ కంపోస్టు తయారీ అన్ని కేంద్రాల్లో ప్రారంభించాలన్నారు. పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్మికుల ద్వారా తడి చెత్త, పొడి చెత్త వేరు వేసి మూడు రకాల బుట్టలను అందజేసే విధానిన్న గ్రామంలో ఉన్న నిర్వాసితులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా తడి చెత్త, పొడి చెత్త వేరుచేసే పక్రియ గురించి ఇంటి యజమానులను ఆరా తీశారు. గ్రామంలో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను ప్రతి శుక్రవారం క్లీన్ చేసే విధానాన్ని పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గిరిధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# 22 నుండి ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరణ

బల్లికురవ, మార్చి 21, ప్రభాతవార్త
ఈనెల 22వ తేదీ నుండి ఏప్రిల్ 11వ తేదీ వరకు స్థానిక కస్తూరిబా గురుకుల విద్యాలయంలో ఆరో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ప్రత్యేక అధికారి సరళ తెలియజేశారు. వీటితో పాటు 9,10,12వ తరగతికి మిగిలి ఉన్న సీట్లకు కూడా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, బలహీన వర్గాల వారికి ప్రాధాన్యత క్రమంలో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాల కోసం 9110369460, 8639734009 నెంబర్లను సంప్రదించాలన్నారు.

# నేడు గొట్టిపాటి వర్ధంతి వేడుకలు

### - నియోజకవర్గ వ్యాప్తంగా కార్యక్రమాలు



బల్లికురవ, మార్చి 21, ప్రభాతవార్త
మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు 28వ వర్ధంతి వేడుకలను శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో ఘనంగా నిర్వహించేందుకు గొట్టిపాటి అభిమానులు, కూటమి కార్యకర్తలు, టీడీపీ నేతలు సన్నద్ధమవుతున్నారు. ఎల్ఎంబీ బ్యాంకు చైర్మన్‌గా, పంచాయతీ సమితి అధ్యక్షుడిగా, మార్టూరు ఎమ్మెల్యేగా, జడ్పీ చైర్మన్‌గా, ఉమ్మడి రాష్ట్రానికి పేరు తెచ్చిన పౌర సరఫరాల శాఖ మంత్రిగా గొట్టిపాటి ప్రజలకు ఎన్నో విధాలుగా సేవలందించారు. నేడు ఆయన రాజకీయ వారసుడిగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తన పెదనాన్న బాటలో పయనిస్తూ రాష్ట్ర ప్రజల మన్ననలు అందుకుంటున్నాడు. ముందుగా గొట్టిపాటి రవికుమార్, యద్దనపూడిలోని ఆయన సమాధి వద్ద ఘనంగా నివాళులర్పించి, గ్రామంలోని ఆయన కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. మండల కేంద్రమైన బల్లికురవలో గొట్టిపాటి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు క్లస్టర్ ఇన్‌ఛార్జ్ మల్లినీడి గోవిందరావు, తెలుగు యువత అధ్యక్షుడు హనుమంతరావు తెలియజేశారు. ఈసందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులంతా యద్దనపూడి తరలివెళ్ళనున్నారు.

# మామిడి తోటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

### - ఉద్యానశాఖాధికారిణి అంజలిబాయి



హనుమంతునిపాడు ,మార్చి 21, ప్రభాతవార్త
హనుమంతునిపాడు మండలం నందనవనం గ్రామంలోని మామిడి తోటలను శుక్రవారం ఉద్యాన శాఖాధికారి ఎం.అంజలి బాయి పరిశీలించి అధిక ఉష్ణోగ్రత నుండి మామిడి తోటలను ఎలా రక్షించుకోవాలో రైతులకు సూచనలు ఇచ్చారు. అధిక ఉష్ణోగ్రత నుండి మామిడిని రక్షించడానికి తక్కువ వ్యవధిలో ఎక్కువ సార్లు నీటిని పారించాలి, చెట్లు పాదుల్లో ఎండు గడ్డి లేదా వారి పట్టు వేయడం వలన మల్చింగ్‌గా పని చేసి ఉష్ణోగ్రత అదుపులో ఉంచడమే కాకుండా నీటివృధా తగ్గిస్తుంది. కాయలు 100 గ్రాములు సైజు ఉన్నప్పుడు పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు చొప్పున లీటరు నీటికి కలిపి ద్రావణాన్ని పిచికారి చేసినట్లయితే కాయలు మంచి సైజు, రంగు రావడానికి దోహదపడుతుందన్నారు. నీటి వసతి లేని తోటలలో మొక్కలను ఎండ, వేడి నుండి రక్షించడానికి 2 శాతం యూరియా ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలన్నారు. వాతావరణం పొడిగా ఉండి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో మామిడిలో చీడపీడలు ఎక్కువగా ఆశించి నష్టపరుస్తాయన్నారు. ప్రధానంగా నల్ల తామర పురుగులు(త్రిప్స్) తల్లి, పిల్ల పురుగులు గుంపులుగా చేరి, పూలు, పూతకాడలు, లేత పిందెలు నుండి రసాన్ని పీలుస్తాయి. పూత మాడుతుంది. పిందెలు ఏర్పడవు. ఈ పురుగులు ఆశించిన మామిడి తోటల్లో పూత పూర్తిగా రాలిపోయి రైతులు ఆర్థికంగా నష్టపోతారు. పూత పిందె సమయంలో ఈ పురుగుల ఉదృతి అధికంగా ఉంటుంది. నష్ట నివారణకు మొదటి పిచికారిలో ఎక్స్‌పోనస్ 34 మి.లీ మందు, 140 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి, పురుగు ఉదృతి కొనసాగితే 15-20 రోజుల తర్వాత ట్రేసర్ 0.4 మి.లీ మందు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసిన సమర్ధవంతంగా నివారించవచ్చును, జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా బవేరియా, బాసియానా, లోకల్ స్ట్రెయిన్ ను 5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసినతో భవిష్యత్తులో తామర పురుగులను సమర్ధవంతంగా నివారించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఏ.కాశయ్య, రైతులు పాల్గొన్నారు.

# ఈ రహదారులపై ప్రయాణం ప్రాణసంకటం







బల్లికురవ, మార్చి 21, ప్రభాతవార్త
నూతనంగా జాతీయ రహదారులు నిర్మాణ పనులు జరుపుకుంటున్న ప్రాంతాలలో సంబంధిత రహదారులపై మిగిలిన వాహనదారులు ప్రయాణించాలంటే ప్రాణ సంకటమే. బాపట్ల జిల్లా పరిధిలో ఒడరేవు - చీరాల, గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ రహదారుల నిర్మాణం కోసం మట్టిని తరలించేందుకు భారీగా టిప్పర్లను వాడుతున్నారు. ఈ క్రమంలో మట్టి రవాణా చేసే టిప్పర్లు మితి మీరిన వేగంతో ప్రయాణిస్తూ ద్విచక్ర వాహనదారులను, పాఠశాల విద్యార్థుల బస్సులను, ఆటోలను హడలు పుట్టిస్తున్నాయి. అంత వేగంతో వెళ్తుంటారు మరి వీరు. వీరి నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు నిదర్శనంగా పలనాడు జిల్లా అన్నం పట్ల వారిపాలెం వద్ద ముగ్గురిని బలి తీసుకోవడం, బాపట్ల జిల్లా పర్చూరు ప్రాంతంలో మరొకరిని బలి తీసుకోవడం లాంటి సంఘటనలను పేర్కొనవచ్చు. ధర్మవరం నుండి అద్దంకి వరకు ప్రారంభమయ్యే గ్రీన్ ఫీల్డ్ హైవే ఎక్స్‌ప్రెస్ మట్టి తరలింపు వాహనాలు వాయువేగంతో దూసుకెళ్తుంటాయి. ఫలితంగా ఇటీవల అద్దంకి పట్టణంలోని పాత పెట్రోల్ బంకు సమీపంలో మట్టి టిప్పర్లే ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఇవి చాలవన్నట్లుగా మధ్యలో భారీ గ్రానైట్ వాహనాలు వస్తుంటాయి. అప్పుడు చూడాలి వాహనదారుల ఇక్కట్లు. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు ప్రజలు మూల్యం చెల్లించుకోకముందే సంబంధిత అధికారులు డ్రైవర్లకు వేగ నియంత్రణ పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే అన్నంబొట్లవారిపాలెం లాంటి సంఘటనలు ఈ రహదారి ప్రాంతంలో నూ ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. అధికారులు లారీ టిప్పర్ల విషయం ఆదమరచకుండా ఆలోచించండి. అమాయకులు బలికాకుండా కాపాడండి.

# సంతమాగులూరులో ప్రజావేదిక

### - ప్రజల నుంచి వినతులు స్వీకరించిన మంత్రి గొట్టిపాటి





సంతమాగులూరు, మార్చి 21, ప్రభాతవార్త
బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలంలోని రెవెన్యూ కార్యాలయం ఆవరణంలో శుక్రవారం ప్రజావేదిక నిర్వహించారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి వినతులను మంత్రి నేరుగా స్వీకరించారు.వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.మండలంలోని 80 మందికి రూ.39 లక్షల సీఎంఆర్‌ఎఫ్, రూ.9లక్షల ఎల్ఓసీ చెక్కులను పంపిణీ చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 439మందికి సీఎంఆర్‌ఎఫ్, 55 మందికి ఎల్ఓసీ ఆర్థిక సాయం అందించినట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.5.66 కోట్లు బాధితులకు అందజేసినట్లు తెలిపారు. ఐదు మండలాల్లో మరో 295 మంది అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, త్వరలో వారి కూడా సాయం అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజల ఆరోగ్యానికి ఎన్డీఏ ప్రభుత్వం ఆర్థిక భరోసా ఇస్తూ వారికి అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుచ్చకాయల నాగేశ్వరరావు, ఎంపీపీ యలమంద, తహశీల్దార్ రవిబాబు, ఎంపీడీఓ జ్యోతిర్మయి,విద్యుత్‌శాఖ ఈఈ మస్తాన్ రావు,ఏఈ దీపక్‌రెడ్డి,మండల టీడీపీ నేతలు తేలప్రోలు రమేష్, చేవూరివాసురెడ్డి,అట్లా పెద్ద వెంకటరెడ్డి,సన్నెబోయిన ఏడుకొండలు,సన్నెబోయిన గురుబ్రహ్మంయాదవ్, దుద్దేల గాలయ్య,అనంతవరపు దేవా,పసుపులేటికోటేశ్వరరావు, జిర్రా విజయబాబు పాల్గొన్నారు.

# పలువురికి పరామర్శ, నివాళులు





సంతమాగులూరు, మార్చి 21, ప్రభాతవార్త
సంతమాగులూరు మండలంలో శుక్రవారం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించి పలువురిని పరామర్శించారు. మృతి చెందిన వారికి నివాళులర్పించారు. గురిజేపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ పెరుమాళ్ల వీరయ్యను పరామర్శించి ఆరోగ్య విషయాల అడిగి తెలుసుకున్నారు. చవిటిపాలెం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మర్లపాటి ప్రసాద్ వారి ఇంటిని కుటుంబ సభ్యులను పరామర్శించి పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దుగ్గెంపూడి శివయ్య అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులు, ప్రజలు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

### - రూరల్ సిఐ రామకోటయ్య



రాచర్ల, మార్చి 21 ,ప్రభాతవార్త
పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని గిద్దలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె రామకోటయ్య అన్నారు. రాచర్ల జడ్‌పి హైస్కూల్ మరియు ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్) పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది విధులను ఆయన పరిశీలించారు. బందోబస్తు డ్యూటీ చక్కగా చేస్తున్నారని ఆయన సిబ్బందిని అభినందించారు. పరీక్ష కేంద్రాల సమీపంలోకి బయట వ్యక్తులను ఎవరిని కూడా అనుమతించవద్దని సిబ్బందికి తెలిపారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసుకునేందుకు మీ వంతు పాత్ర పోషించాలని అన్నారు. పరీక్ష కేంద్రం లోపల, వెలుపల తరచూ పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. పరీక్షలు అయిపోయేంతవరకు బందోబస్తు సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఆయన వెంట రాచర్ల ఎస్సై పి కోటేశ్వరరావు, ఏఎస్సై వై ఆదిశేషయ్య, సిబ్బంది ఉన్నారు.

## పాములపల్లె - గిద్దలూరు రోడ్డును పున:నిర్మించాలి

### - సిపిఎం నాయకులు బి.నరసింహులు

గిద్దలూరు, మార్చి 21, ప్రభాతవార్త
గత 15ఏళ్ళ క్రితం పాములపల్లి - గిద్దలూరుకు వెళ్ళే రోడ్డు తారు రోడ్డు నిర్మించడం జరిగిందని రోడ్డు ఇప్పుడు గుంతలమయంగా మారి ప్రయాణానికి ఇబ్బందికరంగా మారిందని రోడ్డును ప్రస్తుతం పున:నిర్మించాల్సిన ఆవశ్యకత ఉందని సిపిఎం నాయకులు బి నరసింహులు అన్నారు. శుక్రవారం సిపిఎం నాయకులతో కలిసి గిద్దలూరు -పాములు పల్లి రోడ్డుకు వెళ్ళి రహదారిని పరిశీలించగా రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి కంకర అంతా బయటపడిందని ఆయన తెలిపారు. పాములపల్లి గ్రామం నుండి నిత్యం రైతాంగం, భవన నిర్మాణ రంగంలో పనిచేసేవారు, పెయింటర్స్ అధిక సంఖ్యలో ప్రజలు నిత్యం గిద్దలూరు పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారని ఆయన తెలిపారు. రహదారి గుండా ప్రయాణం చేయాలంటే అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని, వాహనాలకు పంఛర్లు అవుతూ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. అధికారులు స్పందించి పాములపల్లి నుండి గిద్దలూరుకు వెళ్ళే గుంతల మయంగా మారిన రోడ్డును పున:నిర్మించాలని ఆయన అన్నారు. ఈ రోడ్డును సందర్శించిన వారిలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు జే ఆవేలు, ఎం భాస్కర్, బాబురావు, పాములు గ్రామ ప్రజలు ఉన్నారు.



## ప్రభుత్వ ఉత్తర్వులను లెక్కచేయని ప్రైవేటు స్కూల్స్

**కనిగిరి, మార్చి 21, ప్రభాతవార్త**



ప్రభుత్వం ఒంటి పూట బడులను నిర్వహించమని ఉత్తర్వులు జారీ చేసిన ప్రైవేటు విద్య సంస్థలు ఏ మాత్రం ఆ ఉత్తర్వులను లెక్కచేయడం లేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ పవన్ కళ్యాణ్ అన్నారు. కనిగిరిలో కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు ప్రభుత్వ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ రోజు మొత్తం స్కూల్స్ నిర్వహిస్తున్నారన్నారు. ఈ విషయంపై స్థానిక ఎంఈఓ నారాయణ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ ఉత్తర్వులను లెక్కచేయకుండా స్కూల్స్ నిర్వహిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలపై తగు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎంఈఓకివినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ కన్వీనర్ గూడూరి సతీష్, మండల కన్వీనర్ ఇఫ్రాజ్, పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలు అమలు చేయకుండా, ప్రజా సమస్యలు పక్కన పెట్టి వింత కార్యక్రమాలు నిర్వహించడం సిగ్గు చేటు - ఇన్‌ఛార్జీ దద్దాల

**కనిగిరి, మార్చి 21, ప్రభాతవార్త**



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వింతగా కార్యక్రమాలు నిర్వహించడం సిగ్గుచేటని కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేస్తుందన్నారు. ఇలాంటి వింత కార్యక్రమాల వలన ప్రజాధనం దుర్వినియోగం అవ్వటం తప్పా ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదని, ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా, నిరుద్యోగ భృతి నెలకు రూ.3వేలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారని అన్నారు. ఉచిత బస్సు కింద మహిళలు రాష్ట్రంలో ఏ జిల్లాకు అయిన వెళ్ళచ్చు అని చెప్పి ఆ పథకాన్ని బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. ఆడ బిడ్డ నిధి కింద ప్రతి మహిళకు నెలకు రూ.1500 అని చెప్పి బడ్జెట్‌లో రూపాయలు కూడా కేటాయించలేదు. రైతులు గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్న పరిస్థితి ఉంటే కూటమి ప్రభుత్వం రైతు సమస్యలను పట్టించుకోకుండా వింత కార్యక్రమాలు నిర్వహించడం ఏంటి అని ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇలాంటి కార్యక్రమాలు ఎప్పుడు నిర్వహించలేదని అన్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి చూపించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని దద్దాల నారాయణయాదవ్ కొనియాడారు.

## కనిగిరి ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు

### - మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

**కనిగిరి, మార్చి 21, ప్రభాతవార్త**



కనిగిరి పట్టణంలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ తెలిపారు. పట్టణంలోని 9వ వార్డులో విద్యుత్ లో ఓల్టేజి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, నూతన ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు కోసం శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులతో కలిసి మున్సిపల్ చైర్మన్ సుదర్శన్ థియేటర్ వెనుక వైపు స్థలాన్ని ఎంపిక చేశారు. విద్యుత్ లోఓల్టేజి సమస్యలు ఏర్పడకుండా ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సహకారంతో నూతన ట్రాన్స్‌ఫార్మర్లు అమరుస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. పట్టణంలోని 20 వార్డుల్లో ప్రజలు లో ఓల్టేజి సమస్యతో ఇబ్బందులు పడకుండా, నాణ్యమైన విద్యుత్ సరఫరా కొనసాగించేందుకు విద్యుత్ శాఖ అధికారులతో కలిసి చర్యలు చేపట్టామన్నారు. ఎక్కడ లోఓల్టేజి సమస్య ఉన్నా ఆ ప్రాంతాల్లో అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తామన్నారు. వార్డు కౌన్సిలర్ చొప్పురపు మాధవి(శివ) ఎలక్ట్రికల్ ఏఈ పవన్ కుమార్, టౌన్ లైన్‌మెన్ వెంకటయ్య, జిలాని భాష, తదితరులు పాల్గొన్నారు.

## కనిగిరి మున్సిపాలిటీలో సర్వే నెంబరు 511 వివాదానికి ముగింపు

### - 20 ఏళ్లుగా పరిష్కారం కోసం ఎదురు చూసిన ప్రజలకు న్యాయం

**కనిగిరి, మార్చి 21, ప్రభాతవార్త**



కనిగిరి మున్సిపాలిటీలోని సర్వే నెంబరు 511 వివాదస్పద స్థలం నిషేధిత జాబితా నుంచి తొలగించబడింది. సుమారు 32.95 ఎకరాల భూమిపై తిరిగి రిజిస్ట్రేషన్ జరిపే అవకాశాన్ని కల్పించిన ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి ప్రజలు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఇది గత 20 సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యగా ఉండగా, స్థానికులు ఈ భూమిని తమ స్వంతంగా మార్చుకునే అవకాశం లేక తీవ్రంగా నష్టపోయారు. ఎన్నో ఏళ్లుగా న్యాయ పోరాటాలు సాగించిన ప్రజలకు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రత్యేక చొరువ తీసుకుని పరిష్కారం చూపారు. ఈ భూమి మళ్లీ సర్వే చేసి, కొత్తగా రిజిస్ట్రేషన్ జరిగేందుకు అనుమతులు పొందేందుకు ఎమ్మెల్యే చేసిన కృషిని స్థానిక ప్రజలు హర్షించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

**సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే తపనః**

సర్వే నెంబరు 511 విషయంలో ప్రభుత్వం నుంచి అనుమతులు తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించిన ఎమ్మెల్యే, సంబంధిత అధికారులతో చర్యలు జరిపి ప్రజలకు మేలు జరిగేలా చర్యలు చేపట్టారు. ఈ పరిణామంతో ఎంతో మంది కుటుంబాలు తమ భూములను లీగల్‌గా ఉపయోగించుకునే అవకాశం లభించిందని, తమ చిరకాల కల నెరవేరిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

## 27న ఉప సర్పంచ్ ఎన్నిక

**టంగుటూరు, మార్చి 21, ప్రభాతవార్త**

టంగుటూరు మండలం ఆలకూరపాడు గ్రామంలో ఉప సర్పంచ్ ఎన్నిక జరుగుతుందని మండల పరిషత్ ఈవోఆర్డీ కేవీ రామ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొనాలని తెలిపారు.

## చేనేతలకు అండగా టీడీపీ

**చీరాల, మార్చి 21, ప్రభాతవార్త**



చీరాల బస్టాండ్ దగ్గర తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ముక్కోనపు పార్కు దగ్గర డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి గడియారస్తంబం దాక చేనేతలతో పాదయాత్రంగా వచ్చి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన చీరాల నియోజవకర్గ టీడీపీ అధికార ప్రతినిధి మద్దులూరి మాలకొండయ్య, ఆప్కో చైర్మన్ సజ్జ హేమలత, కూటమి నాయకులు, చేనేత కార్మికులు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేతలకు మొదటి నుంచి చేయూతనిచ్చేది తెలుగుదేశమేనని, చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్ అన్నారు. చేనేతలకు గతంలో రుణమాఫీ చేసిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు. అనంతరం మిఠాయిలు పంచి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ సజ్జ హేమలత, చేనేత కార్మికులు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



## శిద్దా యూత్ ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ

**దర్శి,మార్చి 21, ప్రభాతవార్త**



శ్రీసువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి వారి 55వ వార్షిక తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు తనయుడు శిద్దా సుధీర్ కుమార్ ఆదేశాల మేరకు మందాది సుబ్బారావు ఆధ్వర్యంలో కురిచేడు రోడ్డులో గల ఆంజనేయస్వామి గుడి దగ్గర వచ్చిన భక్తులకు పులి హోర, పెరుగు అన్నం పంపిణీ చేయడం జరిగింది. అనంతరం ఆంజనేయస్వామి గుడిలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిద్దా యూత్ అనిల్, వీర, కొండలు, లోకేష్, వెంకటరావు, శ్రీనుబాబు, వెంగయ్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## దేవుని ఆశీర్వాదాలు అందరిపై ఉండాలి - డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

**దర్శి, మార్చి 21, ప్రభాతవార్త**



దర్శి పట్టణంలో శుక్రవారం జరిగిన ప్రసన్నాంజనేయస్వామి తిరునాల సందర్భంగా దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జీ గొట్టిపాటి లక్ష్మీ మెయిన్‌బజారులోని ఆంజనేయస్వామి, కురిచేడు రోడ్డులోని ఆంజనేయస్వామిని దర్శనం చేసుకుని పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. తదుపరి ఆర్యవైశ్య నాయకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. దర్శి పట్టణంలో టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన మజ్జిగ, పులిహోర పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ దేవుని ఆశీర్వాదాలతో దర్శి నియోజకవర్గ ప్రజలు ఆనందంగా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. దర్శి నియోజకవర్గం అభివృద్ధిలో పయనించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, మహిళలు, టీడీపీ నాయకులు దారం సుబ్బారావు, దేవతి మహనంద, చిన్న, వాసు, మధు, కర్నా శ్రీను, తదితర నాయకులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రసన్నాంజనేయ్వామి తిరునాళ్ల సందర్భంగా పూజా కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

**దర్శి, మార్చి 21, ప్రభాతవార్త**



దర్శి ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా శుక్రవారం ఆంజనేయస్వామి గుడిలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న ప్రకాశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, స్వామి వారి ఆశీస్సులు అందుకున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనంతరం వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి ఏర్పాటు చేసిన మజ్జిగ కేంద్రాన్ని, పట్టణ అధ్యక్షులు ముత్తినీడి సాంబశివరావు భక్తులకు ఏర్పాటు చేసిన పులిహోర పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు వెన్నపూస వెంకటరెడ్డి, కుమ్మిత అంజిరెడ్డి, కేసరి రాంభూపాల్‌రెడ్డి, దుగ్గిరెడ్డి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాన్ని సందర్శించిన డివిజనల్ పంచాయతీ అధికారి

**ముండ్లమూరు, మార్చి 21, ప్రభాతవార్త**



డివిజనల్ పంచాయతీ అధికారి ఒంగోలు డివిజనర్ పద్మ శుక్రవారం ముండ్లమూరు గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఇంటి పన్నులు వసూళ్ల వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.జనార్ధన్ పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి

### - డీవైఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

**దర్శి, మార్చి 21, ప్రభాతవార్త**



దేశమాత దాశ్య శృంఖలాలను తెంచేందుకు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన సర్దార్ భగత్ సింగ్ జీవితాన్ని నేటియువతరం ఆదర్శంగా తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. పోలవరం ప్రాంతంలోని వేద ఫార్మసీ కాలేజీలో భగత్ సింగ్ 94వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడారు. దేశ సంపదను కొల్లగొడుతూ, దేశ ప్రజలు బానిసలుగా చూస్తూ అమానుషమైన పాలన సాగిస్తున్న బ్రిటీష్ సామ్రాజ్యావాదాన్ని ఈ దేశం నుంచి తరిమికొట్టాలని భగత్‌సింగ్ నాయకత్వంలో యువత ఆనాడు విరోచిత పోరాటాలు సాగించారని అన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కేవీ పిచ్చయ్య మాట్లాడుతూ భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా వారం రోజులపాటు యువతలో స్ఫూర్తి నింపే విధంగా సభలు సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పాలకులు యువతరాన్ని మభ్యపెట్టి భావోద్వేగాలను రెచ్చగొట్టి తమకు బానిసలుగా మార్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీ, నిరుద్యోగ భృతి, ఎప్పుడు అమల్లోకి వస్తాయో అంతుబట్టటం లేదని అన్నారు. భగత్ సింగ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయు మండల కార్యదర్శి బోడపాటి హనుమంతరావు పాల్గొన్నారు.



## పూజలు నిర్వహించిన శిద్దా లక్ష్మీపద్మావతి

**దర్శి, మార్చి 21, ప్రభాతవార్త**



దర్శి ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా మొదటిగా అద్దంకి రోడ్డులోని శ్రీ సువర్చలా ప్రసన్నాంజనేయస్వామి గుడిలో పూజల్లో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు సతీమణి శిద్దా లక్ష్మీపద్మావతి పాల్గొని పూజలు నిర్వహించారు. కురిచేడులోని ఆంజనేయస్వామి గుడిలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరణ

### - కేజీబీవీ ప్రిన్సిపాల్ ఆవుల సునీత

**ముండ్లమూరు, మార్చి 21, ప్రభాతవార్త**



కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ముండ్లమూరు నందు 2025- 26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి, ఇంటర్ ఎంపీసీ నందు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏ.సునీత తెలిపారు. సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఈనెల 22 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. 7,8,9,10,12 తరగతులలో మిగులు సీట్ల భర్తీకి బాలికల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఏపీ.కేజీబీవీ.ఏపీసీఎఫ్.ఇన్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## పూర్వీకులు కొన్న దేవస్థాన భూమిని తిరిగి దేవస్థానానికి ఇచ్చేసిన పెద్దకాపు సోదరులు

**పామూరు మార్చి 21, ప్రభాతవార్త**



పామూరులోని శ్రీమదన వేణుగోపాల్‌స్వామికి చెందిన 398/2లో గల భజంత్రీ ఇనాం భూమిని తమ తండ్రి అయిన పేరం మోపిరెడ్డి తెలిసి తెలియక కొనుగోలు చేశారని, ప్రస్తుతం అది దేవుడి మాన్యం కింద ఉన్నందున అది ఎంతో విలువైనప్పటికి తమకు అక్కర్లేదని శుక్రవారం నాడు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబుకు అగ్రిమెంటు ద్వారా మోపూరి రెడ్డి కుమారులు అయిన పేరం రఘునాథ్‌రెడ్డి, బయ్యపురెడ్డి, రామిరెడ్డిలు దేవస్థాన భూమి దేవస్థానానికి తిరిగి ఇచ్చేశారు. ఈ సందర్భంగా ఈవో నరసింహబాబు, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కొండిశెట్టి రమణయ్య, మాజీ సర్పంచ్ కావిటి సుబ్బయ్య తదితరులు పెద్దకాపు సోదరులను అభినందించారు. అదే విధంగా ఆక్రమణలో ఉన్న దేవస్థాన భూములను స్వచ్ఛందంగా ఇవ్వడం సమంజసం అని, లేని పక్షంలో ఆ దేవ దేవుని ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని ఆగ్రహించారు.

## చెత్తసంపద ద్వారా సంపద సృష్టించాలి

### - డీఎల్‌పీఓ ఎల్‌వీఎన్ హనుమంతరావు

**పామూరు, మార్చి 21, ప్రభాతవార్త**




ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసి, అందుకు క్లాప్‌మిత్రాలను, గ్రీన్ అంబాసీడర్లను ఏర్పాటు చేసి గ్రామాల్లో ఎప్పటికప్పుడు నిల్వ ఉన్న చెత్తను వాహనాల ద్వారా చెత్త సంపద కేంద్రాలకు చేరవేసి తడి చెత్త, పొడి చెత్తను వేరుచేయడమే కాక తద్వారా సంపదను సృష్టించి పంచాయతీ ఆదాయాన్ని పెంపొందించుకోవాలని కనిగిరి డివిజనల్ పంచాయతీ అధికారి ఎల్‌వీఎన్ హనుమంతరావు కోరారు. ఈవోపీఆర్డీ అరవిందరెడ్డి అధ్యక్షతన సీఆర్పీ రాఘవులు ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వారం రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసీడర్లు, క్లాప్‌మిత్రాలు, డీఏలు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు పంచాయతీలో ఘన వ్యర్థాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో అపరిశుభ్రత వాతావరణం లేకుండా చూడాలన్నారు. 250 గ్రామాలకు, వెయ్యి మంది జనాభాకు ఒక క్లాప్ మిత్రాలను ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. సంపద సృష్టి గ్రామీణ ప్రాంతాల నుంచిమొదలు కావాలన్నారు. బయోగ్యాస్, ఇంధన ఉత్పత్తి, విద్యుత్ తదితర వ్యర్థాల నుండే రాబట్టవచ్చని సూచించారు. వర్మీ కంపోస్టు తయారు చేసి ప్రజలకు తక్కువ ధరకు విక్రయించాలన్నారు. చెత్త సంపద ద్వారా వివిధ రకాల కూరగాయలు వర్మీ కంపోస్టు ఎరువు ద్వారా పండించి విక్రయించాలని సూచించారు. కేంద్రం నుండి గతంలో పామూరుకు ప్రతిష్టాత్మకమైన అవార్డు లభించడం శుభపరిణామమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మూడో శుక్రవారం స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించడం అభినందించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్, 8వ వార్డు మెంబరు ఉప్పలపాటి హరిబాబు, టీడీపీ నాయకులు మెంటా నరసింహారావు, నీరుకట్టు నాయబ్ రసూల్, పట్టణ టీడీపీ అధ్యక్షులు ఖాజా రహంతుల్లా, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ రత్నకుమార్, బిల్ కలెక్టర్ కృష్ణవేణి, కార్యదర్శులు, కొమ్మాపాటి కృష్ణమూర్తి, రజనీకాంత్, జానీ, నాగేశ్వరరావు, ఆదాంబి, మురళి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## హుస్సేన్‌రావు యాదవ్‌కు ఘనంగా నివాళులు

### - అంతిమయాత్రలో పాల్గొన్న డాక్టర్ ఎమ్మెల్యే ఉగ్ర

**పామూరు, మార్చి21, ప్రభాతవార్త**



మాజీ జడ్పీటీసీ, టీడీపీ నాయకులు బీసీ నేత అయిన మోరబోయిన హుస్సేన్‌రావు మరణం పార్టీకి తీరని లోటని కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి విచారం వ్యక్తం చేశారు. గురువారం మధ్యాహ్నం తన స్వగ్రామం అయిన మోపాడు బంగ్లా వద్ద గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఉగ్ర శుక్రవారం నాడు ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ ఎల్లవేళలా హుస్సేన్‌రావు కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు మండలంలో తనకు మెజార్టీ వచ్చేందుకు కృషి చేశారని అన్నారు. అదే విధంగా తనవెంటే నడుస్తూ టీడీపీలో చేరి తన ఆప్తుడిగా కొనసాగారని, నేడు ఆయన లేని లోటు పూడ్చలేనిదన్నారు. పువ్వాడి వెంకటేశ్వర్లు, పచ్చవ సుబ్బారావు, దారపనేని సుబ్బారావు, దేవరపు మాల్యాద్రి, రాష్ట్ర టూరిజం శాఖ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ ఏర్పాటు చేసిన సీఐ భీమానాయక్, ఎస్సై కిషోర్‌బాబు

**పామూరు, మార్చి 21, ప్రభాతవార్త**



ముస్లిం సోదరుల పవిత్ర పర్వదినం అయిన రంజాన్ మాసం నాడు అకుంఠదీక్షతో ఉపవాసాలు ఉండే వారికి శుక్రవారం నాడు ఇరువురు రోడ్డులోని పెద్ద మసీదు నందు 6గంటల నవాజ్ అనంతరం 400 మంది భక్తులకు సీఐ భీమానాయక్, ఎస్సై కిషోర్‌బాబులు పండ్లు, పాలు, డ్రై ఫ్రూట్స్ అందజేశారు. కుల మతాలకు అతీతంగా పోలీసులు అన్ని వర్గాల పట్ల సమన్యాయం చూపిస్తారని, సర్వమత సమ్మేళనం తమ ధ్యేయమంటూ సీఐ భీమానాయక్, ఎస్సై కిషోర్‌బాబు తెలిపారు. పామూరు ముస్లిం సోదరులు అందరితో కలిసి ఉండటం అభినందనీయమని అన్నారు. పీర్ల పండుగను హిందూ ముస్లిం సోదరులు కలిసి జరుపుకోవడం పామూరుకే సాధ్యమన్నారు. అదేవిధంగా వినాయక చవితి సందర్భంగా ముస్లిం సోదరులు ప్రత్యేకంగా వినాయకునికి పూజలు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. కుల మతాలు, సాంప్రదాయాలు అన్ని ఒకటే అని, మనం ఏర్పరుచుకున్న కులాన్ని మనం వేరుచేయకూడదని, మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ సహోదర భావంతో మెలిగి శాంతి యువత వాతావరణం నెలకొల్పాలన్నారు. కావేరి రసూల్, అల్లిబా, ఆర్టీసీ రఫీ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్

**చీరాల మార్చి 21, ప్రభాతవార్త**



చీరాల ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల్లో భాగంగా నారా కోడూరులో రెండున్నర ఎకరాల్లో నిర్మించబడుచున్న గాయత్రి శక్తి పీఠం, కళ్యాణ మండపం, ప్రవచన హాల్‌కు మా వాకింగ్ సభ్యుడు చెక్క చెన్న నారాయణ ఆర్థిక సహకారంతో గాయత్రి పరివార్ చీరాల శాఖ డీవీఆర్ మూర్తి కి రూ.1,00,000లు నగదు సభ్యుల సమక్షంలో గ్రౌండ్ నందు అందజేశారు. గాయత్రి పరివార్ సభ్యులు గాయత్రి శాలువాలతో, చెక్క చెన్న నారాయణ, ప్రెసిడెంట్ సెక్రటరీలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, దారగుళ్ళ గురు ప్రసాద్, చెక్క చెన్న నారాయణ, కారుమూరి జనార్ధన్‌రావు, వలివేటి మురళీకృష్ణ, గుద్దంటి రమేష్‌బాబు, వీరాంజనేయులు, నేరెళ్ళ రాముడు, పూర్ణా సుబ్బారావు, మోహన్‌రావు, కృష్ణమూర్తి, వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.

## కవితా దినోత్సవం

**వేటపాలెం, మార్చి 21, ప్రభాతవార్త**



వేటపాలెం మండల కేంద్రంలో వెలసిన మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో నేడు కవితా దినోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నగంజాంకు సంబంధించిన సాహితీ వేత్త అయిన శ్రీ శ్రీరామచంద్రమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి అక్కడ ఉన్న మూడు వందల మంది విద్యార్థులకు, బోధన బోధనేతర సిబ్బందికి తెలుగు సాహిత్యంలోని గొప్పతనాన్ని గురించి తెలుగు నేర్చుకోవాల్సిన ఆవశ్యకత గురించి ఎంతో గొప్పగా వివరించారు. అంతే కాక తనచే రచింపబడిన అనేక కవితలను అత్యంత మధురంగా గానం చేశారు. విద్యార్థులంతా వారి కవితలకు మంత్రముగ్ధులయ్యారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ కూడా కవితా గానం చేశారు. అంతే కాక శ్రీరామచంద్రమూర్తి చివరగా విద్యార్థులకు చక్కని మానసిక బోధనను కూడా చేయటం జరిగింది. తదనంతరం శ్రీరామచంద్ర మూర్తికి పాఠశాల తరపున ఆత్మీయ మైన సత్కారం చేయడం జరిగింది.

# ఆప్‌లో సంస్థాగత మార్పులు షురూ

## పంజాబ్ ఇన్‌ఛార్జిగా సిసోడియా

## ఢిల్లీ చీఫ్‌గా సౌరభ్ భరద్వాజ్





**న్యూఢిల్లీ, మార్చి 21:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి చవిచూసిన తర్వాత ఆమ్ ఆద్మీపార్టీ అంతర్గత ప్రక్షాళనపై దృష్టిసారించింది. ఆమ్ ఆద్మీపార్టీ సంస్థాగతంగా కొన్ని మార్పులు చేసింది. మాజీ మంత్రి సౌరభ్ భరద్వాజ్‌ను ఢిల్లీయూనిట్ కొత్త అధ్యక్షుడుగా నియమించింది అలాగే సీనియర్ నాయకుడు మనీష్ సిసోడియాను పంజాబ్ ఇన్‌ఛార్జిగా నియమిస్తున్నట్లు ప్రక టించింది. ప్రస్తుతం ఉన్న గోపాల్‌రాయ్ స్థానంలో భరద్వాజ్ బాధ్యతలు స్వీకరిస్తారు. ఇపుడు దేశంలోనే ఆప్ పాలనలో ఉన్న ఏకైక రాష్ట్రం కావడంతో పట్టు కోల్పోకుండా మరింత శక్తివంతం అయ్యేందుకుగానున ఆప్ సిసోడియాను ఇన్‌ఛార్జిగా నియమించింది. ఆప్ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం పార్టీ సుప్రీమో అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో జరిగింది. ఆ తర్వాత తన సోషల్‌మీడియా పోస్టులో అరవింద్ కేజ్రీవాల్ కొత్త బాధ్యతలు అప్పగించిన నేతలకు శుభాకాంక్షలు కూడా తెలిపారు. అలాగే జమ్ముకాశ్మీర్ రాష్ట్ర అధ్యక్షుడుగా మెహ్‌రాజ్ మాలిక్‌ను నియమించారు. పంజాబ్‌కు సహప్రభారి కింద సత్యేందర్‌జైన్‌ను కూడా నియమించారు. గోవా ఇన్‌ఛార్జిగా పంకజ్‌గుప్తా, గోవాకు సహ ఇన్ ఛార్జి గా అంకుష్‌నారంగ్, అభాష్ చందేలా, దీపక్ సింఘ్లాలు నియమితులయ్యారు. గుజరాత్‌కు ఇన్‌ఛార్జిగా గోపాల్ రాయ్ నియమితులయ్యారు. అదేరాష్ట్రానికి సహ ఇన్‌ఛార్జిగా దుర్గేష్ పాథక్ నియమితులయ్యారు. ఇక ఛత్తీస్‌ఘర్‌కు ఇన్ ఛార్జిగా సందీప్ పాథక్‌ను నియమించిన ఆప్ ఆయన జాతీయ కార్యదర్శిగా కూడా కొనసాగు తారని ప్రకటించింది. భరద్వాజ్ మాట్లాడుతూ ఆప్ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో సుమారు 43.5శాతంఓట్లను సాధించిందని బిజెపికంటే కేవలం రెండుశాతం మాత్రమే ఓట్లు తక్కువ వచ్చాయని అన్నారు. సంక్లిష్ట సమయంలో కూడా ఢిల్లీలో సగం ఓట్లు ఆప్‌కే వచ్చాయని అన్నారు. తమకు ఓట్లువేసిన వారినేకాకుండా బిజెపికి ఓట్లువేసినవారి సంక్షేమంకూడా పట్టించుకుంటూ పార్టీని మరింత పటిష్టంచేస్తామన్నారు. విజయం సాధిస్తే అనేకమంది పార్టీలో చేరతారని, అదే ఓటమి పాలయితే ఎవ్వరూ ముందుకు రారన్నారు. ఈ సమయంలోనే పార్టీని పటిష్టం చేయడం మంచి పరిణామం అని ఆయన అన్నారు. పార్టీని పటిష్టంచేసి మరింతగా విస్తరి స్తామన్నారు. అలాగే మనీశ్‌సి సోడియా కూడా తనను పంజాబ్ ఇన్‌ఛార్జిగా నియమించినందుకుగాను ఆప్ అధినేత కేజ్రీవాల్‌కు కృతజ్ఞతలు చెప్పారు. పంజాబ్‌ప్రజలు తనపట్ల చూపించే అభిమానమే తనకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆప్‌ప్రభుత్వ పనితీరు ఇపుడు కనిపిస్తోందని, ఇపుడు పార్టీ పరంగా కూడా రాకెట్ స్పీడ్‌తో పని చేస్తామన్నారు.

# కర్ణాటక అసెంబ్లీని కుదిపేసిన 'హనీట్రాప్'

## 18 మంది బిజెపి ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు



**బెంగళూరు, మార్చి 21:** హనీట్రాప్ వ్యవహారం కర్ణాటక అసెంబ్లీని కుదిపేసింది. కేంద్ర మంత్రులతో సహా సుమారు 48 మంది రాజకీయ నాయకులు హనీట్రాప్‌లో చిక్కుకున్నట్లు కర్ణాటక సహకార మంత్రి రాజన్న రాష్ట్ర అసెంబ్లీలో సంచలన వ్యాఖ్యలుచేసిన సంగతి తెలిసిందే. ఈ సమస్య ఏ ఒక్క రాజకీయ పార్టీకోపరిమితం కాదని, దీనిపై ఉన్నతస్థాయి దర్యాప్తుజరగాలని ఆయన డిమాండ్‌చేసారు. ఆయన వ్యాఖ్యలు కర్ణాటక రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ విషయాన్ని అసెంబ్లీ సమావేశాల్లోప్రతిపక్ష బిజెపినేతలు లేవనెత్తారు. హనీట్రాప్ వ్యవహారంపై చర్చకు పట్టుబట్టారు.

అయితే ఇవేమీ పట్టించుకోకుండా కర్ణాటక ప్రభుత్వం ముస్లిం కోటా బిల్లును అసెంబ్లీలో స్పీకర్ ఆమోదించారు. దీనితోసభ మరింత రణరంగంగా మారింది. అసెంబ్లీ కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తున్నారన్న అభియోగంపై 18 మంది ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ విధిస్తూకర్ణాటక అసెంబ్లీలో తీర్మానంచేసారు. దీనితో ఆరునెలలపాటు 18 మంది బిజెపి ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ విధిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. హనీట్రాప్‌పై విచారణను పక్కనపెట్టి ప్రభుత్వం ముస్లింకోటా బిల్లును పాస్‌చేయడాన్ని విమర్శిస్తూ స్పీకర్‌చుట్టూచేరి నిరసన తెలిపారు. తమచేతుల్లోనిముస్లిం కోటా బిల్లు ప్రతులను చించి స్పీకర్‌పై వేసారు. దీనితోసభలో గందరగోళం నెలకొంది. ప్రభుత్వం టెండర్లలో ముస్లిం కాంట్రాక్టర్లకు నాలుగుశాతం కోటా ఇచ్చేందుకు ప్రభుత్వం చట్టం తెచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ బిల్లును బిజెపి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇది రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ ప్రభుత్వనిర్ణయంపై కోర్టుకు వెళతామని చెపుతోంది. ప్రభుత్వ టెండర్లలో ముస్లిం కాంట్రాక్టర్లకు నాలుగుశాతం కోటా కోటా ఇచ్చేందుకు కర్ణాటక సర్కారు నిర్ణయించింది. ఇందుకోసం రూపొందించిన బిల్లుకు గత వారం రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. కర్ణాటక ట్రాన్స్ పరెన్సీ ఇన్‌పబ్లిక్‌ప్రొక్యూర్‌మెంట్ చట్టంలో సవరణ తీసుకువచ్చారు. కెటిపిపి చట్టంలో కేటగిరీ 2బి కింద రిర్వేషన్ విధానం అమలు చేస్తామని సీఎం సిద్ధరామయ్య అసెంబ్లీలో ప్రకటించారు. కేటగిరీ 2బిలో ముస్లిం కాంట్రాక్టర్లు ఉంటారని అన్నారు. కేటగిరీ 1 కింద ఎస్సీలు, ఎస్టీలు కేటగిరీ 2ఎకింద వెనుకబడిన తరగతులవారుంటారు. కెటిపిపి చట్టం ప్రకారం కేటగిరీ బి కింద ఉన్న ముస్లిం కాంట్రాక్టర్లు సుమారు రెండుకోట్ల మేర ప్రభుత్వ పనులు చేసేందుకు అర్హులు అవుతారు. అసెంబ్లీలో బిజెపి ఎమ్మెల్యేలు ఈ చట్టంప్రతులను చించివేసి స్పీకర్‌పోడియంపైకి విసిరేసారు. ప్లకార్డులు చేతపబట్టి తమ నిరసన నినాదాలతో హోరెత్తించారు. కర్ణాటక సీఎం మాట్లాడుతూ ఒకసారి కేసున మోదయిన తర్వాత దర్యాప్తుప్రారంభిస్తే హనీట్రాప్‌లో ఎవరి ప్రమేయం ఉన్నట్లు తేలినా వారిపై కఠిన చర్యలు తప్పవని ప్రకటించారు. కర్ణాటక సహకార మంత్రి రాజన్న చేసిన వ్యాఖ్యలు అసెంబ్లీని కుదిపేసాయి.

మరో మంత్రి సతీశ్‌జర్కిహోళీ మాట్లాడుతూ ఒక మంత్రిపై రెండుసార్లు హనీట్రాప్ యత్నం జరిగిన మాట నిజమేనన్నారు. రాష్ట్రానికి ఇది కొత్తకాదని రాజకీయ ప్రయోజనాలకోసం కొంతమంది వీటిని వాడుకుంటున్నారన్నారు. సస్పెన్షన్ వేటుపడిన సభ్యులు అసెంబ్లీ హాలు, లాబీ గ్యాలరీల్లోకి ప్రవేశించడానికి వీలులేదు. ఏ స్థాయీ సంఘం సమావేశాల్లోను పాల్గొనేందుకు వీలులేదు. అసెంబ్లీ అజెండాలో వారి పేర్లతో ఎలాంటి అంశం లిస్ట్ కాకూడదు. ఈ సమయంలో వారికి రోజువారి భత్యాలతు కూడా చెల్లించరు. ఇక సస్పెండ్ అయిన ఎమ్మెల్యేలను మార్షల్స్ బలవంతంగా బయటకు తరలించారు.

# గవర్నర్ ప్రసంగానికి అడ్డు తగిలిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

### ఆర్మీ కల్నల్‌పై హింసకు చర్యలు తీసుకోవాలని నిరసన

### అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసిన ఎమ్మెల్యేలు



**ఛండీఘర్, మార్చి 21:** పంజాబ్ బడ్జెట్ సమావేశాల్లో మొదటిరోజే గవర్నర్ గులాబ్‌చంద్ కటారియా ప్రసంగానికి అడ్డుతగులుతూ కాంగ్రెస్ సభ్యులు వాకౌట్‌చేసారు. వారంతా చేతికి నల్లటి రిస్ట్‌బాండ్లు ధరించి అసెంబ్లీనుంచి వాకౌట్ చేసారు. సర్వీసులో ఉన్న ఆర్మీకల్నల్ ఆయన కుమారుడిపై పోలీసుల దాష్టీకం, దాడిచేయడం పట్ల తీవ్ర నిరసన తెలిపారు. అలాగే శంభు సరిహద్దులో నిరసనలు తెలుపుతున్న రైతులపై పోలీసుల కాఠిన్యం పైనా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. విపక్షనేత ప్రతాప్‌సింగ్ బాజ్వా తన సీటులోంచి లేచి నిరసన ప్రకటించారు. ఇదే సమయంలో గవర్నర్ కటారియా తన ప్రసంగం కొనసాగిస్తున్నారు. గవర్నర్ కొంతసేపు నిలిపివేసారు కూడా అయినా కూడా బాజ్వా తన నిరసన ఆపలేదు. గవర్నర్ తన ప్రసంగాన్ని పూర్తి చేసిన తర్వాత కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా తమ తమసీట్లలోంచి లేచి నిలుచుని తమ నిరసనను ప్రకటించారు. బాజ్వాతోపాటే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సభ వెల్‌లోకి దూసుకువచ్చారు. ప్లకార్డులు చేపతబట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలుచేస్తూ వాకౌట్ చేసారు. కల్నల్ పుష్పిందర్‌సింగ్ ఆయన కుమారుడిపై పోలీసు దాడి సంఘటనకు సంబంధించి సిట్టింగ్ లేదా రిటైర్డ్ హైకోర్టు జడ్జిచేత విచారణజరిపించాలని కోరారు. వీరిద్దరిపైనా 12మంది పంజాబ్ పోలీసులు దాడిచేసి లాఠీలతో చావబాదారని ఆరోపించారు. దుశ్చర్యలకు పాల్పడినపోలీసులపై చర్యలు తీసుకోవాలని వెంటనే వారిని కూడా అరెస్టు చేసి సర్వీసునుంచి తొలగించాలని డిమాండ్ చేసారు. గవర్నర్ కటారియా తన ప్రసంగంలో పంజాబ్ ప్రభుత్వం వ్యవసాయ పాలసీ ముసాయిదాను అన్ని విభాగాలకు పంపించిందని, రైతులు, కార్మికసంఘాలు వాటిపై తమ అభిప్రాయాలు కోరిందని చెప్పారు. 11 మంది సభ్యులున్న కమిటీ ఈ పాలసీని రూపొందించింది. సుస్థిర వ్యవసాయం, లాభ సాటి వ్యవసాయంపైనే ఈ విధానం ఉంటుందని తేల్చింది. పంజాబ్‌ప్రభుత్వం రైతులకు ఎనిమిది గంటల ఉచిత విద్యుత్ అందిస్తోందని, గృహా వసరాల్లో కూడా ఎలాంటి కోత లేకుండా చర్యలు తీసుకుందన్నారు. అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయంలోను, దుర్గియానా మందిర్‌కు కావాల్సిన కొనుగోళ్లపై జీఎస్టీకి ప్రత్యామ్నాయంగా పరిహారం రూపంలో ప్రభుత్వం 2.7కోట్లు విడుదల చేసిందని చెప్పారు. ఈనెల 26వ తేదీ రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు. బడ్జెట్ అంచనాలపై చర్చలు ఈనెల 27వ తేదీనుంచి జరుగుతాయని పంజాబ్ సిఎం భగవంత్‌మాన్ ప్రకటించారు.

# మా జోలికొస్తే అమెరికాకు గట్టి ఎదురుదెబ్బే..

## ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేని వ్యాఖ్య



**టెహరాన్, మార్చి 21:** యెమెన్‌లోని హూతీలపై అమెరికా భీకర స్థాయిలో విరుచుకుపడుతున్న విషయం తెలిసిందే. ఇటీవల ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హూతీ తిరుగుబాటుదారుల చర్యలకు ఇరాన్‌తో ముడిపెడుతూ.. తదుపరి దాడులకు పాల్పడితే టెహ్రాన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కో తప్పదని హెచ్చరించారు. ఆయన వ్యాఖ్యలపై తాజాగా ఇరాన్ సుప్రీం లీడర్ అయాతుల్లా అలీ ఖమేనీ స్పందించారు. యెమెన్‌కు చెందిన హూతీలు తాము చెప్తే దాడులకు పాల్పడట్లేదని ఆ విషయంలో వారికి సొంత కారణాలు ఉన్నాయని పేర్కొన్నారు.

తాము ఎప్పుడూ ఎవరితోనూ ఘర్షణలు ప్రారంభించదని అలా అని ఎవరైనా తమ జోలికి వస్తే మాత్రం ఊరుకోమన్నారు. సంబంధంలేని విషయాల్లో టెహ్రాన్‌పై అనవసర ఆరోపణలు చేస్తే అమెరికాకు గట్టి ఎదురుదెబ్బ తగులుతుందని హెచ్చరించారు. ఇటీవల అగ్రరాజ్యం హూతీలపై వరుస దాడులు చేస్తోంది. ఈ విషయంపై ట్రంప్ మాట్లాడుతూ.. హూతీలను ఆకతాయి మూకలు, దుండగులుగా పేర్కొన్నారు. వారు చేసే దాడులను భారీ సైన్యంతో దీటుగా ఎదుర్కొంటామని చెప్పారు. అది అక్కడితో ఆగుతుందనే హామీ కూడా ఇవ్వలేనన్నారు. 'బాధితుడి' పాత్ర పోషించిన ఇరాన్ నియంత్రణ కోల్పోయామని చెబుతున్న ప్పటికీ అది నిజం కాదన్నారు. హూతీల ప్రతి కదలికలను నిర్దేశిస్తోందని, ఆయుధాలు, నగదు అత్యాధునిక సైనిక సామగ్రితోపాటు నిఘా సమాచారాన్ని పంచుకుంటోందని ఆరోపించారు. ప్రపంచ జలమార్గాల్లో అమెరికా వాణిజ్య, నౌకా దళనౌకలను ఏ ఉగ్రవాద దళమూ ఆపలేదని అన్నారు. ఇటీవల యెమెన్ రాజధాని సనా సహా పలు నగరాలపై అమెరికా యుద్ధ విమానాలు బాంబుల వర్షం కురిపించాయి. రెండురోజుల పాటు కొనసాగిన దాడుల్లో కనీసం 53 మంది మృతి చెందగా అనేకమంది గాయపడ్డారు. మరో వైపు హూతీలు మాత్రం తాము తగ్గేలే లేదని, గాజాకు అండగా ఉంటూ.. ఎలాంటి సవాళ్లు ఎదురైనా పాలస్తీనియన్లకు సాయం చేస్తామని చెబుతున్నారు.

# రష్యాలో ఉండాలంటే పౌరసత్వం తప్పనిసరి

## ఉక్రెయిన్ పౌరులకు పుతిన్ అల్టిమేటం



**మాస్కో, మార్చి 21:** రష్యాలో నివసిస్తున్న ఉక్రెయిన్ పౌరులకు ఆ దేశాధ్యక్షుడు పుతిన్ అల్టిమేటం జారీ చేసినట్లు తెలుస్తోంది. వారంతా ఇమ్మిగ్రేషన్ స్టేటస్‌ను చట్టబద్ధం చేసుకోవాలని, లేనిపక్షంలో దేశాన్ని వీడాలని ఆయన ఆదేశించినట్లు సమాచారం. ఈ మేరకు పలు అంతర్జాతీయ మీడియాల్లో కథనాలు వెలువడ్డాయి. 2022లో రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఉక్రెయిన్‌లో భాగమైన దొనేత్స్క్, లుహాన్స్క్, ఖేర్సన్, జపోరిజయా ప్రాంతాలను రష్యా స్వాధీనం చేసుకుంది. తాజాగా ఆ ప్రాంతాల్లోని నివాసితులు రష్యాలో ఉండాలంటే దేశ పౌరసత్వం తప్పనిసరిగా తీసుకోవాలని పుతిన్ ఆదేశాలు జారీ చేశారు. లేకుంటే సెప్టెంబరు 10 కల్లా దేశాన్ని వీడాలని ఆయన హెచ్చరించారు. ఈ తాజా ఉత్తర్వులు 2014లో మాస్కో సొంతం చేసుకున్న క్రిమియా ప్రాంతాల్లోని నివాసితులకు సైతం వర్తిస్తుందని ఆయన తెలిపారు. ఇక, ఇటీవల కాలంలో పుతిన్ ప్రభుత్వ ఉక్రెయిన్ పౌరులపై ఇలాంటి ఒత్తిడి తెస్తూనే ఉంది. గతేడాది ఆయా ప్రాంతాల్లోని పౌరులకు రష్యన్ పాస్‌పోర్టులు జారీ చేసే ప్రక్రియను చేపట్టారు. ఈ చర్యలను ఉక్రెయిన్ సహా దాని మిత్ర దేశాలు అప్పుడే ఖండించాయి. ఈ క్రమంలో మరోసారి ఇలాంటి ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.

ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా 30 రోజుల కాల్పుల విరమణను ప్రతిపాదించారు. అందుకు కీవ్ అంగీకరించగా మాస్కో సూత్రప్రాయంగా ఒప్పుకుంది ఇటీవల పుతిన్‌తో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్‌లోని ఇంధన, మౌలిక సదుపాయాలపై నెల రోజులపాటు దాడులు నిలిపివేయాలని ఈ చర్చల్లో నిర్ణయించుకున్నారు. అయితే, ఒప్పందం కుదుర్చుకున్న కొన్ని గంటల్లోకే అది ఉల్లంఘనకు గురైంది. ఈ దాడులు, ప్రతిదాడులు జరుగుతున్న సమయం లోనే రెండు దేశాలు 175 మంది యుద్ధ ఖైదీలను మార్పిడి చేసుకోవడం గమనార్హం. బుధవారం జెలెన్‌స్కీ, ట్రంప్‌లు ఫోన్‌లో మాట్లాడారు. దాదాపు గంటపాటు జరిగిన ఈ సంభాషణలో పుతిన్‌తో జరిపిన చర్చలపైనే ఎక్కువసేపు మాట్లాడుకున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం సౌదీ అరేబియాలోని జెద్దాలో కాల్పుల విరమణకు సంబంధించిన చర్చలు ప్రారంభం కానున్నట్లు యుఎస్ అధికారి తెలిపారు.

# ప్రధాని మోడీ విదేశ పర్యటనల ఖర్చు రూ.258కోట్లు



**న్యూఢిల్లీ, మార్చి 21:** ప్రధానిమోడీ విదేశీపర్యటనలకు అయిన ఖర్చువివరాలను కేంద్ర ప్రభుత్వం విడుదలచేసింది. 2022 సంవత్సరం నుంచి 2024 డిసెంబరు వరకూ ప్రధాని 38 విదేశీపర్యటనలకు వెళ్లారని, ఈపర్యటనలకోసం మొత్తం రూ.258 కోట్లు ఖర్చుచేసినట్లు ప్రకటించింది. గడచిన మూడేళ్లలో విదేశీపర్యటనలకు మోడీ వెళ్లినపుడు వివిధ ఏర్పాట్లకోసం అక్కడి దౌత్యకార్యాలయాలు ఎంత ఖర్చుచేసాయో వెల్లడించాలని రాజ్యసభలో విపక్షనేత మల్లిఖార్జున ఖర్గే కేంద్రాన్ని కోరారు. ఖర్గేప్రశ్నకు విదేశాంగశాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గెరిటా లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2022మే నుంచి 2024 డిసెంబరు వరకూ ప్రధాని 38 విదేశీపర్యటనలకు వెళ్లారని తెలిపారు. ఈ పర్యటనలకు గాను రూ.258 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. 2022-24 మధ్య ప్రధాని మోడీ అమెరికా, జపాన్, జర్మనీ కువైట్ డెన్మార్క్, ఫ్రాన్స్, యుఎఇ, నేపాల్; ఇండోనేసియా, ఆస్ట్రేలియా, ఈజిప్టు, దక్షిణాఫ్రికా, గ్రీస్, పోలాండ్, ఉక్రెయిన్ రష్యా, ఇటలీ, బ్రెజిల్, గయానాదేశాల్లో పర్యటించారు. 2022 మేలో ప్రధాని తన విదేశీపర్యటననను జర్మనీతో ప్రారంభించారు. 2024 డిసెంబరులో కువైట్‌తో తన పర్యటనలు ముగిసాయి. ఇందులో అత్యధికంగా 2023 జూన్‌లో జరిగిన అమెరికా పర్యటనకు రూ.22కోట్లు ఖర్చు అయినట్లు విదేశాంగశాఖ తెలిపింది. గత ఏడాది సెప్టెంబరులో మోడీ అమెరికా వెళ్లినపుడు రూ.15.33 కోట్లు ఖర్చు అయినట్లు వెల్లడించింది. ఇకమే 2022లో ప్రధాని నేపాల్‌ప ర్యటనకు రూ.80 లక్షలు, మే 2023లో జపాన్ పర్యటనకు రూ.17.19కోట్లు ఖర్చుచేసినట్లు వివరించింది. ఇక 2014కి ముందు అప్పటి ప్రధానులు చేసిన విదేశీప ర్యటనలకు సంబంధించిన ఖర్చుల వివరాలను కూడా మంత్రి వెల్లడించారు. 2011లో అప్పటి ప్రధాని అమెరికా పర్యటనకు రూ.10.74 కోట్లు ఖర్చయినట్లు తెలిపారు. అదే ఏడాదిఫ్రాన్స్ సందర్శనకు రూ.8.33కోట్లు, 2013లో రష్యా సందర్శనకు రూ.9.95కోట్లు2013లో జర్మనీ పర్యటనకు రూ.6కోట్లు ఖర్చయినట్లు వెల్లడించారు.

# సూడాన్ అధ్యక్ష భవనం తిరిగి సైన్యం స్వాధీనం

**ఖర్టూమ్(సూడాన్), మార్చి 21:** సూడాన్ సైన్యం రాజధాని ఖర్టూన్‌లోని అధ్యక్షభవనాన్ని రెండేళ్ల తర్వాత ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ నుంచి తిరిగి స్వాధీనం చేసుకుంది. ఇందుకు సంబంధించిన విడియోలు వైరల్‌గా మారాయి. దీనిపై ఆర్‌ఎస్‌ఎఫ్ వర్గాలు ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. రెండేళ్లక్రితం రాజధాని ఖర్టూమ్‌లో భయంకరమైన అంతర్యుద్ధం ఆరంభం అయింది. దీనితో నగరంలోని చాలా ప్రాంతాలను ఆర్‌ఎస్‌ఎప్ అధీనంలోకి తీసుకుంది. తాజాగా ఈప్రదేశంపై పట్టు సాధించేందుకు సైన్యానికి అతిపెద్ద విజయమనే చెప్పాలి. ఆర్మీ మధ్య సూడాన్‌లోని ప్రాంతాల్లో వరుసగా విజయాలు సాధిస్తోంది. గురువారం రిపబ్లికన్ ప్యాలెస్‌వద్ద డ్రోన్లు, యుద్ధవిమానాలు దాడులుచేసాయి.

సూడాన్‌లోని పారామిలిటరీ రాపిడ్‌సపోర్టు ఫోర్స్ దళాన్ని సూన్యంలో విలీనంచేసేందుకు రూపొందించిన ప్రతిపాదన రెండు బలగాలమధ్య ఘర్షణలకు దారితీసింది. ఇదేవిషయమై సైన్యాధినేత అబ్దుల్‌ఫతా అల్ బుర్హాన్, పారామిలిటరీ కమాండర్ మహ్మద్ హందాన్ డగ్లోమధ్య కొన్నివారాలుగా ఉన్న విబేదాలు తారస్థాయికి చేరడంతో కోల్డ్‌వాం మొదలయింది.

ఆ తర్వాత అధ్యక్షభవనం, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి వాటిని ఆర్‌ఎస్‌ఎఫ్ తన అధీనంలోకి తీసుకుంది.

ఇక యుద్ధం ఆపేందుకు ప్రయత్నించిన ఐక్య రాజ్యసమితి సంస్థలను కూడా దేశం వీడివెళ్లి పోయేలా ఆరెస్సెఫ్ నిరంతర కృషి చేసింది.



సూడాన్‌లో అధ్యక్ష భవనాన్ని స్వాధీనం చేసుకున్న సైన్యం

# డీలిమిటేషన్‌పై నేడు జెఎసి భేటీ

### విడియో సందేశం విడుదల చేసిన తమిళనాడు సిఎం స్టాలిన్



**చెన్నై, మార్చి 21:** లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన పై కేంద్రంలోని బిజెపికి, పలు రాష్ట్రాల ప్రభుత్వాలకు మధ్య వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో దీనిపై చర్చించేందుకు పలు రాష్ట్రాల నాయకులతో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ మార్చి 22న జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముందు స్టాలిన్ ఓ వీడియోను విడుదల చేశారు. అందులో జనాభా ప్రాతిపదికన విభజన జరిగితే రాష్ట్రాల హక్కులకు భంగం వాటిల్లుతుందని ఆయన ఆరోపించారు. శుక్రవారం ఓ వీడియోను పంచుకున్నారు. 'జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి హాజరవుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక, ఒడిశా, పశ్చిమబెంగాల్, పంజాబ్ నాయకులకు నా హృదయపూర్వక స్వాగతం. మార్చి 5న జరిగిన అఖిల పక్ష సమావేశం ఒక మైలురాయి. 2026 ఏడాదిలో జరిగే పునర్విభజన జనాభా ప్రాతిపదికన జరిగితే పార్లమెంటులో మన ప్రాతినిధ్యం తీవ్రంగా దెబ్బతింటుంది. ఇది కేవలం ఎంపిల సంఖ్య గురించి మాత్రమే కాదు. రాష్ట్ర హక్కుల భంగం గురించి. అందుకే దీనిపై బిజెపి తప్ప మిగిలిన పార్టీలన్నీ ఏకమయ్యాయి. తమిళనాడులోని 58 పార్టీలు సైతం విభేదాలను పక్కనపెట్టి సముచితమైన పునర్విభజనకు ఒక్కటయ్యాయి. జనాభా ప్రాతిపదికన పునర్విభజనను తొలుత తమిళనాడు వ్యతిరేకించింది. దీనికి అన్ని రాష్ట్రాలు చేతుల కలపడంతో ప్రస్తుతం ఇది ఒక జాతీయ ఉద్యమంగా మారింది' అని స్టాలిన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగే సమావేశం దేశ భవిష్యత్తును రూపొందించే ఉద్యమానికి నాంది అని ఆయన అభివర్ణించారు. ఈ నెల 5న స్టాలిన్ నేతృత్వంలో చెన్నైలో అఖిలపక్ష సమావేశం జరిగింది. అందులో పునర్విభజనను ఏకగ్రీవంగా వ్యతిరేకిస్తున్నట్లు అఖిలపక్ష సమావేశం తీర్మానించింది. పార్లమెంటు సభ్యుల సంఖ్యను పెంచే పక్షంలో 1971 జనాభా లెక్కల ఆధారంగా ఇరు సభల్లో రాష్ట్రాల మధ్య ప్రస్తుతమున్న నిష్పత్తి మేరకు నియోజకవర్గాల సంఖ్యను పెంచడానికి అవసరమైన రాజ్యాంగ సవరణలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డి మాండ్ చేసింది. ఈ క్రమంలో పునర్విభజన వల్ల జరిగే నష్టాలు, తీసుకోవాల్సిన నిర్ణయాలపై చర్చించేందుకు కలిసిరావాలని ఏడు రాష్ట్రాల సిఎంలకు స్టాలిన్ లేఖలు రాశారు. ఈ నెల 22నచెన్నైలో నిర్వహించే సమావేశానికి ప్రతి నిధులను పంపాలని ఆయన అందులో కోరారు.

# ఉక్రెయిన్ అణువిద్యుత్ ప్లాంట్లపై ట్రంప్ ప్రతిపాదన

## యాజమాన్య హక్కులపై జెలెన్‌స్కీ భిన్న స్వరం

**కీవ్, మార్చి 21:** ఉక్రెయిన్‌లో ఉన్న అన్ని అణు విద్యుత్‌ప్లాంట్లను అమెరికా స్వాధీనం చేసుకొంటుందటూ ట్రంప్ చేసిన ప్రతిపాదన విషయంలో జెలెన్‌స్కీ భిన్న స్వరం వినిపించారు. డొనాల్డ్ ట్రంప్‌తో చర్చల్లో కేవలం జపోరిజియా విషయం మాత్రమే వచ్చిందని కీవ్ వర్గాలు వివరణ ఇచ్చాయి. ఇతర న్యూక్లియర్ ప్లాంట్లు ఉక్రెయిన్ సొంతమని పేర్కొన్నారు. 'రష్యా ఆక్రమించిన జపోరిజియా అణుప్లాంట్ ఉక్రెయిన్‌కు చెందినది. ఈ విషయాన్ని అందరూ గుర్తించారు' అని పేర్కొన్నారు. జపోరిజియాపై అమెరికా యాజమాన్యం విష యంలో తాను ట్రంప్‌తో మాట్లాడినట్లు జరిగిన ప్రచారాన్ని ఆయన తిరస్కరించారు. ప్రస్తుత పరిస్థితికి పరిష్కారం ఎలా అనే అంశాన్ని.. విద్యుత్తు ప్లాన్‌ను రష్యన్ల నుంచి ఎలా వాపస్ తీసుకోవాలనే అంశాలను మాత్రమే చర్చించామన్నారు. అంతేకాదు తమ దేశ ఆస్తుల గురించి ట్రంప్‌తో ఏమాత్రం చర్చించలేదన్నారు. ప్రస్తుతం జపోరిజియా రష్యా అధీనంలో ఉన్నా.. ఉక్రెయిన్ పవర్‌గ్రిడ్‌కు అనుసంధానమై ఉంది. దీనినుంచి ఎటువంటి విద్యుత్ ఉత్పత్తి కావడంలేదు. ఇది ప్రపంచంలోనే 10వ పెద్ద అణుపవర్ ప్లాంట్. ఇక ఐరోపాలో మాత్రం ఇదే అతిపెద్దది. 2022లో దండయాత్ర మొదలైన తొలినాళ్లలోనే రష్యా సేనలు దీనిని ఆక్రమించాయి. ఇక్కడ మాస్కో దళాలు ఆయుధాలు, సైనికులు మోహరించారని కీవ్ ఆరోపిస్తోంది. అక్కడి నుంచే దాడులు చేస్తోందని పేర్కొంది. వాస్తవానికి ఈ ప్లాంట్‌పైనా చాలా దాడులు జరిగాయి. దీని కూలింగ్ వ్యవస్థ దెబ్బతింది. ఉక్రెయిన్‌లో జపోరిజియా కాకుండా మరో మూడు అణువిద్యుత్ ప్లాంట్లు ఉన్నాయి. ఇవి ఆ దేశంలోనే అత్యధిక విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
అటవీ శాఖ
ప్రకటన
ఆర్.సి.నెం. 2575/2009/డుస్.5, తేది: 15.03.2025
వాహన యజమాని/సంబంధితులకు తెలియజేయునది ఏమనగా 5 వాహనములలో ఎర్రచందనము కలప అక్రమ రవాణా చేయుచుండగా గిద్దలూరు అటవీ డివిజన్ అటవీ అధికారులచే కనుగొనబడి కేసులు నమోదు చేయడమైనది. సదరు వాహన యజమాని ఎవరైనా క్లెయిమ్ చేయదలచినవారు ఈ ప్రకటన వెలువడిన 15 దినములలో స్వయముగా సంబంధిత రికార్డులతో ఈ కార్యాలయపు పని దినములలో హాజరు కావలసిందిగా తెలుపడమైనది. సదరు గడువు లోపల హాజరు కానీ ఎడల అటవీ చట్టము ప్రకారము సదరు వాహనాలను ప్రభుత్వపరము చేయబడును. వాహన వివరముల కొరకు ఈ కార్యాలయములో సంప్రదించగలరు.
సం/-. డిప్యూటీ డైరెక్టర్, ప్రాజెక్టు టైగర్, గిద్దలూరు.
DIPR.NO. 15614/CL/ADVT/1/1/2022-23 తేది: 21.03.2025

22-3P□g7exHMNWJQE.qxd:22-3P□g7exHMNWJQE.qxd 01/01/01 9:54 AM Page 1



# వృద్ధుల కోసం టైం బ్యాంక్ ఇండియా వినూత్న సేవలు రాష్ట్రంలో ప్రారంభం

**విజయవాడ,మార్చి20,ప్రభాతవార్తప్రతినిధి:** వృద్ధుల కోసం టైం బ్యాంక్ ఇండియా వినూత్న సేవలు ఏపీలోను సేవలుఅందించేందుకు కృషి వయో వృద్ధుల కోసం టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వినూత్న రీతిలో సేవలు అందిస్తున్నారు. దేశంలోనే మొట్ట మొదటి సారిగా 2019లో సిక్కింలో ఈ పద్ధతిని అమలు చేశారు. ప్రస్తుతం రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి పెద్ద రాష్ట్రాల్లోను టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉచితంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ సంస్థ మన రాష్ట్రంలోను తమ సేవలు ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. రాజస్థాన్ కు చెందిన పి.సి.జైన్ బృందం రాష్ట్ర ప్రభుత్వంతో నేడు భేటీ అయ్యింది. రాష్ట్రాన్ని సమర్ధవంతంగా ముందుకు నడిపిస్తున్న విజనరీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఆలోచనలకు అనుగుణంగా పని చేయాలన్న ఆకాంక్ష ఉందని సంస్థ ప్రతినిధులు తెలియజేశారు. ఏపీలోని వృద్ధులకు అండగా నిలిచేందుకు తమ సంస్థ అన్ని విధాలుగా సహాయసహకారాలు అందిస్తుందని అన్నారు. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగువుతున్న నేపథ్యంలో వృద్ధులకు చేదోడుగా నిలిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రతినిధులకు స్పష్టం చేసింది. వృద్ధులకు ఒంటరితనం తగ్గి సామాజిక అండ లభించాలన్న సీఎం గారి ఆలోచనలను టైం బ్యాంక్ ఇండియా ద్వారా నెరవేరుతుందని ఆకాంక్షించారు. వృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడు కట్టుబడి ఉంటుంది. ఈ క్రమంలో ఈ సంస్థ సహకారం అందిస్తుందని ముందుకు రావడం సంతోషకరం. ఇప్పటికే విశాఖను పైలట్ జిల్లాగా టైమ్స్ ఆఫ్ ఇండియా తమ సేవలు ప్రారంభించింది. అక్కడ పరిస్థితులు తదుపరి చర్యల మీద అవగాహనకు వచ్చిన తరువాత మరింత ముందుకు వెళ్లేందుకు ప్రణాళికను రచిస్తున్నారు. గతంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉండటం వలన వృద్ధులకు ఒంటరితనం ఉండేది కాదు. కానీ కాలక్రమేణా పరిస్థితులు మారిపోయి వారు ఒంటరిగా మారుతున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో దాదాపు 10.38 కోట్ల మంది సీనియర్ సిటిజన్లు ఉండగా.. 2047 నాటికి ఈ సంఖ్య 30 కోట్లకు చేరుకుంటుందని అంచనా. కాబట్టి భవిష్యత్ లో రాష్ట్రంలోని వృద్ధులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా ఉండేందుకు టైమ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అండగా నిలుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007, దత్తత, పోషణ చట్టం 1956 ప్రకారం వృద్ధులకు అండగా నిలుస్తుంది. అంతే కాకుండా గిఫ్ట్‌డీడ్ కింద ఆస్తులను రాసిచ్చాక.. తల్లిదండ్రుల సంరక్షణను విస్మరించి, వారి బాగోగులు చూడని బిడ్డల నుంచి ఆ ఆస్తులను తిరిగి పొందే హక్కు ఉందని కొద్ది రోజుల క్రితం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరు ఆనందాయకంగా ఉన్నప్పుడే హ్యాపీ, హెల్తీ, వెల్తీ సాధ్యమవుందని సీఎం చంద్రబాబు ఆకాంక్ష. ఆ దిశలో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 2047 నాటికి 85 ఏళ్ల ఆయు ప్రమాణం పెంచే దిశగా స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళికలు సిద్ధం చేసింది.



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,మార్చి

# ఎఎన్‌యులో నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్ ప్రారంభం

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,మార్చి 21,ప్రభాతవార్త :** వర్సిటీలో శుక్రవారం నుంచి చెరుకూరి లెనిన్ ఓల్గా మెమోరియల్ ఆర్చరీ చాంపియన్‌షిప్ ప్రారంభమయ్యాయి. అండర్–13,అండర్–10 ఆర్చరీ పోటీలను విశ్వవిద్యాలయ ఇన్‌చార్జ్ విసి ఆచార్య కె.గంగాధరరావు జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రారంభించారు. ఇన్‌చార్జిరెక్టార్ కె.రత్నషీలామణి ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా పతకాన్ని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ జి.సింహాచలం ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ పతకాన్ని ఆవిష్కరించి చాంపియన్‌షిప్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్,కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పిపిఎస్ పాల్‌కుమార్, ఢిల్లీ కామన్వెల్త్ గేమ్స్ సిల్వర్ మెడలిస్టు లెనిన్ శిష్యుడు రీతుల్ చటర్జీ,కాంపిటేషన్ డైరెక్టర్ బ్రిజేష్‌కుమార్,నేషనల్ జడ్జి బి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గంగాధరరావు మాట్లాడుతూ అర్చరీ పోటీలను వర్ధమాన అర్చర్లతో యూనివర్సిటీలో నిర్వహిస్తున్నందుకు చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమి ని,ఏపి అర్చరీ అసోసియేషన్ ను అభినందిస్తూ భవిష్యత్తులో ఆర్చరీ విలువిద్యకు ఏ సహాయం కావాలన్న యూనివర్సిటీ అన్ని రకాల పోటీల నిర వ్వహణకు సహకరిసు _ందని పేర్కొన్నారు.ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు మంచి క్రీడా ప్రదర్శనను ఇవ్వడం ద్వారా తమ ప్రతిభను మెరుగుపరచుకోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్‌లో అకాడమీ యూనివర్సిటీలో ఏకార్యక్రమం నిర్వహించిన యూనివర్సిటీ సహకరిస్తుందని పేర్కొన్నారు.ఈ పోటీల్లో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి అండర్–13 విభాగంలో సుమారుగా 700మంది అర్చర్ (బాలురు,బాలికలు),150మంది కోచ్‌లు, మేనేజర్లు ఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నారు. తొలిరోజు రికర్వ్,కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగంలో ర్యాంకింగ్ పోటీలు నిర్వహించబడ్డాయి.

తొలుత ఏపిఎఎ ప్రధాన కార్యదర్శి చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీ అధ్యక్షులు,చీఫ్ కోచ్ చెరుకూరి సత్యనారాయణ అతిధులను ఆహ్వానించారు.

# కలెక్టర్‌కు బాంబు బెదిరింపు... మెయిల్ ద్వారా మెసేజ్

**- అన్నమయ్య,తిరుపతి జిల్లాల కలెక్టర్లకు బెదిరింపు వచ్చినట్లు సమాచారం**

**- ఏమీ లేవని వెనుతిరిగిన పోలీస్ అధికారులు**

**తిరుపతి కలెక్టరేట్, మార్చి 21 ప్రభాతవార్త :** తిరుపతి, అన్నమయ్య జిల్లా కలెక్టర్లకు శుక్రవారం అగంతుకుల నుంచి బాంబు బెదిరింపులు రావడంతో పాటు ఏకంగా కలెక్టర్ల మెయిల్స్ మెస్సెజ్‌లు రావడం రెండు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. దీంతో ఒక పక్క మీడియా మిత్రులకు, మరో ప్రక్క పోలీస్ అధికారులకు ముంచెమటలు పడుతున్నాయి. ఒకానొక దశలో తిరుపతి కలెక్టరేట్, చుట్టు ప్రక్క ప్రాంతాల్లో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. అయితే ఎక్కడా ఏ బాంబులు లేవని నిర్ధారించుకుని వెనుతిరిగి మీడియా మిత్రులు, పోలీసులు వెళ్ళినట్లు సమాచారం. అయితే కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ప్రభాతవార్త ప్రతినిధితో మాట్లాడుతూ ఇలాంటి బెదిరింపులు షరా మామూలేనని, ఇప్పటికే తనకు 30 నుంచి 40 పర్యాయాలు కొంత మంది అగంతులు బాంబు బెదిరింపులు వచ్చాయని, అలాగే మెయిల్ ద్వారా మెస్సెజ్‌లు పంపిన విషయాన్ని గుర్తు చేశారు. అలాంటి అగంతులపై గట్టి నిఘా పెట్టామని, ఇలాంటి వాటిని ఎవరూ ప్రోత్సహించకూడదని, తద్వారా ప్రజల్లో అలజడి పడుతుందని హితవు పలికారు. అయితే శుక్రవారం ఏపీఎస్పీడీసీఎల్ తిరుపతి సబ్ స్టేషన్‌ను బాంబు పెట్టి పేల్చివేస్తామని కొంత మంది అగంతుల నుంచి వచ్చిన సమాచారం మేరకు మీడియా మిత్రులు, పోలీస్ బృందాలు అక్కడికి చేరుకుని తనిఖీలు నిర్వహించి ఎలాంటి బాంబులు లేవని నిర్ధారించుకుని ఊపిరి పీల్చుకున్నారు.

తిరుపతిని టార్గెట్ చేసి అగంతుకులు బాంబు బెదిరింపులకు పాల్పడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి బాంబు బెదిరింపులపై ఎస్పీ హర్షవర్ధన్ బాబు ఆదేశాల మేరకు తిరుపతి అడిషనల్ ఎస్పీ రవి మనోహర్ ఆచారి నేతృత్వంలో ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు.

**నేరాల నియంత్రణలో**

# టెక్నాలజీ కీలకం

**- హోంమంత్రి వంగలపూడి అనిత**



**విజయవాడ, మార్చి 21 .ప్రభాతవార్త ప్రతినిధి:** నేరాల నియంత్రణలో టెక్నాలజీ కీలకమని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శాంతిభద్రతలను కాపాడే విషయంలో రాజీపడవద్దని పోలీసులకు సూచించారు. ఇవాళ(శుక్రవారం) డీజీపీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీసులకు హోంమంత్రి అనిత కీలక ఆదేశాలు జారీ చేశారు. సరెండర్లు, ఏరియర్లు ఇప్పించాలని రాష్ట్ర పోలీస్ సంఘం ప్రతినిధులు హోంమంత్రి అనితకు వినతిపత్రం అందజేశారు. అనకాపల్లిలో హిజ్రా హత్యపై ప్రభుత్వం, పోలీసుల స్పందన పట్ల హిజ్రాలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా అనిత మాట్లాడారు. చిన్నారులు, మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి మూడు నెలలకోసారి శాంతిభద్రతలపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. పటిష్ట భద్రతతో శాసనసభ సమావేశాల నిర్వహణ అభినందనీయమని పోలీస్ శాఖను ప్రశంసించారు. కలెక్టర్ల సదస్సును కూడా సమర్థవంతంగా నిర్వహిద్దామని చెప్పారు. నేరం జరగ్గానే నిందితులను పట్టుకోవడం మంచి పరిణామమని అన్నారు. హెల్మెట్ ధరించని వారిపట్ల సున్నితంగా వ్యవహరించాలని హోంమంత్రి సూచించారు. రౌడీయిజం తగ్గించే దిశగా రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెట్టాలని హోంమంత్రి అనిత అన్నారు.

# 2 బిసి బిల్లుల ఆమోదానికి ధన్యవాదాలు

**అసెంబ్లీలో సిఎంను కలిసిన బిసి కమిషన్ ఛైర్మన్, సభ్యులు**

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** రాష్ట్ర అసెంబ్లీలో 2 బిసి బిల్లులను ఆమోదించిన నేపథ్యంలో రాష్ట్ర బిసి కమిషన్ ఛైర్మన్, సభ్యులు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం మధ్యా హ్నం అసెంబ్లీలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో బిసి కమిషన్ ఛైర్మన్ జి నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మీ కలిశారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి రాష్ట్రంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించడానికి 2 బిల్లులకు ఆమోదించినందుకు కమిషన్ తరపున ధన్యవాదాలు తెలిపి.. అభినందించారు. అదే సమయంలో బిసి కమిషన్ కార్యక్రమ వివరాలను, వివిధ అంశాలను కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. బిసి కమిషన్‌కి సంబంధించినటువంటి కొన్ని సూచనలు ముఖ్యమంత్రి చేశారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, మంత్రివర్గ ఉపసంఘ సభ్యులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్ బాబులను కూడా కలిసి వారికి ధన్యవాదాలు, అభినందనలు తెలిపారు.



# బిఆర్ఎస్ రజతోత్సవ వేడుకలపై కెసిఆర్ దిశానిర్దేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 21:** బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ సన్నాహక సమావేశాలు, కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి (భువనగిరి), గ్యాదరి కిషోర్ కుమార్ (తుంగతుర్తి), గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి (ఆలేరు) శుక్రవారం ఎర్రవెల్లిలోని వారి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా పార్టీ రజతోత్సవ కార్యక్రమాల నిర్వహణ, వరంగల్ బహిరంగ సభ తదితర అంశాలపై పార్టీ అధినేత 4 నియోజకవర్గాల నాయకులకు దిశా నిర్దేశం చేశారు. త్వరలో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మిగతా ఎనిమిది నియోజకవర్గాల ముఖ్యనాయకులతో సమావేశం ఉంటుందని కేసీఆర్ తెలిపారు.

# ప్రజావాణికి అందిన దరఖాస్తులు 298

**హైదరాబాద్ (బేగంపేట) మార్చి 21, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 298 దరఖాస్తులు అందాయి. వాటిలో పంచా యతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 43 దరఖాస్తులు, విద్యుత్ శాఖకు సంబంధించి 25 దరఖాస్తులు, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 56 దరఖా స్తులు, ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం 106 దరఖాస్తులు వచ్చాయి.ఇతర శాఖలకు సంబంధించి 88 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణీ ఇంచార్జి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా.జి. చిన్నారెడ్డి స్టేట్ నోడల్ అధికారి దివ్య దర ఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# దుర్గమ్మ ఆలయంలో 30న ఉగాది వేడుకలు

**- వసంత నవరాత్రోత్సవాల సందర్భంగా ప్రత్యేక పుష్పార్చన**

**ఇంద్రకీలాద్రి, మార్చి 21, ప్రభాత'వార్త' :** దుర్గమ్మ వారి ఆలయంలో ఈనెల 30 నుండి ఏప్రిల్ 7 వరకు వసంత నవరాత్రోత్సవాలు నిర్వహిస్తామని ఇఓ కె రామచంద్రమోహన్ తెలిపారు. ఉగాది పర్వదినం మార్చి 30న ప్రారంభయ్యే ఈ ఉత్సవాల్లో దుర్గమ్మవారిని వర్ణమయ పుష్పాలతో ప్రత్యేక పుష్పార్చన నిర్వహిస్తామన్నారు. ఈనెల 30న ఉదయం 3 గంటలకు శ్రీ అమ్మవారికి ఉపాలయాలలోని దేవతామూర్తులకు స్నపనాభిషేకం, అలంకారం, అర్చన, నివేదన, హారతి నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఉగాది పర్వదినాన ఉదయం 9 గంటలకు శ్రీ అమ్మవారి దర్శనం ప్రారంభమవుతుందన్నారు. ఉగాది పర్వదినాన (ఒక్కరోజు మాత్రమే) శ్రీ అమ్మవారి ఆర్జిత సేవలు ఉదయం 9 గంటల నుండి జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు దేవస్థానం ఆస్థాన సిద్ధాంతి బ్రహ్మశ్రీ చల్లా శ్రీనివాస శర్మ పంచాంగం శ్రవణం చేస్తారని, మధ్యాహ్నం 4 గంటలకు మండప పూజ, అగ్ని ప్రతిష్టాపన, రుద్ర హోమం (యాగశాలలో), సాయంత్రం 6 గంటలకు వెండి రథోత్సవం ( శ్రీ మల్లిఖార్జున మండపం నుండి ప్రారంభం) జరుగుతాయన్నారు. ఏప్రిల్ 5వ తేదీన చైత్రమాసం శుద్ద అష్టమి రోజున ఉదయం 6 గంటలకు ఇంద్రకీలాద్రి స్థిత క్షేత్రపాలక హనుమకు, ఘాట్‌రోడ్డు నందు శ్రీ అభయాంజనేయ స్వామివార్లకు అభిషేకం, నాగవల్లీ దళార్చన (తమలపాకు అర్చన), ఏప్రిల్ 6న శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా ఉదయం 10 గంటలకు శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 7న ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి, ఉదయం 10.30 గంటలకు శ్రీ రాముల వారి పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తామన్నారు. దుర్గమ్మవారికి శుక్రవారం కళావేదికపై జరిగిన నృత్య ప్రదర్శన ఆద్యంతం భక్తులను ఆకట్టుకుంది. నృత్యాచార్య బాగవతుల సౌమ్య నేతృత్వంలో వైష్ణవి భార్గవి, అఖిలాండేశ్వరి, శివస్తుతి, కట్టెదుర వైకుంఠము, తందనాన భళ, రామాయణ శబ్దం తదితర కీర్తలకనుగుణంగా నృత్యరీతులతో 25 మంది కళాకారులు ఆకట్టుకున్నారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను అందించారు. పుష్పార్చన టికట్లు భక్తులు ఆన్‌లైన్లో, దేవస్థానం ఆర్జిత సేవా టికెట్ల కౌంటర్లో పొందవచ్చన్నారు.




నృత్యాభినయంతో నీరాజనాలర్పిస్తున్న కళాకారులు

# మొక్కలు మనల్ని కాపాడుతాయి

**అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ**

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త :** వృక్షో రక్షతి రక్షితః చెట్టును మనం కాపాడితే... చెట్టు మనల్ని కాపాడుతుంది. ఇది జగమెరిగిన సత్యం. అడవుల పరిరక్షణ ఆవశ్యకత అందరికీ తెలియాలనే ఉద్దేశంతో, జనంలో చైతన్యం రావాలని మార్చి 21ని ప్రపంచ అటవీ దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా కేబీఆర్ పార్కులో జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అటవీ, పర్యావరణ శాఖ మంత్రిగా నేను చెట్ల సంరక్షణలో భాగస్వామ్యం అవడం చాలా సంతోషంగా ఉన్నదన్న మంత్రి మన సంస్కృతి, సంప్రదాయంలోనే వృక్ష సంరక్షణ ఉందని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. పర్యావరణ పరి రక్షణ, జీవజాలం మనుగడకు అడవులే ఆధారం. జీవజాలానికి, వనాలకు విడదీయరాని సంబంధం ఉందని నా అభిప్రాయం. అడవులను ప్రజలు తమ స్వలాభం కోసం నాశనం చేస్తూ... తమ ఉనికిని తామే ప్రశ్నార్థకం చేసుకొంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రకృతి మాత్రమే శాశ్వ తమైనదనే సత్యాన్ని గుర్తిస్తే, మానవ మనుగడకు ఆధారంగా నిలుస్తున్న అడవులను జాగ్రత్తగా కాపాడుకునేలా ఉద్యమించాలన్నారు. మనమంతా, ప్రకృతిని సంరక్షిస్తూ, ప్రకృతితో మమేకమై జీవించడంలోనే అర్థవంతమైన జీవితం ఉన్నదని, అడవుల ప్రాముఖ్యత, అడవులతో మనిషికి ఉన్న అనుబంధం, అడవుల సంరక్షణకు అనుసరించాల్సిన కార్యాచరణ ఈ సందర్భంగా మనమంతా గుర్తు చేసుకోవాలన్నారు. అడవులను సంరక్షించుకోకపోతే తలెత్తే విపత్కర పరిస్థి తులను అటవీ దినోత్సవం సంద ర్భంగా మనమంతా మననం చేసుకో వాలన్నారు. పట్టణీకరణ, పరిశ్రమల స్థాపన, ప్రాజెక్టుల నిర్మాణం, పోడు వ్యవసాయం, గృహాల నిర్మాణం వంటి కారణాలతో అడవులు నానాటికీ అంతరించి పోతున్నాయన్నది మన మంతా ఆవేదన వ్యక్తం చేయాల్సిన అవ సరం ఉన్నదన్నారు. భూ విస్తీర్ణానికి అనుగుణంగా అడవుల విస్తరణ లేకపోవడంతో గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో కఠిన సమస్యలు ఎదుర్కొం టున్నామన్నారు. పర్యావరణంలో సమతుల్యత లోపించి విపత్తుల బారిన పడుతు న్నాం వన్య ప్రాణులకు ఆవాసాలైన అడవులను కాపాడు కుంటేనే జీవవైవిధ్యం వర్ధిల్లుతుంది.ప్రభుత్వం చేపట్టే చర్యలకు ప్రజలు కూడా తమవంతు సహకారం అందిస్తేనే అడవుల విస్తీర్ణంలో వృద్ధి నమోదవుతుందన్నారు. ప్రముఖులను కలిసేందుకు వెళ్లేప్పుడు ఎవరైనా శాలువాలు, బొకేలు తీసువెళ్లడం సాధారణం కాని తనను కలిసేందుకు వచ్చేవారు శాలువాలను, బొకేలను తీసుకు రావద్దని మంత్రి కొండా సురేఖ సూచించారు. వందలాది రూపాయలను తన కోసం ఖర్చుపెట్టవద్దన్నారు. వాటిపై పెట్టే ఖర్చును తిండిలేని అభాగ్యులకు ఖర్చు చేయాలని విజ్ఞప్తి చేశారు.




శుక్రవారం ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా కెబిఆర్ పార్కులో జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, పక్కన మొక్కను నీళ్లు పోస్తున్న మిస్‌వరల్డ్

# అసెంబ్లీని ముట్టడించిన పిడిఎస్‌యు కార్యకర్తల అరెస్టు



**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** ఓయులో ధర్నాలను నిషేధించంతోపాటు నిరసనలకు అనుమతి లేకుండా చేయడం, విద్యార్థులకు అందాల్సిన ఫీజు రియంబర్స్ మెంట్ వెంటనే చెల్లించాలని కోరుతూ పిడిఎస్‌యు కార్యకర్తలు శుక్రవారం అసెంబ్లీని ముట్టడించారు. ఓవైపు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న వేళ మ ధ్యాహ్నం 12 గంటల సమయంలో పిడిఎస్‌యు కార్యకర్తలు ఒక్కసారిగా బ్యానర్లు పట్టుకుని గన్ పార్క్ నుంచి అసెంబ్లీ వైపు దూసుకువచ్చారు. అయితే పిడిఎస్‌యు కార్యకర్తల రాక గురించి ముందుగానే సమాచారం వుండడంతో పోలీసులు అసెంబ్లీ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం తో పాటు సాయుధులను కూడా మొహరిం చారు. దీంతో పోలీసులు పిడిఎస్‌యు కార్యకర్తలు అసెంబ్లీ వద్దకు రాగానే వారిని వెంటనే అరెస్టు చేసి అంతకు ముందు సిద్దంగా వుంచి వాహనాలలో సైఫాబాద్ పోలీ సు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు నాయకులు మాట్లాడుతూ పోలీసుల వైఖరి సరైంది కాదని మండిపడ్డారు. ఓయులో విద్యార్థుల హక్కులను స ర్కారు కాలరాస్తోందని వారు దుయ్యబట్టారు. గతంలో ప్రతిపక్షంలో వుండగా కాంగ్రెస్ పార్టీ ఓయు విద్యార్థులకు ఎన్నో హామీలు ఇచ్చిందని, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక వాటిని మరచిపోవడంతోపాటు రాజ్యాంగబద్ధంగా లభించిన నిరసన హక్కును కూడా రద్దు చేసిందని, ధర్నాలకు కూడా అవకాశం లేకుండా చేసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

# బిసిల బడ్జెట్‌ను రూ. 20వేల కోట్లకు పెంచుతూ సవరించండి

**సిఎం రేవంత్‌రెడ్డికు ఆర్.కృష్ణయ్య లేఖ**

**హైదరాబాద్, మార్చి 21, ప్రభాతవార్త:** బిసిల సంక్షేమానికి ఎన్నికల వాగ్ధానానికి విరుద్ధంగా బడ్జెట్‌లో కేవలం 11వేల కోట్లు మాత్రమే కేటాయించారని, కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం దీన్ని 20వేలకు పెంచుతూ బడ్జెట్ సవరిం చాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 56 శాతం జనాభా గల బిసిలకు ఈ బడ్జెట్ కేటాయింపులు ఏ మూలకు సరిపోదంటూ ఆయన శుక్రవారం సిఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు. 'అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో బిసిల సంక్షేమానికి 11వేల కోట్లు కేటాయించారు.దీన్ని 20వేల కోట్లకు పెంచాలి. బడ్జెట్‌లో కొత్త స్కీమ్‌లు ఏమీ లేవు. పెరిగిన ధరల ప్రకారం స్కాలర్‌షిప్‌లు, మెస్ ఛార్జీలు పెంచే ప్రస్తావన లేదు. అలాంటే విద్యార్థుల ఫీజు రియాంబర్స్‌మెంట్ చేస్తామని ఇచ్చిన హామీకి బడ్జెట్ కేటాయింపులు లేవు. ఈ విద్యాసంవత్సరంలో కొత్తగా 119 బిసి రెసిడెన్షియల్ పాఠశాలలు ఇస్తామని ఇచ్చిన హామీకి బడ్జెట్ కేటాయింపులు లేవు' అని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 320 బిసి కాలేజీ హాస్టళ్లకు, 315 బిసి గురు కులాలకు ఒక్కదానికి కూడా సొంత భవనాలు లేవు. కేటాయించిన స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారు.వీటిలో చదువుకుంటున్న విద్యార్థులను బందెల దొడ్డిలో పశువులను తోలినట్లు ఒక్కొక్క రూమ్‌కు 20 నుంచి 50 మంది చొప్పున విద్యార్థులకు కేటాయి స్తున్నారు. ఇదేం న్యాయం?.బిసి వర్గాలను చిన్నచూపు చూస్తారా'? అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్ధానం తగ్గట్టుగా బడ్జెట్ కేటాయిం పులను సరిచేయాలని ఆయన సిఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

# సిబిఐ ఎసిబికి చిక్కిన సెంట్రల్ జిఎస్టీ అధికారి

**మెదక్ కార్యాలయంలో దాడులు.. నాంపల్లి ఎసిబి కోర్టుకు తరలింపు**

**మెదక్ మున్సిపాలిటీ, మార్చి 21, ప్రభాతవార్త:** సెంట్రల్ జీఎస్టీ మెదక్ రేంజ్ సూప రింటెండెంట్ సిబిఐ ఎసిబి అధికారులకు చిక్కాడు. హైదరాబాద్‌లోని సీబీఐ ఏసీబీ అధికారి ధనుంజయ్ బృందం శుక్రవారం మెదక్ ఆటోనగర్‌లోని గవర్న మెంట్ ఆఫ్ ఇండియా జీఎస్టీ కార్యాలయంలో సూపరింటెండెంట్ రవి రంజాన్ అగర్వాల్‌ను అవినీతికి పాల్పడటంతో అదుపులోకి తీసుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కేంద్ర కార్యాలయం తలుపులు మూసివేసి విచారణ జరిపారు. డబ్బులు తీసుకుంటూ చిక్కడా అనే విషయాలు అధికారులు వెల్లడించలేదు. బాధితుల వివరాలు కూడా సీబీఐ అధికారులు గోప్యంగా ఉంచారు. అరు గంటల విచారణ అనంతరం మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో అరెస్టు సమాచారం ఇచ్చి అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌లోని నాం పల్లి ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు అధికారులు చెప్పారు.

# నిమ్స్‌లో అత్యాధునిక స్పైనల్ ఎండోస్కోపిక్ సర్జరీ సిస్టమ్ ప్రారంభం

**హైదరాబాద్ (పంజగుట్ట), మార్చి 21, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడకల్ సైన్సెస్ (నిమ్స్)లోని న్యూరోసర్జరీ విభాగం శుక్రవారం ఎమర్జెన్సీ బ్లాక్‌లోని నిమ్స్ 3వ అంతస్తులో అత్యాధునిక స్పైనల్ ఎండోస్కోపిక్ సర్జరీ సిస్టమ్‌ను ప్రారంభించారు. ఈ అధునాతన వ్యవస్థను బిహెచ్ఇఎల్ జిగ్యాస్ టర్బైన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అందించింది. రోటరీ క్లబ్ ఆఫ్ సికిందరాబాద్ సన్‌రైజ్, రోటరీ సన్‌రైజ్ సర్వీస్ ట్రస్ట్ సహకారంతో దీన్ని ప్రారంభించారు. కె.శరత్ చౌదరి, జిల్లా గవర్నర్ దేనియల్లి మెల్స్ పాచ్, డైరెక్టర్ రోటరీ ఇంటర్నేషనల్, డాక్టర్ ఎన్. భీరప్ప, డైరెక్టర్, నిమ్స్ వైస ఛాన్సలర్ సమక్షంలో ప్రారంభించారు. ఈ అత్యాధునిక సాంకేతికత విభాగం సామర్థ్యాలను గణనీయంగా పెంపు.

# నేడే వరల్డ్ కాస్ట్లీ లీగ్



## గ్రాండ్‌గా ఐపీఎల్ ఓపెనింగ్ సెర్మనీ

### 13 వేదికల్లో ప్రారంభ వేడుకలు

### 22 నుండి మే 25 వరకూ 74 మ్యాచ్‌లు

### బెంగళూరు, కోల్‌కతా మధ్య రాత్రి 7.30కి ఓపెనింగ్ మ్యాచ్

**న్యూఢిల్లీ:** క్రికెట్ ప్రేమికులు ఎంతగానో ఎదురు చూస్తున్న ప్రపంచంలోనే కాస్ట్లీ లీగ్ అయిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)-2025, 18వ సీజన్ మరి కొద్ది సేపట్లో ప్రారంభం కానుంది. ఈ ఏడాది ఐపిఎల్ 18వ సీజన్ కావడంతో, భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ ఈ లీగ్‌ను మరింత వినోదాత్మకంగా మార్చేందుకు కొత్త నిర్ణయాన్ని తీసుకుంది. ఈ నెల 22నుండి మే 25వరకు జరగనున్న ఐపిఎల్‌లో ఫోర్లు, సిక్సర్ల వర్షంలో అభిమానులు తడిసి ముద్ద కానున్నారు. ఈ ఐపిఎల్‌లో 10 జట్లు పాల్గొంటుండగా, ఈసారి 65 రోజుల్లో 74 మ్యాచ్‌లు జరగనున్నాయి. మే 18 వరకు 70 లీగ్ దశ మ్యాచ్‌లు జరుగుతాయి. వాటిలో 12 డబుల్ హెడర్లు ఉంటాయి. అంటే ఒక రోజులో 2 మ్యాచ్‌లు 12 సార్లు జరుగుతాయి. ఫైనల్ మే 25న కోల్‌కతాలో జరుగుతుంది. అహ్మదాబాద్, ముంబై, చెన్నై, బెంగళూరు, లక్నో, ముల్లాన్‌పూర్ (మొహాలీ), ఢిల్లీ, జైపూర్, కోల్‌కతా, హైదరాబాద్ 10 జట్లకు హోం గ్రౌండ్‌లు. వీటితో పాటు, గౌహతి, విశాఖపట్నం, ధర్మశాల సహా మొత్తం 13 వేదికలలో మ్యాచ్‌లు జరుగుతాయి.

ఇక తొలి మ్యాచ్‌లో గత సీజన్ విజేత (డిఫెండింగ్ ఛాంపియన్) కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు తలపడనుంది. కోల్‌తాలోని ఈడెన్ గార్డెన్స్ స్టేడియంలో శనివారం ప్రారంభం కానున్న ఈ ఐపిఎల్ ఓపెనింగ్ సెర్మనీ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈసారి ఒక్క కోల్‌కతాలోనే కాకుండా, మొత్తం 13 వేదికల్లోనూ ఓపెనింగ్ సెర్మనీ నిర్వహించనుంది. ప్రత్యేకంగా ప్రతి వేదికపై తొలి మ్యాచ్‌కు ముందుగా ఓపెనింగ్ సెర్మనీ నిర్వహించాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటులు, గాయకులు, ఇతర ప్రముఖ కళాకారులు పాల్గొని అభిమానులను అలరించనున్నారు. సాధారణంగా ఓపెనింగ్ మ్యాచ్ మాత్రమే గ్రాండ్ సెర్మనీ జరుగుతుంది. కానీ, ఈసారి 13 వేదికల్లోని ప్రతి స్టేడియంలో మొదటి మ్యాచ్ ముందు ప్రత్యేక ప్రదర్శనలు ఉంటాయి. ఈ నెల 22న ఈడెన్ గార్డెన్స్ 30 నిమిషాల పాటు ఓపెనింగ్ సెర్మనీ జరగనుంది. ఈ కార్యక్రమంలో బాలీవుడ్‌ప్రముఖగాయని శ్రేయా ఘోషాల్, ప్రముఖ నటి దిశాపటాని స్టేజ్‌పై సందడి చేయనున్నారు. ఈ వేడుకకు ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ చైర్మన్ జై షా కూడా హాజరవుతున్నారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రదేశాల్లోని అభిమానులను ఆకర్షించేందుకు పర్ఫార్మెన్సుకు స్థానిక, జాతీయ కళాకారులను ఎంపిక చేస్తోంది.

ప్రస్తుత సమాచారం ప్రకారం, ప్రతి వేదిక కోసం ప్రత్యేకంగా బాలీవుడ్, ప్రాంతీయ కళాకారులను ఎంపిక చేశారు. తొలిసారిగా ఇంత పెద్ద స్థాయిలో ఓపెనింగ్ సెర్మనీ నిర్వహించబోతున్నారు. దీంతో కొన్ని సమస్యలు ఎదురవుతున్నా.. బిసిసిఐ, స్టేట్ అసోసియేషన్లు కలిసి సమర్థవంతంగా ఏర్పాట్లు చేశారు. మ్యాచ్‌లకు అంతరాయం కలగకుండా ఈ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించారు.



## మహిళల టి20లో ఆస్ట్రేలియా విజయం

### న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో చిత్తు

**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్ మహిళలతో మూడు టి20 సిరీస్‌ను ఆస్ట్రేలియా విజయంతో ఆరంభించింది. ఆక్లాండ్ వేదికగా శుక్రవారం జరిగిన తొలి టి20లో న్యూజిలాండ్‌ను 8 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా చిత్తు చేసింది. కివీస్ నిర్ధేశించిన 138 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఆసీస్ అమ్మాయిలు కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 13.3 ఓవర్లలోనే ఛేదించారు. లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా స్టార్ ఓపెనర్ బెతమూనీ విధ్వంసం సృష్టించింది. కేవలం 42 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్సర్ సాయంతో 75 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. ఆమెతో పాటు, మరో ఓపెనర్ జార్జియా వాల్ (31 బంతుల్లో 9 ఫోర్లతో 50 పరుగులు) హాఫ్ సెంచరీతో మెరిసింది. న్యూజిలాండ్ బౌలర్లలో తహుహు రెండు వికెట్లు సాధించగా, మిగితా బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు. అంతకు ముందు బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. వైట్‌ఫెర్న్స్ బ్యాటర్లలో అమీలియా కేర్ (51 నాటౌట్) టాప్ స్కోరర్గా నిలవగా, సోఫీ డివైన్ (39) పర్వాలేదన్పించింది. ఆసీస్ బౌలర్లలో బ్రౌన్, మెక్‌గ్రాత్ తలా వికెట్ సాధించారు. ఇరు జట్ల మధ్య రెండో టీ20 ఈ నెల 23న మౌంట్ మౌంగనుయ్ వేదికగా జరగనుంది. కాగా ఆసీస్‌తో సిరీస్ కంటే ముందు శ్రీలంకతో జరిగిన వైట్‌బాల్ సిరీస్‌లను న్యూజిలాండ్ సొంతం చేసుకుంది.

## ఐఒసి చైర్మన్‌గా కోవెంట్రీ

### విశ్వ క్రీడల కమిటీకి తొలి మహిళ



**న్యూఢిల్లీ:** విశ్వక్రీడలకు సంబంధించి అత్యున్నత పదవి తొలిసారిగా మహిళను వరించింది. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఒసి) అధ్యక్షురాలిగా జింబాబ్వేకు చెందిన విఖ్యాత స్విమ్మర్, ప్రస్తుతం జింబాబ్వే ప్రభుత్వ క్రీడలమంత్రిగా ఉన్న కిర్‌స్టీ కొవెంట్రీ ఎన్నికయింది. ఈ అత్యున్నత పదవి కోసం ఏడుగురు పోటీపడగా, బరిలో ఉన్న ఏకైక మహిళా ప్రతిప్రనిధి 41 ఏళ్ల కొవెంట్రీ తొలి రౌండ్లోనే స్పష్టమైన ఆధిక్యంతో విజయాన్ని దక్కించుకుంది. ఐఒసిలోని 97మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనగా, విజయానికి అవసరమైన 49ఓట్లు కొవెంట్రీకి తొలి రౌండ్లోనే లభించాయి. ఒలింపిక్ దినోత్సవమైన జూన్ 23న ఐఒసి అధ్యక్ష పదవిని అలంకరించనున్న కొవెంట్రీ ఎనిమిదేళ్ల పాటు (2033 వరకు) ఈ పదవిలో కొనసాగుతుంది. ప్రస్తుతం ఐఒసి అధ్యక్షుడిగా ఉన్న థామస్ బాచ్ ఈ పదవిలో గరిష్టంగా 12 ఏళ్లు పూర్తి చేసుకోవడంతో అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు. కొవెంట్రీ అధ్యక్షతన 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్, 2032 బ్రిస్బేన్ ఒలింపిక్స్ జరుగుతాయి. 2036 ఒలింపిక్స్ ఆతిథ్య దేశం ఎంపిక కూడా కొవెంట్రీ హయాంలోనే ఖరారవుతుంది. కాగా ఐఒసి అత్యున్నత పదవి దక్కించుకున్న తొలి ఆఫ్రికన్‌గా గుర్తింపు పొందిన కొవెంట్రీకి విశ్వ క్రీడల్లో ఘనమైన రికార్డు ఉంది. 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో, 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో పోటీ పడిన ఆమె మొత్తం 7 పతకాలు (2 స్వర్ణాలు, 4 రజతాలు, 1 కాంస్యం) సాధించింది. అలాగే ఏథెన్స్ ఒలింపిక్స్‌లో కొవెంట్రీ 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో స్వర్ణం, 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో రజతం, 200 మీటర్ల మెడ్లీలో కాంస్యం దక్కించుకుంది. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో కొవెంట్రీ200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో పసిడిపతకం సాధించగా, 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో రజతం, 200 మీటర్ల మెడ్లీలో రజతం, 400 మీటర్ల మెడ్లీలో రజతం కైవసం చేసుకుంది.

## స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ క్వార్టర్ ఫైనల్లో గాయత్రి, ట్రెసా జోడీ



**న్యూఢిల్లీ:** స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్న మెంట్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ జోరు కొనసాగిస్తోంది. మహిళల డబుల్స్ విభాగంలో గాయత్రి-ట్రెసా జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బాసెల్‌లో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో గాయత్రి-ట్రెసా ద్వయం 21-12, 21-8తో జర్మనీకి చెందిన అమెలీ లెహ్మాన్-సెలీన్ హుబ్ జంటపై విజయం సాధించింది.

ఇక పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్, ప్రపంచ మాజీ నంబర్ వన్ కిడాంబి శ్రీకాంత్, ప్రియాన్షు రజావత్ పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాంత్ 15-21, 11-21తో ప్రపంచ ఆరో ర్యాంకర్, చైనా లీ షిఫెంగ్ చేతిలో ఓటమి పాలవగా, ప్రియాన్షు 15-21, 17-21తో ఫ్రాన్స్‌కు చెందిన టోమా పొపోవ్ చేతిలో చుక్కెదురైంది.

## ఐపిఎల్ బాల్ ఒక్కోటీ రూ.18 వేలు



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) 2025 మరి కొద్ది గంటల్లో ప్రారంభమవుతోంది. ఈ లీగ్ 18వ సీజన్‌లో అనేక కొత్త నియమాలు కూడా అమలు కాబోతు న్నాయి. ఐపిఎల్ చరిత్రలో, గత 17 సీజన్లలో బ్యాట్స్‌మెన్ ఆధిపత్యం చెలాయించారు. కానీ ఈ లీగ్‌లో మ్యాచ్‌లు ఆడటానికి ఏ బంతిని ఉపయోగిస్తారో దాని ధర ఎంతో తెలుసా? ఐపిఎల్ లీగ్ మ్యాచ్‌లలో ఉపయోగించిన బంతి వెనుక ఇంట్రెస్టింగ్ స్టోరీ ఉంటుంది. ఈ బంతి చాలా గట్టిగా ఉంటుంది. ఈ బంతి తగిలి చాలా మంది బ్యాట్స్‌మెన్ బ్యాట్లు విరిగిపోయిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. అంతేకాదు కొన్నిసార్లు బౌండరీ అవతలి గాజు కూడా పగిలిపోయింది. మరి అంత గట్టి బాల్ వెనకున్న హిస్టరీ మరింత ఆసక్తి రేకెత్తిస్తోంది. ఐపిఎల్ మ్యాచ్‌లలో ఉపయోగించే బంతి కూకబుర్రాతో తయారు చేస్తారు. ఈ బాల్ తెలుపు రంగులో ఉంటుంది. ఈ బాల్ ను ఐపిఎల్‌లోనే కాకుండా ఐసిసి టోర్నమెంట్లలో, ఏదైనా ద్వైపాక్షిక సిరీస్‌లలో కూడా ఉపయోగిస్తారు. ఈ బాల్‌ను 1970నుంచి వాడుతున్నారు.

కూకబుర్రా బంతి ప్రత్యేకత ఏంటంటే దాని తోలు నాణ్యత. దీని కారణంగా బంతి ఎక్కువ దూరం ప్రయాణించగలదు. ఐపిఎల్‌లో చాలా ఫోర్లు, సిక్సర్లు కొట్టబడటానికి ఇదే కారణం. బంతి సీమ్ లోపల రెండు పొరలను మాత్రమే చేతితో కుట్టారు. బంతిపై మిగతా కుట్లు అన్నీ యంత్రం ద్వారా తయారు అవుతాయి. ఈ ఐపిఎల్ 2025లో కూడా కూకబుర్రా బంతిని ఉపయోగించబోతున్నారు. ఈ బాల్ ధర దాదాపు రూ.18 వేలుగా ఉంది. ఈ ఐపిఎల్‌లో మరి అటువంటి బాల్‌తో ఎవరు ఎన్ని ఫోర్లు, సిక్సులు కొడతారనేది ఉత్కంఠ రేపుతోంది.

## ఐదో రోజూ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, మార్చి 21:** స్టాక్ మార్కెట్లో బుల్ రన్ కొనసాగుతోంది. ప్రధాన షేర్లలో కొనుగోళ్లకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడంతో వరుసగా ఐదో రోజూ సూచీలు లాభాల్లో ముగిసాయి. చాలా కాలం తర్వాత స్మాల్ క్యాప్, మిడ్‌క్యాప్ స్టాక్‌లు పుంజుకోవడం సూచీలకు కలిసొచ్చింది. వరుసగా విక్రయదారులుగా నిలిచిన విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు దిగడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చింది. దీంతో సూచీలు లాభాల్లో ముగిసాయి. ఉదయం సెన్సెక్స్ 76,155 పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమై, చివరికి 557 పాయింట్లు లాభపడి 76,905.51 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా ఇంట్రాడేలో 32,402.70 పాయింట్ల వద్ద గరిష్టానికి చేరి, చివరికి 159 పాయింట్లు లాభపడి 23,350.40 పాయింట్ల వద్ద నిలిచింది. ఎన్‌టిపిసి, బజాజ్ ఫైనాన్స్, కోటాక్ మహీంద్రా బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, సన్‌ఫార్మా, నెస్లే ఇండియా, ఎల్‌అండ్‌టి, టాటా మోటార్స్, ఐసిఐసిఐ బ్యాంకు వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. ఇన్ఫోసిస్, టాటా



స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్ కంపెనీ, బజాజ్ ఫైనాన్స్ వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.85.99 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 71.76 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3,039 డాలర్ల వద్ద కొనసాగింది.

## 2030 నాటికి రెట్టింపు ఉద్యోగాలు

**ముంబై, మార్చి 21:** వేగంగా వృద్ధి చెందుతున్న భారత మార్కెట్ తమ కార్యకలాపాలకు సంబంధించి కీలకంగా ఎదుగుతోందని జర్మన్ సెమీ కండక్టర్ల సంస్థ ఇన్ఫినియోన్ టెక్నాలజీస్ సిఎంవొ ఆండ్రియాన్ ఉర్షిజ్ తెలిపారు. తమకు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 58వేల మంది, భారత్‌లో 2,500 మందికి పైగా ఉద్యోగులు ఉన్నట్లు చెప్పారు. భారత్‌లో పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తున్న నేపథ్యంలో 2023 నాటికి ఉద్యోగుల సంఖ్యను రెట్టింపు చేసుకోనున్నట్లు ఆయన వివరించారు. దేశీయంగా ఇతర భాగస్వాములతో కలిసి పని చేసే అవకాశాను పరిశీలిస్తున్నట్లు ఆండ్రియాస్ పేర్కొన్నారు. ప్రస్తుతానికి తమ గ్రూప్ ఆదాయంలో భారత్ వాటా సింగిల్ డిజిట్ స్థాయిలోనే ఉన్నప్పటికీ, రాబోయే రోజుల్లో ఇది మరింతగా పెరగనుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అయితే సమీప భవిష్యత్తులో ఇక్కడ తయారీ ప్లాంట్ ఆలోచనేదీ లేదని వివరించారు. మరోవైపు కొత్త ఆవిష్కరణలను వేగవంతం చేసే దిశగా ఎలక్ట్రానిక్స్ మైక్రో ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో స్టార్టప్‌లకు సహాయం అందించేందుకు వాణిజ్య, పరిశ్రమల శాఖ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆంద్రి యాన్ చెప్పారు.



సెమీకండక్టర్ పరిశ్రమలో ఇన్ఫినియాన్ టెక్నాలజీస్‌తో పాటు విభిన్న కంపెనీలు యువతకు అవకాశాలు కల్పిస్తుంది. ఈ పరిశ్రమలో ప్రధానంగా హార్డ్‌వేర్ డిజైన్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, చిప్ డిజైన్, క్వాలిటీ అష్యూరెన్స్, డిజైన్ అండ్ డెవలప్‌మెంట్, సేల్స్ అండ్ మార్కెటింగ్ వంటి విభాగాల్లో ఉద్యోగాలుంటాయి. ఇంటెల్, మైక్రాన్, ఇన్ఫినియన్ టెక్నాలజీస్, గ్లోబల్ ఫౌండ్స్ వంటి కంపెనీలు భారత్‌లో చురుకుగా నియామకాలు చేపడుతున్నాయి.

## భెల్‌కు రూ.7,50కోట్ల ఆర్డర్

**అహ్మదాబాద్, మార్చి 21:** 'ఉకై' సూపర్‌క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి రూ.7,500 కోట్ల విలువైన ఆర్డర్‌ను పొందినట్లు ప్రభుత్వ యాజమాన్యంలోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్) శుక్రవారం తెలిపింది. గుజరాత్ స్టేట్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ లిమిటెడ్ (జీఎస్ఈసిఎల్) ద్వారా ఈ ఆర్డర్ పొందినట్లు 'భెల్‌కు రూ.7,50కోట్ల ఆర్డర్' వచ్చిందని భెల్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ యూనిట్ 54 నెలల్లో వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించనుంది. గుజరాత్‌లోని తాపి జిల్లాలో ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్స్ట్రక్షన్ ప్రాతిపదికన 1800 ఎండబ్ల్యూ 'ఉకై' సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ యూనిట్-7ను ఏర్పాటు చేయడానికి అంతర్జాతీయ పోటీ బిడ్డింగ్ కింది భెల్ ఈ ఆర్డర్‌ను పొందింది. ఈ ప్రాజెక్టులో భెల్ డిజైన్, ఇంజినీరింగ్ తయారీ, సరఫరా, టెస్టింగ్, కమీషనింగ్‌తో పాటు అవసరమైన అన్ని విద్యుత్, సివిల్, నిర్మాణ పనులను అందిస్తుంది. ఉకైలోని మొదటి థర్మల్ యూనిట్‌ను 1976లో భెల్ స్థాపించింది. దశాబ్దాలుగా వీరి విజయవంతమైన భాగస్వామ్యం కొనసాగుతూ ఉంది.

## వాడుకలో లేని నంబర్లకు యుపిఐ సేవలు బంద్!

# వాణిజ్యం

**న్యూఢిల్లీ, మార్చి 21:** ఇన్‌యాక్టివ్ లేదా వేరే వారికి కేటాయించిన మొబైల్ నంబర్లకు ఏప్రిల్ 1 నుంచి యుపిఐ సేవలు నిలిచిపోనున్నాయి. ఈ మేరకు బ్యాంకులు, పేమెంట్ సేవలందించే ప్రొవైడర్లకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) ఆదేశాలు జారీచేసింది. అనధికారిక వాడకాన్ని, మోసాలను అరికట్టేందుకు ఆ నంబర్లను డీయాక్టివేట్ చేయాలని సూచించింది. యుపిఐ వినియోగంలో మొబైల్ నంబర్ కీలకం. ఈ సేవల్లో ఒటిపి వెరిఫికేషన్ కీలక భూమిక పోషిస్తుంది. అందుకే ఎన్‌పిసిఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఎక్కువకాలం పాటు వినియోగంలో లేని మొబైల్ నంబర్లను టెలికం కంపెనీలు వేరొకరికి కేటాయిస్తుంటాయి. దీంతో దీర్ఘకాలం పాటు మనం వాడే నంబర్లు వేరొకరికి చేరుతుంటాయి. దాంతో యుపిఐ ఖాతాలు కూడా వారి చేతిలోకి వెళ్లే అవకాశంఉంది. దీని వల్ల అనధికారిక, మోసపూరిత లావాదేవీలు జరిగే అవకాశం ఉంది. వీటిని నివారించేందుకు ఎన్‌పిసిఐ ఆదేశాల మేరకు గూగుల్ పే, ఫోన్ పే, పేటిఎం వంటి యాప్స్‌తో పాటు బ్యాంకులు ఇన్‌యాక్టివ్ నంబర్లను తొలగించనున్నాయి. ఇన్‌యాక్టివ్‌లో ఉన్న, ఇతరులకు అసైన్ చేసిన, డీయాక్టివ్ చేసిన మొబైల్ నంబర్లు బ్యాంకులు, పేమెంట్ ప్రొవైడర్లు తొలగిస్తాయి. ఒకవేళ అందులో మీ నంబర్ ఉంటే, యుపిఐ సర్వీసులను నిలిపివేస్తున్నట్లు నోటిఫికేషన్ పంపిస్తాయి. నోటిఫికేషన్ తర్వాత కూడా నంబర్ ఇన్‌యాక్టివ్‌లోనే ఉంటే మోసాలను అరికట్టేందుకు యుపిఐ నంబర్లను బ్యాంకులు డీలిస్ట్ చేస్తాయి. మొబైల్ నంబర్ మార్చినా బ్యాంకుల వద్ద ఆ నంబర్ ను అప్‌డేట్‌చేయని వారి మీద ప్రభావం ఉంటుంది. యుపిఐతో లింక్ చేసి కాల్స్, ఎస్సెమ్మెస్‌లు వంటివేవీ చేయకుండా దీర్ఘకాలం పక్కనపెట్టిన వారిపై, బ్యాంకు వివరాలను అప్‌డేట్ చేయకుండా మొబైల్ నంబర్‌ను సరెండర్ చేసిన వారు అవాంతరాలు ఎదుర్కొంటారు. పాత నంబర్‌ను వేరొకరికి అసైన్ చేసిన సందర్భాల్లో పాత నంబర్ హోల్డర్లపై ఈ ప్రభావం ఉంటుంది.



## స్వేచ్ఛా వాణిజ్యంలో సుంకాలపై ఫోకస్

**న్యూఢిల్లీ, మార్చి 21:** ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల్లో (ఎఫ్‌టిఏ) దిగుమతి సుంకాన్ని, టారిఫ్‌యేతర అంశాల్లాంటి ప్రధాన వాణిజ్య అవరోధాలపై ముందుగా దృష్టిపెడుతున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బరత్‌వాలా తెలిపారు. సాధారణంగా ఇవి ఓ కొలిక్కి వచ్చేసరికి ఎక్కువ సమయంలో పట్టేస్తుందని, అప్పటికల్లా అందరికీ ఎఫ్‌టిఎలపై ఆసక్తి తగ్గిపోతుందని ఆయన పేర్కొన్నారు. అందుకే టారిఫ్‌లు, టారిఫ్‌యేతర అడ్డంకులు, నియంత్రణ సంస్థలపరమైన సమస్యలు మొదలైన వాటిని ముందుగా పరిష్కరించుకునే విధానం పాటించడం శ్రేయస్కరమని చెప్పారు. సిఐఐ నిర్వహించిన ఇండియా-ఎల్ఏసి (లాటిన్ అమెరికా-కరీబియన్) బిజినెస్ సదస్సులో పాల్గొన్న సందర్భంగా సునీల్ ఈ విషయాలు వివరించారు. భారత్ ఇప్పటికే బ్రెజిల్, పరాగ్వే తదితర దేశాలతో వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరుపుతోందని, ఎల్ఏసి ప్రాంత దేశాలతో కూడా అవరోధాలను అధిగమించే అవకాశాలను పరిశీలిస్తోందని చెప్పారు. ప్రపంచ దేశాలు రక్షణాత్మక ధోరణులను తగ్గించుకుని వాణిజ్య వృద్ధికి ఊతమివ్వాలని సూచించారు. ఆటోమొబైల్, మెడికల్ డివైజ్‌లు, ఫార్మా తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించుకునేందుకు అవకాశాలు ఉన్నాయని సునీల్ చెప్పారు.



## బీమా సలహా కమిటీలో కొత్త సభ్యులు..

**ముంబై, మార్చి 21:** భారత బీమా ఫ్రేమ్ వర్క్‌ను బలోపేతం చేయడమే లక్ష్యంగా బ్యాంకింగ్, అసెట్ మేనేజ్‌మెంట్, ఇన్సూరెన్స్ రంగాలకు చెందిన ఐదుగురు కీలక వ్యక్తులను బామీ సలహా కమిటీ (ఐఎసి)లో భారత బీమా నియంత్రణ సంస్థ నియమించిందఇ. ఇన్సూరెన్స్ రంగంలో ఎదురవుతున్న సవాళ్లు, అవకాశాలను పరిష్కరించే బాధ్యతను కొత్తగా ఏర్పాటైన కమిటీకి అప్పగించారు. దేశంలో బీమా నియంత్రణ భవిష్యత్తును రూపొందించడానికి కార్యాచరణ సిఫార్సులను వివరిస్తూ మూడు నెలల్లో ఈ కమిటీ సమగ్ర నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యుల్లో ఎల్ఐసి మాజీ చైర్మన్, బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రస్తుత నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఎంఆర్ కుమార్, ఎస్‌బిఐ మాజీ చైర్మన్ దినేషన కుమార్ ఖారా, ఆదిత్య బిర్లా కేపిటల్ సిఇఒ విశాఖ ములే, కోటక్ మహీంద్రా ఎఎంసి ఎండి నీలేష్ షా, జిఐసి రే మాజీ సిఎండి, ఎయిరిండియా, టాటా ఎఐఎ లైఫ్ స్వతంత్ర డైరెక్టర్ ఆలిస్ జి వైద్యన్‌లు ఉన్నాయి. పాలసీలకు సంబంధించిన నిర్ణయాల్లో ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డిఎఐ)కు సలహాలు ఇచ్చే ఐఎసి మూడు నెలల్లో తన నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. ఈ సిఫార్సులను ఆర్థిక మంత్రిత్వ శాఖకు పంపుతారు. కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఇన్సూరెన్స్ కంపెనీల్లో ఎఫ్‌డిఐల వాటాను 100 శాతానికి పెంచుకునేలా ప్రాథమికంగా ఆమోదం తెలిపింది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps